సిఎస్ రేసులో ముగ్గురు..!

- నెలాఖరుకు రిటైర్డు కానున్న సిఎస్ నీరబ్ కుమార్

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 141 | విజయవాడ, సోమవారం 23 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 23 December 2024 | Rs

అండర్-19 ఛాంపియన్ భారత్

- మహిళల ఆసియా కప్ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై భారత అమ్మాయిల గెలుపు

7

సంఘటనా స్థలంలో జాగిలంతో పోలీసులు

రాయచోటిలో కాల్పులు

- ఒకరు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటి మండల పరిధిలోని మాధవరం, కాటిమాయకుంట గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున జరిగిన తుపాకీ కాల్పుల్లో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... కాటిమాయకుంట సమీపంలో గుడిసెలు వేసుకుని చిక్కు వెంట్రుకలు, పాత సామాన్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సంబేపల్లె మండలం నామాలగుట్టకు చెందిన నీలకంఠ హనుమంతు (50), సల్ల రమణ మాధవరం గ్రామంలోని మద్దెలకుంట గ్రామానికి వెళ్తున్నారు. ఆ మార్గంలో రోడ్డుపక్క ఉన్న గుట్టల్లోంచి గుర్తు తెలియని వ్యక్తులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో, ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. నెత్తిరోడుతూనే వారు తమ గుడిసెల వద్దకు చేరుకున్నారు. బంధువులు గమనించి వారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు సిఫార్స్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ హనుమంతు మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రమణపై రెండు రౌండ్లు కాల్పులు జరపగా, హనుమంతుపై ఒక రౌండ్ కాల్పులు జరిపినట్లు డాక్టర్లు గుర్తించారు. వారికి ఎవరితోనూ విభేదాలు లేవని, కాల్పులు ఎందుకు జరిపారో తెలియదని బంధువులు అంటున్నారు. ఈ ఘటన నేపథ్యంలో రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసు జాగిలంతో కాటిమాయకుంట గ్రామ శివారు ప్రాంతంలోని గుట్టల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. కాటిమాయకుంట గ్రామానికి పడమర వైపు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకూ జాగిలం వెళ్లి ఆగింది. అక్కడ రక్తపు చుక్కలను పోలీసులు గుర్తించారు. రాయచోటి అర్బన్ సిఐ చంద్రశేఖర్, రూరల్ సిఐ తులసీరామ్, ఎస్ఐ నర్సింహారెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ రెండు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తున్నారు. తుపాకీ కాల్పుల ఘటనలో రాయచోటి పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

మంత్రి 'మండిపల్లి' ఆరా

ఈ ఘటనపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. మంత్రి ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడుతో ఫోన్లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. కాల్పుల ఘటన నేపథ్యంలో ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కాల్పుల్లో గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని, సమగ్ర దర్యాప్తు వేగవంతం చేసి కాల్పులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్నికల నిబంధనల సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్
- అవి పార్టీల, అభ్యర్థుల హక్కును హరిస్తాయి

న్యూఢిల్లీ : ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనల సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఎన్నికల నిబంధనలకు ప్రతిపాదిత సవరణలపై పొలిట్‌బ్యూరో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీడియో, ఇతర డిజిటల్ ట్రయల్స్‌తో సహా ఎలక్ట్రానిక్ రికార్డులు పొందేందుకు రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ప్రస్తుతం ఉన్న అవకాశాన్ని ఈ సవరణల ద్వారా హరించాలని మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

'ఎన్నికల కమిషన్ డిజిటల్ విధానాన్ని చేపట్టిన తొలినాళ్లలో మరింత పారదర్శకత ఉండేలా చూడడం కోసం రాజకీయ పార్టీలతో సంప్రదించింది. ఇప్పుడు కొత్త నిబంధనలు రూపొందించేందుకు ఎన్నికల కమిషన్‌తో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరిపినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. ఎంతోకాలంగా అనుసరిస్తూ వస్తున్న స్థిరమైన సంప్రదాయానికి భిన్నంగా ఎన్నికల సంఘం ఇప్పుడు వ్యవహరిస్తోంది. కొత్త నిబంధనల విషయంలో రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే వీటికి సమ్మతి ఉన్నట్లు ఎన్నికల సంఘం చెబుతోంది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు పిటిషనర్‌కు గల హక్కును ప్రశ్నించేలా ప్రభుత్వ వాదన ఉంది. ఈ వైఖరే నిబంధనల రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రమేయానికి సంబంధించి అనుసరించాల్సిన పద్ధతులను పూర్తిగా మినహాయించేలా చేస్తోందని మిగతా 6లో

ప్రైవేటు మార్కెట్ యార్డులు

వ్యవసాయంలో కార్పొరేట్ల చొరబాటుకు మోడీ సర్కార్ దారులు

- ఎపిఎంసి యాక్టు, రూల్స్, పాలసీలకు 12 మార్పులు
- కాంట్రాక్టు సాగు, సంస్కరణల కోసం రాష్ట్రాలకు ఫ్రేమ్‌వర్క్
- దొడ్డిదారిన నల్ల చట్టాల అమలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వ్యవసాయరంగంలోకి స్వేచ్ఛగా కార్పొరేట్లు చొరబడటానికి, మార్కెట్‌ను హస్తగతం చేసుకోడానికి వీలుగా మోడీ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చట్టాల్లో, విధానాల్లో, నిబంధనల్లో సమూల మార్పులకు తెర తీసింది. రైతుల వీరోచిత పోరాటంతో వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకున్నట్లు నటించిన కేంద్ర బిజెపి సర్కార్, దొడ్డిదారిలో వాటి అమలుకు విధాన రూపకల్పన చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ (ఎపిఎంసి) అంశం రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల పరిధిలో చేర్చినందున, తాను రూపొందించిన 'సంస్కరణ'లను ఫ్రేమ్ వర్క్ పేరిట నవంబర్ 25న రాష్ట్రాలకు పంపి తప్పనిసరిగా అమలు చేయాలని నిర్దేశించింది. మన రాష్ట్రానికి కూడా సదరు ఫ్రేమ్‌వర్క్ వచ్చింది. అందుకనుగుణంగా చర్యలకు టిడిపి కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కొన్ని సంస్కరణలు ఇప్పటికే ఎపిలో నోటిఫై అయ్యాయి. ప్రైవేటు మార్కెట్ యార్డులు నెలకొల్పడం దగ్గర నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్పొరేట్లకు సులభతర వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), కాంట్రాక్టు సాగు వరకు పలు దుర్మార్గమైన అంశాలు మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన ఫ్రేమ్‌వర్క్‌లో ఉన్నాయి.

సంతలనూ వదల్లేదు

దేశంలో వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నది ఫ్రేమ్ వర్క్ ఉవాచ. ఒక పద్ధతి ప్రకారం వ్యవస్థ లేనందున రైతులకు ఆదాయం రావట్లేదని బాధ వ్యక్తం చేసింది. ఇంకా ఏమన్నదంటే... రాష్ట్రాలు రూపొందించిన ఎపిఎంసి చట్టాల ప్రకారం మార్కెట్ కమిటీలు పని చేస్తున్నాయి. ఒక్కో మార్కెట్ కమిటీ పరిధిలో నోటిఫై అయినా పని చేయని, నిర్వహణ సరిగ్గా లేనివి, ఇంకా ప్రారంభించని, సరైన మౌలిక సదుపాయాల్లేని యార్డులున్నాయి. ఎపిఎంసి చట్ట పరిధిలోనే హోల్‌సేల్ మార్కెట్లు, ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లు పని చేస్తున్నాయి. మొత్తంగా 27 రాష్ట్రాల్లో 7,057 మార్కెట్ కమిటీలున్నాయి. ఒక్కో కమిటీ పరిధి 407 చదరపు కిలోమీటర్లుగా ఉంది. ఎపిలో అయితే అది 512 చదరపు కిలోమీటర్లు. ఇక్కడ 318 ఎఎంసిలు ఉన్నాయి. ఇంత ఎక్కువ వైశాల్యంలో మార్కెట్లను నిర్వహించడం కష్టమవుతోంది. స్థానిక సంస్థల నిర్వహణలో మార్కెట్‌లు ఉన్నాయి. గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో వేల సంఖ్యలో సంతలు నడుస్తున్నాయి. ఎపి, తెలంగాణ తదితర చోట్ల రైతులు నేరుగా తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతు బజార్ల వంటివి ఉన్నాయి. వీటన్నింటిపై సరైన అజమాయిషీ, పరిపాలన, డేటా, మిగతా 6లో

మన్యంలో నేటికీ డోలీ మోతలు

అమలు కాని హామీలు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం

మన్యంలో నేటికీ డోలీ మోతలు కొనసాగుతున్నాయని, ఈ విషయంలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో డోలీ మోతల నివారణకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగు నెలల క్రితం ప్రకటించారని గుర్తు చేశారు. కానీ, నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వివరించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నెలకొక రోజు మన్యంలో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని, డోలీ మోతలు లేని ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకుంటానని ఇటీవల ప్రకటించారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ పర్యటించిన ముందు రోజు కూడా డోలీ మోత జరిగినట్లు మీడియాలో కథనాలు వచ్చాయని గుర్తు చేశారు. అక్కడ డోలీ మోతలు నిత్యకృత్యమయ్యాయని తెలిపారు. విద్య, వైద్యం, హక్కులతో పాటు ఆదివాసీలకు కీలకమైన భూ సమస్యను పవన్ విస్మరించారన్నారు. సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారని, సనాతన కాలం నుంచి అటవీ భూములపై ఆదివాసులకు హక్కు ఉందని పేర్కొన్నారు. అటువంటి హక్కును బ్రిటిష్ పాలకులు లాక్కుంటే దానికి వ్యతిరేకంగా ప్రాణాలు త్యాగం చేసి పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

వివరించారు. అలాంటి ప్రాంతంలో అటవీ సంపదను అదాని వంటి కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ల వ్యాపారాభివృద్ధికి మన్యంలో ఆరు లైన్ల హైవేను వేస్తున్నారని, గిరిజన ప్రాంతాలకు మాత్రం రోడ్లు వేయడం లేదని వివరించారు. పోడు భూములపై పట్టా హక్కులు, కాఫీ తోటలపై ఆదాయం పెంపు, మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయం తమకే దక్కాలని గిరిజనులు కోరుకుంటున్నారన్నారు. నీటి వనరులపై వాళ్లకే హక్కు ఉంటే వారి జీవితాలు బాగుపడతాయని తెలిపారు. పవన్ కల్యాణ్ వీటిపై అసలు పెదవి విప్పలేదన్నారు. నిజంగా సనాతన ధర్మాన్ని రక్షించాలనుకుంటే సనాతన కాలం నుంచి హక్కు ఉన్న పోడు భూములకు పట్టాలు ఇస్తామని ఎందుకు చెప్పడం లేదని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. గ్రామసభ అనుమతులు లేకుండా మైనింగ్, హైడల్ ప్రాజెక్టు కోసం అదానీ కంపెనీలకు భూములు ధారాదత్తం చేసే విధానాలను వ్యతిరేకిస్తామని, గ్రామ సభలో ప్రజలు వ్యతిరేకిస్తే వీటిని ఆపేస్తామని చెప్పాలన్నారు. గత ప్రభుత్వానికి అదాని రూ.1,750 కోట్లు లంచం ఇచ్చారని, ఈ మేరకు అమెరికా కోర్టులో కేసులు నమోదయ్యాయన్నారు. ఈ విషయాలపై ఎందుకు మాట్లాడట్లేదని, అవినీతి జరిగిందని తెలిసి కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, తప్పుడు విద్యుత్తు ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. దానిపై అధ్యయనం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్నారని, అధ్యయనానికి ఎన్ని రోజులు పడుతుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రజలపై రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాలు వేసి మరోసారి భారాలు మోపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సెకితో జరిగిన అదాని ఒప్పందాన్ని యథాతథంగా పైకి పంపించారన్నారు. డిస్కముల ప్రతిపాదనలు పెట్టాయంటే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం ఇచ్చినట్టే కదా అని పేర్కొన్నారు. కాకినాడ సెజ్‌లో సుమారు 650 ఎకరాల ప్రభుత్వ భూమి మిగతా 6లో

దల్లేవాల్‌ను పరామర్శిస్తున్న నాయకులు

రైతు నాయకుడు దల్లేవాల్ పరిస్థితి విషమం

- 27 వ రోజుకు చేరిన ఆమరణ నిరాహార దీక్ష

చండీగఢ్: కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని కోరుతూ గత నాలుగు వారాలుగా నిరాహార దీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ పరిస్థితి విషమించినట్లు వైద్యులు తెలిపారు. పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లా ఖనౌరీ సరిహద్దు దగ్గర ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం నాటికి 27వ రోజుకు చేరింది. దల్లేవాల్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయనకు గుండె ఆగిపోవడం బహుళ అవయవ వైఫల్యం సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతి రైతుకు కనీస మద్దతు ధర కల్పించడం ప్రాథమిక హక్కు లాంటిదని మిగతా 6లో

బ్యాంకులకు 1.96 లక్షల కోట్లు ఎగవేత

- ఆర్‌బిఐ వెల్లడి
- టాప్ 100 ఎగవేతదారుల జాబితా విడుదల

ముంబయి: కేంద్రంలో మోడీ ప్రభుత్వ అండ చూసుకుని కార్పొరేట్ సంస్థలు బ్యాంకులకు చెల్లించాల్సిన రుణ బకాయిలను యథేచ్ఛగా ఎగగొడుతున్నాయి. ఆర్‌బిఐ ఆదివారం విడుదల జేసిన వివరాల ప్రకారం 2024 మార్చి 31 నాటికి 2,664 కార్పొరేట్ సంస్థలు మొత్తం 1,96, 441 కోట్ల రుణ బకాయిలనుఉద్దేశపూర్వకంగా ఎగవేశాయి. వీటిలో టాప్ 100 కార్పొరేట్ డిఫాల్టర్ల జాబితాను రిజర్వు బ్యాంకు వెల్లడించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ముందు క్లెయిమ్ చేసిన డిఫాల్టర్లలో వాస్తవ, ఉద్దేశపూర్వక డిఫాల్టర్లను వర్గీకరించి చూడగా 2,664 కార్పొరేట్ సంస్థలుఉద్దేశపూర్వకంగా ఎగవేసిన రుణ బకాయిలే 1.96 లక్షల కోట్లుగా తేలింది. భారత కార్పొరేట్ రంగం బ్యాంకులను పబ్లిగ్గా ఎలా లూటీ చేస్తున్నదీ తెలుసుకునేందుకు ఇదొక చక్కటి ఉదాహరణ. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సమాచార హక్కు (ఆర్‌టిఐ) ప్రశ్నలకు సమాధానమిస్తూ జూన్ 2024 నాటికి ఉద్దేశపూర్వకంగా 8,516 కోట్లతో గీతాంజలి లిమిటెడ్ అగ్ర స్థానంలో ఉన్నట్లు ఆర్‌బిఐ టాప్ 100 కార్పొరేట్ డిఫాల్టర్ల (వ్యక్తులు, విదేశీ రుణ గ్రహీతలను మినహాయించి) వివరాలను



వెల్లడించింది. ఆర్‌బిఐ డేటా ప్రకారం 2020లో ఇటువంటి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్య 2,154 వుండగా, 2024 నాటికి ఇది 2,664కి పెరిగింది. వీరు చెల్లించాల్సిన మొత్తం 2020లో 1,52, 860 కోట్లు కాగా, 2024 నాటికి ఇది 1,96, 441 కోట్లకు పెరిగింది.

ఉద్దేశ పూర్వక డిఫాల్టర్ అని ఎవరిని అంటారు?

ఆర్‌బిఐ నిర్వచనం ప్రకారం రుణగ్రహీత బాధ్యతలను గౌరవించే స్తోమత ఉన్నప్పటికీ రుణదాతకు తిరిగి చెల్లించడంలో డిఫాల్ట్ అయినట్లైతే ఉద్దేశపూర్వక డిఫాల్టర్ అని ప్రకటిస్తారు. రుణ గ్రహీత రుణ దాత నుండి తీసుకున్న రుణాన్ని నిర్దిష్ట ప్రయోజనం కోసం కాకుండా మిగతా 5లో

అల్లు అర్జున్ ఇంటి వద్ద ఆందోళనకారులను అడ్డుకుంటున్న ఆయన భద్రతా సిబ్బంది

అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి

- రేవతి కుటుంబానికి న్యాయం చేయాలని ఒయు జెఎసి నాయకుల డిమాండ్
- పలువురు అరెస్టు
- దాడులను ఉపేక్షించబోమన్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై ఉస్మానియా విశ్వవిద్యాలయం జెఎసి నాయకులు కొందరు దాడి చేశారు. ఆయన ఇంటిపై రాళ్లు రువ్వారు. ఇంటి ముందున్న పూల కుండీలను ధ్వంసం చేశారు. వారిపై అల్లు అర్జున్ బౌన్సర్లు దాడి చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. రేవతి మిగతా 6లో

మోడీకి కువైట్ అత్యున్నత పురస్కారం

కువైట్ సిటీ : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కువైట్ అత్యున్నత పురస్కారం లభించింది. 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'ను మోడీకి ఆదివారం కువైట్ ప్రభుత్వం బహుకరించింది. కువైట్ చక్రవర్తి షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జబెర్ అల్-సబాహ్ ఆహ్వానం మేరకు కువైట్‌లో రెండు రోజుల పాటు పర్యటించిన మోడీకి ఇది ఒక దేశం నుంచి వచ్చిన 20వ అంతర్జాతీయ పురస్కారం. 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్' అనేది కువైట్ ప్రభుత్వ పురస్కారం. ఇతర దేశాలతో స్నేహానికి చిహ్నంగా దేశాధినేతలు, విదేశీ సార్వభౌమాధికారులు, విదేశీ రాజ కుటుంబాల సభ్యులకు ఈ పురస్కారాన్ని కువైట్ అందజేస్తుంది. గతంలో బిల్ క్లింటన్, ప్రిన్స్ చార్లెస్, జార్జ్‌బుష్ వంటి విదేశీ నాయకులకు బహుకరించింది.

అమరావతిపై నిరంతర పర్యవేక్షణ

- కన్సల్టెన్సీలతో పనులపై నిఘా
- చెప్పినవి అమలు చేయకపోతే నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతికి రుణం ఇస్తున్న ప్రపంచబ్యాంకు నిరంతరం పర్యవేక్షణ చేయనుంది. ఒప్పందాల్లో భాగంగా పరపతి నివేదికలో ఈ అంశాన్ని ప్రపంచబ్యాంకు ప్రస్తావించింది. ప్రతి పనినీ సొంత కన్సల్టెన్సీలతో పర్యవేక్షణ చేయనుంది. దీనికోసం టెండర్లకు సంబంధించిన సమాచారం, చేపడుతున్న కంపెనీలు, వాటి వివరాలూ, చేస్తున్న పని వివరాలనూ ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. వీటిపై ప్రపంచబ్యాంకు సూచించిన కన్సల్టెన్సీలు తనిఖీలు చేస్తుంటాయి. ఒప్పందంలో పేర్కొన్న పని జరిగిందని, మిగిలిన నిధులు విడుదల చేయొచ్చని అవి సూచిస్తే నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ ఉంటారు. దీనికోసం సెక్షన్ 4లో అనేక అంశాలు పేర్కొన్నారు. డిస్బర్సమెంట్ లింక్డ్ రిజల్ట్స్(డిఎల్ఆర్-పంపిణీ నిధుల ఫలితాలు)ల్లో ఎప్పుడు ఏమి చేస్తామన్నారు.



ఏమిచేయాలనే విషయాలను ప్రస్తావించారు. అమరావతికి రుణం అంగీకరించే నాటికి అమెరికన్ డాలరుకు రూ.84.09పైసలుగా పేర్కొంది. రుణ ఒప్పంద పత్రాన్ని గ్రహీతలు ఎక్కడా బహిర్గతం చేయకూడదని, ప్రపంచబ్యాంకు అనుమతి లేకుండా కంటెంట్ కూడా చెప్పకూడదని మొదటిపేజీ నిబంధనల్లోనే స్పష్టంగా పేర్కొన్నారు. తాము ఇచ్చే రుణానికి అనుగుణంగా పేర్కొన్న నిబంధనలు అమలు చేశామని ఎప్పటికప్పుడు వారు నివేదిక సమర్పించాల్సి ఉంది. అయితే అప్పటి వరకూ డ్రా చేసుకున్న నిధులు వినియోగానికి సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. దీనిపై సంతృప్తి చెందితే తరువాత నిధులు ముందస్తుగానే డ్రా చేసుకోవచ్చని పేర్కొంది. సెక్షన్ 4 పార్ట్ బి1లో ఈ అంశాన్ని పేర్కొన్నారు. నిధులు డ్రా చేసుకున్న తరువాత చెప్పిన నిబంధనల అమలు సంతృప్తికరంగా లేకపోతే బ్యాంకు ఇచ్చిన క్లోజింగ్ సమయంలోపు అడ్వాన్స్‌ను తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందని సెక్షన్ 4 పార్ట్ బి2లో పొందుపరిచారు. అలాగే సూచించిన తేదీలోపు ఫలితాలు సాధించలేకపోతే బ్యాంకు రుణ గ్రహీతకు నోటీసు ఇస్తుందని, విత్‌డ్రా చేసుకోకుండా మిగిలిన మొత్తాన్ని షెడ్యూలు 4లో పేర్కొన్న ఫార్ములా ప్రకారం తగ్గిస్తామనీ సెక్షన్ 4 పార్ట్ బి2లో పొందుపరిచారు. అమరావతిని రెండు దశల్లో అమలు చేయనుండగా మొదటిదశలో రూ.30,644 కోట్లు ఖర్చు చేయనున్నారు. నిబంధనల ప్రకారం అమరావతిలో పట్టణాభివృద్ధి సదుపాయాల అమలు, నిర్మాణాలకు చట్టపరమైన అనుమతులు తీసుకోవాల్సి ఉందని స్పష్టంగా పొందుపరిచారు. మొదటిదశ అభివృద్ధిలో 2025-2029 మధ్యకాలంలో సదుపాయాలు, మంచినీటి సరఫరా, అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ ఒకటో జోన్ నుండి ఏడో జోన్ పదోజోన్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రపంచబ్యాంకు ప్రొగ్రామ్ ఫర్ రిజల్ట్స్(పిఫర్ఆర్)లో అమరావతి గరవ్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోని భవనాలు, ఒకటీ మూడు జోన్లు, 5బి, 5డి, 6 జోన్లలో ఫలితాలు సాధించాలని పేర్కొంది. ప్రపంచబ్యాంకు, ఎడిబి రెండూ సమన్వయంతో నిధులు విడుదల చేయంతోపాటు ఒకే సంస్థ ద్వారా తనిఖీలు నిర్వహిస్తాయనీ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు.

క్షేత్ర స్థాయిలో సిపిఎంను
మరింత బలోపేతం చేయాలి

- కాకినాడ జిల్లా మహాసభలో వి శ్రీనివాసరావు పిలుపు

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కార్మిక, కర్షక ప్రయోజనాల కోసం కృషి చేస్తూ క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతంగావించేందుకు కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రతినిధులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి వంటి మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తున్నది సిపిఎం మాత్రమేనన్నారు. కార్మికుల సగటు వేతనాలు తగ్గిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గ ప్రయోజనాల లక్ష్యంగా పనిచేయాల్సి ఉందని తెలిపారు. అదాని, అంబాని వంటి కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతున్న ప్రధాని మోడీకి ప్రజలు కష్టాలు, సమస్యలు, ఇబ్బందులు పట్టడం లేదన్నారు. బిజెపి పాలనలలో నేడు దేశంలో ప్రతికూల రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రాంతీయ పార్టీలను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ మెయిల్ చేస్తోందని విమర్శించారు. దేశ రాజకీయాల్లో సానుకూల పరిస్థితులు తీసుకొచ్చేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలు పెద్ద ఎత్తున నమ్మకం పెట్టుకుని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, అయితే, గెలిచాక చంద్రబాబు ప్రజలపై భారీగా భారాలు మోపుతున్నారని వివరించారు. కాకినాడ పోర్ట్ విషయంలో కార్మికుల పొట్టగొట్టే యత్నాలు ముమ్మరం అయ్యాయని, వాటిని ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు.

ప్రజా పోరాటాలకు రూపకల్పన చేయండి : ఎవి నాగేశ్వరరావు

ఈ మహాసభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలకు రూపకల్పన చేయాలని సూచించారు. వివిధ రంగాల్లోని కార్మికులు భద్రత రక్షణ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనాలు అమలు కావట్లేదని తెలిపారు. కౌలు రైతులకు భరోసా లేకుండా పోయిందన్నారు. మహిళలు, దళితులపై నిరంతరం దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్పొరేట్ల ప్రయోజనాలు తప్ప పేదల సమస్యలు పట్టడం లేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

నూతన కార్యదర్శిగా కరణం ప్రసాదరావు

ఈ మహాసభలో సిపిఎం కాకినాడ జిల్లా నూతన కమిటీ సభ్యులుగా 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కరణం ప్రసాదరావు ఎన్నికయ్యారు.

స్థానిక సమస్యలపై పోరాటాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపు
- ముగిసిన పార్టీ అనకాపల్లి జిల్లా మహాసభ

మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

స్థానిక సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారమయ్యే వరకూ పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభ నర్సీపట్నంలో ఎ.బాలకృష్ణ నగర్, సత్తిబాబు ప్రాంగణం, మళ్ల సత్యనారాయణ వేదికగా జరిగింది. రెండో రోజైన ఆదివారం ఉదయం పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు త్రిమూర్తులు రెడ్డి అవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద నాయకులు నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధుల సభను ఉద్దేశించి వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. నివాసిత ప్రాంతాల్లోని సమస్యలపై పనిచేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గనాయుడు మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక సరళీకరణ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా బలమైన ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక, సంపన్న అనుకూల విధానాలు అమలు చేయడంతో ప్రజా సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ప్రత్యామ్నాయ విధానాలపై చేసిన పోరాటాలతో శ్రీలంకలో వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అటువంటి పోరాటాలు మన దేశంలోనూ జరగాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే జమిలి ఎన్నికలను రాష్ట్రంలోని వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు సమర్థించడం విచారకరమన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం వసూలు చేసిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వేదికపై పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తదితరులు ఉన్నారు. పార్టీ జిల్లా మహాసభ 22 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. అనకాపల్లి జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

జిల్లా కార్యదర్శిగా జి.కోటేశ్వరరావు

జిల్లా కమిటీ సభ్యులుగా 21 మంది, నూతన కార్యదర్శిగా జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కె.లోకనాథం, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, జి.శ్రీరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గండికోట నిర్వాసితులను ఆదుకుంటాం : నిమ్మల

ప్రజాశక్తి-కొండాపురం (కడప జిల్లా)

గండికోట నిర్వాసితులను ఆదుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వైఎస్ఆర్ జిల్లా కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టును జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, జలవనరుల శాఖ అధికారులతో కలిసి ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ముఖ్యంగా నీటిపారుదల శాఖను నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా ఇరిగేషన్‌కు సంబంధించి ఒక రిజర్వాయర్‌నూ నిర్మించలేదని విమర్శించారు. ఇరిగేషన్‌ను నిర్లక్ష్యం చేయడమంటే వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసినట్లేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 95 శాతం రిజర్వాయర్లను నీటితో నింపామని తెలిపారు. వాటర్ మేనేజ్మెంట్ సరిగా అమలు చేయడం వల్లేనే జిల్లాలో ఉన్న 250 చెరువులను నీటితో నింపడం సాధ్యమైందన్నారు. గండికోట నిర్వాసితులకు సంబంధించి సమస్యలు, నష్టపరిహారాలు, ఆర్అండ్ఆర్ తదితరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని, రతనాల సీమగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అనంతరం గండికోట నిర్వాసితుల నుండి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తొలుత మంత్రి నిమ్మల గండికోట ప్రాజెక్టును సందర్శించి జల వనరుల శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ సిఇ శ్రీనివాసులు, ఎస్ఇలు మల్లికార్జునరెడ్డి, వెంకటరామయ్య, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రాజధాని పేరిట ఒకేచోట వేల కోట్లు ఖర్చా ?

- వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమల పరిస్థితేంటి ?
- సిఎం చంద్రబాబుకు ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అమరావతి రాజధాని పేరిట కూటమి ప్రభుత్వం ఒక్క గుంటూరు జిల్లాలోనే రూ.50 వేల నుంచి రూ.60 వేల కోట్లను రానున్న మూడు, నాలుగు సంవత్సరాల్లో ఖర్చు చేయనున్నట్లు ప్రకటనలు చేస్తోందని, అందుకు కావలసిన నిధులు ప్రపంచ బ్యాంకు, ఎడిబి, ఇతరులు ఇస్తున్నట్లు ప్రకటించిందని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ తెలిపారు. అన్ని వేల కోట్ల రూపాయలను ఒకే చోట ఖర్చు చేస్తే వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం చెబుతున్నట్లు రుణాలు ఇస్తున్న సంస్థలు వాటిని యుఎస్ డాలర్ల రూపంలో ఇస్తుండటం వల్ల భవిష్యత్తులో రుణ భారం అధికంగా ఉంటుందన్నారు. అటువంటి అప్పును భవిష్యత్తులో తీర్చే భారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలపై పడుతుందని తెలిపారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల పాత్ర ఎంతైనా ఉందన్నారు. అందుకు అనుగుణంగా ఆ ప్రాంతాల అభివృద్ధికి కావలసిన నిధులను కేటాయించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అంత పెద్ద ఖర్చుతో కూడిన అమరావతి రాజధాని ప్రాజెక్టు వల్ల ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలకు ఎంత లాభం కలుగుతుందో తెలియదుగానీ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నిధుల నుంచి సుమారు రూ.60 వేల కోట్లు తరలించి, మూడు నాలుగు సంవత్సరాలు ఒకే జిల్లాలో ఖర్చు చేయడం వల్ల ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిహ్నామైన ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తుంటే ఆ ప్రయత్నాన్ని నిలువరించి విశాఖ ఉక్కును పునరుద్ధరించే బదులు కూటమి ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో ప్రయివేట్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను స్థాపిస్తామని చెప్పడం ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్ల ఉన్న ఉదాసీనతకు నిదర్శనమని పేర్కొన్నారు. అటువంటి ప్రయివేట్ ప్లాంట్‌లో స్థానిక ప్రజల కన్నా ఇతరులకు ఉద్యోగావకాశాలు కలుగుతాయని తెలిపారు. రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వానికి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వానికి మధ్య వైఖరుల్లో తేడా ఏమీ కనిపించడం లేదన్నారు. ఉత్తరాంధ్రలో కూటమి ప్రభుత్వం ప్రయివేటు పెట్టుబడులు తీసుకొస్తామని చెబుతోందని, వాస్తవానికి ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి కావాల్సింది విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వ పెట్టుబడులు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలు, సాగునీటి సౌకర్యాలని తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు, ఆదివాసీలకు న్యాయం జరగకపోతే రాజధాని ఎంత సొబబుగా ఉన్నా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలు హర్షించరని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించాలని ఈ లేఖలో ఇఎఎస్ శర్మ పేర్కొన్నారు.

నత్తనడకన ఆవాసాల అనుసంధానం

- ముగుస్తున్న ఆర్థిక సంవత్సరం
- 1,895 పనులకు పూర్తి చేసింది 319 మాత్రమే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పథకాల కింద చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత కొంత కాలంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోడ్లు గోతుల మయంగా మారాయి.

దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్‌శాఖ రోడ్ల పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎఐఐబి, నాబార్డు, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్, పంచాయతీరాజ్, పిఎంజిఎస్‌వై, పిఎం జన్‌మాన్ పథకాల నిధులు మొత్తం రూ.3,828 కోట్ల వ్యయంతో 1,895 పనులు చేపట్టగా, 5,015 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనుల్లో ఉన్న రోడ్లను అభివృద్ధి చేపట్టడంతోపాటు, కొత్తగా 1,643 ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. మరో మూడు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండగా డిసెంబర్ రెండో వారం ముగిసే నాటికి రూ.202.35 కోట్లు మాత్రమే ఖర్చు, చేసి కేవలం 319 పనులు పూర్తి చేయగా, 315 ఆవాసాలకు మాత్రమే రహదారి సౌకర్యం కల్పించగలిగారు. 5,015 కిలోమీటర్లకు గానూ 694.3 కిలోమీటర్ల రోడ్లను నిర్మించారు.

పథకాల వారీ..

అత్యధిక సంఖ్యలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో చేపట్టిన ఎపి రూరల్ రోడ్డు ప్రాజెక్టులో రూ.2,163 కోట్ల వ్యయంతో 1,354 పనులు చేపట్టగా, కేవలం రూ.73.05 కోట్లు ఖర్చు చేసి 279 పనులు పూర్తి చేశారు. 1,630 అనుసంధానం లేని ఆవాసాలకు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, కేవలం 315 ఆవాసాలకే ఆ సౌకర్యం కల్పించగలిగారు. పిఎంజిఎస్‌వై, పిఎం జన్‌మాన్ పథకాల్లో రూ.991 కోట్ల వ్యయంతో 296 పనులు చేపట్టగా, కేవలం 14 పనులు పూర్తి చేశారు. నాబార్డు నిధులు రూ.531 కోట్ల వ్యయంతో 130 పనులు చేపట్టగా, కేవలం 16 పనులు పూర్తి చేయగలిగారు. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్స్ రూ.64 కోట్ల వ్యయంతో 26 పనులు చేపట్టగా 2, పంచాయతీరాజ్ నిధులు రూ.79 కోట్లతో 89 పనులు చేపట్టగా 8 పనులు పూర్తి చేశారు. దీంతో ఆ శాఖ మంత్రిగా ఉన్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సైతం రోడ్ల నిర్మాణంలో జాప్యంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. వీటిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 21 పనులు అటవీ అనుమతుల, భూసేకరణ సమస్యల వల్ల పనులు ముందుకు సాగకపోగా, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, విజయనగరం, పార్వతీపురం మన్యం, కర్నూలు జిల్లాల్లో 18 పనులు వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతోనే పనులు వేగవంతంగా సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

'యురేకా-2025'ను జయప్రదం చేయండి

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యురేకా సైన్స్ ఎక్స్పో-2025 పేరిట నిర్వహించే సైన్స్ ప్రయోగశాల పోటీలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం గేయానంద్ పిలుపునిచ్చారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి సందర్భంగా ఈ పోటీల ప్రారంభ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో ఆదివారం జెవివి విద్యా సబ్ కమిటీ కన్వీనరు గొంటి గిరిధర్ అధక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గేయానంద్ ప్రసంగించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని, ఇందుకు యూరేకా పోటీలు దోహదం చేస్తాయని ఆయన అన్నారు. జెవివి నాయకులు ప్రొఫెసరు రామచంద్రయ్య మాట్లాడుతూ..ప్రయోగాలు పిల్లల్లో సృజనాత్మకతను, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యాక్రమంలో గొంటి గిరిధర్, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ ఈ పోటీలు డిసెంబరు 22 నుంచి జనవరి 26 వరకు జరుగుతాయన్నారు. ఫలితాలను ఫిబ్రవరి 15 (గెలీలియా జయంతి) సందర్భంగా విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెవివి నాయకులు వైఎస్ నాగేశ్వర్, కెఎంఎంఆర్ ప్రసాద్, వి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి : ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఐఎన్‌టియుసి నాయకులు ఎం రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1410వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఉక్కు కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ ప్రకటన తర్వాత కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. నాలుగైదు నెలలుగా వేతనాల్లేక కార్మికులు చితికిపోతున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న తక్కువ మంది కార్మికులపై విపరీత పనిభారం పడుతోందన్నారు. ఎక్కువగా శ్రమిస్తున్నా వారికి తగిన ఫలితం ఉండటం లేదన్నారు. కాంట్రాక్టర్లు సరిగ్గా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఉక్కు కాంట్రాక్టు కార్మికులు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వేగంగా పావులు కదపడంలో దేవాన్ష్ ప్రపంచ రికార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాన్ష్.. చెస్‌లో వేగవంతంగా పావులు కదపడంలో ప్రపంచ రికార్డు సాధించాడు. తొమ్మిదేళ్ల దేవాన్ష్ 'వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్-175 పజిల్స్'లో ఈ రికార్డు సాధించాడు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు లండన్ నుంచి అధికారిక ధ్రువీకరణను అందుకోవడంతో నారా కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. వ్యూహాత్మకమైన ఆటతీరు, థ్రిల్లింగ్ ప్రదర్శనతో యువ చెస్ ప్రాడిజీ దేవాన్ష్ 'చెక్‌మేట్ మారథాన్' పేరుతో ఈ రికార్డు నెలకొల్పాడు. ఈ రికార్డులో క్రమక్రమంగా సవాలు చేసే చెక్‌మేట్ పజిల్‌ల క్రమాన్ని అతను పరిష్కరించాడు. చెస్ సంకలనం నుంచి ఎంపిక చేసిన 5,334 సమస్యలు, కలయికల ద్వారా ఈ పోటీని రూపొందించారు. ఇటీవల దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను సాధించాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయిని కేవలం నిమిషం 43 సెకన్లలో పూర్తిచేశాడు. 9 చెస్ బోర్డులను కేవలం 5 నిమిషాల్లో అమర్చాడు.

మెరుగు వేగాన్ని కళ్లారా చూశాను : లోకేష్

దేవాన్ష్ మెరుగు వేగాన్ని తాను కళ్లారా చూశానని మంత్రి లోకేష్ తెలిపారు. గ్లోబల్ అరేనాలో భారతీయ చెస్ క్రీడాకారుల అద్భుతమైన, చారిత్రాత్మక ప్రదర్శనల నుంచి ప్రేరణ పొందాడని తెలిపారు. ఈ కార్యక్రమం కోసం కొన్ని వారాలుగా రోజుకు 5-6 గంటలపాటు శిక్షణ తీసుకున్నాడని పేర్కొన్నారు. దేవాన్ష్‌కు చెస్ పాఠాలు చేర్పిన రాయ్‌చెస్ అకాడమీకి ధన్యవాదాలు తెలిపారు. దేవాన్ష్‌కు తన తాత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అభినందనలు తెలియజేశారు. కృషి, అంకితభావం, పట్టుదల విజయానికి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కొన్ని నెలల నుంచి కష్టపడ్డారని తెలిపారు. మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్‌ప్రసాద్ రెడ్డి, కె పార్థసారథి కూడా దేవాన్ష్‌కు అభినందనలు చెప్పారు. 175 సంక్లిష్టమైన పజిల్స్‌ను ఆసక్తిగా పరిష్కరించగలిగిన దేవాన్ష్ చురుకుదనం అపారమని కోచ్ కె రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అతని చదరంగం ప్రయాణంలో ఇదొక మైలురాయి అని తాను విశ్వసిస్తున్నానని తెలిపారు.

ఆదివాసీ మాతృభాషా ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స

ప్రజాశక్తి - పాడేరు

నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, చిట్టిబాబు

ఆదివాసీ మాతృభాషా ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖలోని నండూరి ప్రసాదరావు భవన్‌లో మూడు రోజులపాటు ఆదివాసీ మాతృభాషా ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం, ప్లీనం జరిగాయి. వీటికి ముఖ్య అతిథిగా అప్పలనర్స హాజరై మాట్లాడుతూ ఆదివాసీలను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా కనీస వేతనం అందడం లేదన్నారు. వారికి 2017 నుంచి కేవలం రూ.5 వేలు మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలని, టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి వరకు ఆదివాసీ మాతృభాష విద్యా బోధన అందించాలని, అన్ని ఆదివాసీ గ్రామాలకు మాతృభాష విద్యా బోధన వ్యవస్థను విస్తరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మాతృభాషా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాంగి శ్రీను, ప్రధాన కార్యదర్శి సవర డొంబు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆదివాసీ మాతృభాషా ఉపాధ్యాయ సంఘం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా సవర ఆనందరావు, ప్రధాన కార్యదర్శిగా మర్రి చిట్టిబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పాంగి శ్రీను, కుంజా నవీన్, సవర డొంబు, సీదరి సత్తిబాబు, పాంగి కుమారి, కె.కుసుమ కుమారి, బి.వెంకటేష్, బి.గౌరి, కుంబిడి రమేష్, సీదరి జగన్, సహాయ కార్యదర్శులుగా ఎస్.సాగర్, ఎ.గంగారావు, పెద్దింటి సుందరరావు, ఎం.భారతి, కిల్లో వీరయ్య, సమరెడ్డి దేవి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా 19 మంది ఎన్నికయ్యారు.

మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి
- రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

క్యారం బోర్డు ఆట ఆడుతున్న మంత్రి డాక్టర్ స్వామి

పేద కుటుంబాల్లో మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ హైస్కూల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17, 19 బాలబాలికల క్యారమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందుగా జాతీయ జెండా, క్రీడా జెండా ఎగురవేసి క్రీడా జ్యోతిని వెలిగించి ఈ క్యారెమ్స్ పోటీలను మంత్రి ప్రారంభించారు.

అనంతరం జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. గతంలో ప్రారంభించినవి అలాగే ఉన్నాయని వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. వికలాంగుల కోసం రూ.200 కోట్లతో విశాఖపట్నంలో 20 ఎకరాల్లో స్టేడియం నిర్మాణం చేపడుతున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ప్రకాశం, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, నెల్లూరు, కృష్ణా, కర్నూలు, గుంటూరు, తూర్పుగోదావరి, కడప, చిత్తూరు అనంతపురం జిల్లాల నుంచి 400 మంది పాఠశాల విద్యార్థులు వచ్చారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివిఎస్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న సిఐటియు, స్ట్రగుల్డ్ కమిటీ నాయకులు

విద్యుత్ ఆస్తులను ప్రయివేటీకరిస్తే ఒప్పుకోం : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యుత్ ఆస్తులను ప్రయివేటు వారికి ఇస్తే ఒప్పుకోబోమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, కార్యదర్శి ముజఫర్ అన్నారు. విద్యుత్ ప్రయివేటీకరణ, విద్యుత్ ఉద్యోగులు, కాంటాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్ఆర్ జిల్లా కడపలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథులుగా నర్సింగరావు, ముజఫర్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగ సంస్థలను ప్రయివేటు వారికి ఇచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు జాగ్రత్తతో వ్యవహరించి, విద్యుత్ సంస్థల ఆస్తులను ప్రయివేటుపరం కాకుండా తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అక్కడి డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాయని తెలిపారు. అక్కడి ఉద్యోగులు, కాంటాక్ట్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డుపైకి వచ్చి తీవ్ర ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ ప్రయత్నాలకు నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇంజనీర్స్ అండ్ ఎంప్లాయీస్, ఎలక్ట్రిసిటీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఒకవేళ సమ్మె జరిగితే పక్క రాష్ట్రాలైన హర్యానా, పంజాబ్, ఢిల్లీ నుంచి ఉద్యోగులను తరలించాలని ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలో అదాని ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ వినియోగదారులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. వేల కోట్ల రూపాయలతో స్మార్ట్ మీటర్ల బిగించాల్సిన ఆవశ్యకత ఏంటని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థను ప్రజల కోసం, ఉద్యోగుల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ కన్వీనర్ సుబ్బిరెడ్డి, డిస్కం అధ్యక్షులు శివశంకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ వాయిదా వేయాలి

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులకు ఈ నెల 23 నుంచి 27 వరకూ జరగాల్సిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ రెండు వారాలు వాయిదా వేయాలని ప్రభుత్వానికి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సెలవులను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేయాలని కోరారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ శిక్షణ నిర్వహించాలన్నారు.

పోలీసు విచారణకు పేర్ని నాని, కిట్టు గైర్హాజరు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), ఆయన తనయుడు కృష్ణమూర్తి (కిట్టు) ఆదివారం పోలీసు విచారణకు గైర్హాజరయ్యారు. గొడౌన్‌లో బియ్యం మాయం కేసులో విచారణ నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలలోపు కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పోలీసు స్టేషన్‌కు రావాలని వారిద్దరికీ శనివారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే, పోలీసు నోటీసులకు వారు స్పందించలేదు. కృష్ణా జిల్లా బందరు మండలం పొట్లపాలెంలో పేర్ని నాని సతీమణి జయసుధకు చెందిన గోదామును ఇన్వెస్టర్ గోదాముగా పౌరసరఫరాల సంస్థ అద్దెకు తీసుకుంది. ఈ గోదాములో 4,840 బస్తాల బియ్యం మాయమైన వ్యవహారంపై కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులుగా నాని సతీమణి జయసుధ, ఆమె వ్యక్తిగత కార్యదర్శి మానస తేజ ఉన్నారు. విచారణలో భాగంగా పేర్ని నాని, కిట్టు పోలీసుస్టేషన్‌కు రావాలని కోరుతూ నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు శనివారం పేర్ని నాని ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో నోటీసులను ఇంటి తలుపులకు అంటించి వెళ్లిపోయారు. కేసు దర్యాప్తునకు సహకరించాలని, మధ్యాహ్నం 2 గంటలలోపు స్టేషన్‌కు వచ్చి వాస్తవ విషయాలు చెప్పాలని, అందుబాటులో ఉన్న రికార్డులు ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. మరోపక్క నాని సతీమణి జయసుధ, ఆమె వ్యక్తిగత కార్యదర్శి మానస తేజ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రత్యేక బందాలుగా ఏర్పడి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మానస తేజ కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిచి విచారించారు. నాని, కిట్టు విచారణకు గైర్హాజరయినందున చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని బందరు తాలూకా పోలీసులు తెలిపారు.

మూడు దశాబ్దాలైనా నెరవేరని 'పెన్నహోబిలం' లక్ష్యం

- లీకేజీతో నీరుగారుతున్న పిబిఆర్ ప్రాజెక్టు
- మరమ్మతులకూ నోచని వైనం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

అనంతపురం జిల్లా అంటేనే నిత్యం కరువులకు నిలయం. అత్యల్ప వర్షపాతం కలిగిన ఈ జిల్లాలో అత్యంత ప్రాధాన్యమైన పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పిఎబిఆర్) పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి మూడు దశాబ్దాలవుతున్నా ఇప్పటికీ పూర్తి సామర్థ్యంతో నీటిని నింపలేని పరిస్థితి ఉంది. ఇప్పటికీ భూసేకరణ సైతం పూర్తి కాలేదు. లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరందివ్వాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు తాగునీటిని నిల్వ ఉంచుకునే ప్రాజెక్టుగానే మిగిలిపోయింది. అనంతపురం జిల్లాకు సాగు, తాగు నీరు అందించే ప్రధాన జలవనరు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. తుంగభద్ర డ్యామ్ నుంచి ఈ కాలువకు 32.50 టిఎంసిల నీటి కేటాయింపులు ఉన్నాయి. దీనికి అదనంగా కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా పది టిఎంసిల నీళ్లను తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుంచే అనంతపురం జిల్లాకు కేటాయించారు. అదనంగా వచ్చిన నీటిని నిల్వ ఉంచేందుకు కూడేరు మండలం కొర్రకోడు వద్ద పిఎబిఆర్ డ్యామ్‌ను 1994లో నిర్మించారు. 11 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాల ఆయకట్టుకు నీటిని అందివ్వడంతోపాటు 40 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే విధంగా దీనిని డిజైన్ చేశారు. నిర్మాణ సమయంలో లోపాలతో ప్రాజెక్టు స్పిల్‌వేలో లీకేజీలు ఏర్పడ్డాయి. వీటిని అరికట్టేందుకు సుమారు రూ.12 కోట్లకుపైగా ఇప్పటి వరకు వెచ్చించారు. గ్రౌటింగు చేశారు. అయినా, లీకేజీలను పూర్తి స్థాయిలో అరికట్టలేకపోయారు. ఇప్పటికీ లీకేజీలు ఏర్పడుతుండడంతో ఐదు టిఎంసిలు మించి నీరు నిల్వ ఉంచుకోలేకపోతున్నారు. వర్షాలు అధికంగా వచ్చిన ఏడాది కూడా అంతకు మించకుండా నీటిని దిగువకు వదిలేస్తున్నారు.

జీయోమెంబ్రైన్ ప్రతిపాదనలు కాగితాల్లోనే!

ప్రాజెక్టు లీకేజీలను అరికట్టేందుకు జీయోమెంబ్రైన్ చేయవచ్చని ఇంజనీరింగ్ నిపుణులు సూచించారు. ఈ మేరకు 2015 నుంచి ఈ ప్రతిపాదనలను జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపారు. ఈ రకమైన లీకేజీలను తమిళనాడులోని ఒక ప్రాజెక్టుకు వేసి నివారించారని కూడా చెబుతున్నారు. అయితే, పాలకులు ఈ మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో ప్రాజెక్టు ఉన్నా పూర్తి సామర్థ్యంతో నీటిని నింపుకోలేని పరిస్థితి నెలకొంది.

ఇప్పటికీ పూర్తవని భూసేకరణ

ఒకవైపు లీకేజీల సమస్య ఇలాగుంటే, మరోవైపు భూసేకరణ కూడా ఇప్పటికీ పూర్తవలేదు. 2,600 ఎకరాల భూసేకరణ జరగాలి. ఉరవకొండ మండలం పెద్దకౌకుంట్ల, జయపురం, కొర్రకోడు, ఎం.ఎ.హళ్లి గ్రామాల్లో భూములను సేకరించాల్సి ఉంది. ఈ భూముల సర్వే చేసి పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. భూసేకరణ కార్యాలయం కూడా ఏర్పాటైంది. కానీ, భూసేకరణ పూర్తవలేదు.

పూర్తి సామర్థ్యంతో నింపే చర్యలు చేపట్టాలి

అసలే కరువు ప్రాంతం. అటువంటి చోట ఉన్న జలవనరులను రక్షించుకోవాల్సిన అవసరముంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి మూడు దశాబ్దాలైనా ఇప్పటికీ పూర్తిగా నీటిని నిల్వ ఉంచలేకపోతున్నారు. తక్షణం మరమ్మతులను పూర్తి చేయాలి. భూసేకరణ పూర్తి చేయాలి. దీనివల్ల అధిక వర్షాలొచ్చిన సమయంలో ఇక్కడ ఎక్కువ నీటిని నిలువ చేయడానికి వీలవుతుంది.

-వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

నష్టపోయిన పంటలకు ఎన్యుమరేషన్

- ఎపి కౌలు, రైతు సంఘం రాష్ట్ర కమిటీలు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రలో ఇటీవల పడిన వర్షాలు, తుపానుకు తడిసి నీట మునిగి నష్టపోయిన పంటలను వెంటనే ఎన్యుమరేషన్ చేయాలని ప్రభుత్వాన్ని ఎపి కౌలు రైతు సంఘం, ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. వరి, మొక్కజొన్న పంటలకు ఎకరాకు రూ.30 వేలు, అపరాలకు రూ.10 వేలు నష్టపరిహారం వాస్తవంగా సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఆదివారం కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20న అల్పపీడన ప్రభావంతో పడిన భారీ వర్షాలతో వరి, మొక్కజొన్న, మినప, పెసర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అపరాలు కొంత భాగం ఇంకా కోత దశకు రాక మునుపే నీట మునిగి కుళ్లిపోయాయన్నారు. ఈ దశలో ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ చేసి రైతుల వారీ నష్టాలను అంచనా వేయాలన్నారు. తడిసి రంగు మారిన ధాన్యం కొనుగోలు నిబంధనలు సడలించి ప్రభుత్వ సంస్థ ద్వారా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలన్నారు. తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు రైతులకు టార్పాలిన్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'నక్షత్రబాట' నవలను ఆవిష్కరిస్తున్న అమరుల వారసులు

శ్రీకాకుళం పోరాటానికి 'నక్షత్రబాట' సాక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం సాయుధ పోరాట ఘటనలకు 'నక్షత్రబాట' నవల సజీవ సాక్ష్యంగా నిలుస్తుందని మాతృక పత్రిక సంపాదకవర్గ సభ్యులు రమాసుందరి అన్నారు. ఆ పోరాటం ఆధారంగా ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్రబాట నవలను శ్రీకాకుళం నగరంలోని వరం రెసిడెన్సీలో అమరుల వారసులు పంచాది రోజా, తామాడ అరుణ, అత్తలూరి అరుణతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యాన రచయిత గంటేడ గౌరునాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో రమాసుందరి మాట్లాడుతూ శ్రీకాకుళం సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాల్లోని స్త్రీల త్యాగాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఉత్తరాంధ్ర విప్లవ ఉద్యమానికి సంబంధించిన మరింత సమాచారం, వాస్తవాలతో కూడిన చరిత్రను స్మరించడం ద్వారా సాహిత్యంలో, వర్తమాన సమాజంలో నిక్షిప్తం చేయాలన్నారు. చరిత్రను వెలికి తీసి వాస్తవాలను తెలియజేయాల్సిన అవసరముందని తెలిపారు. పంచాది రోజా, తామాడ అరుణ, అత్తలూరి అరుణ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు పోరాటంలో అశువులు బాసిన తీరు, వారు పెరిగిన విధానం, ఎదుర్కొన్న కష్టాలు, చిన్నతనం నుంచే ఉద్యమంపై ఆకర్షితులైన విధానాన్ని వివరించారు. అప్పలనాయుడు కలం నుంచి మరిన్ని రచనలు రావాలని పలువురు ఆకాంక్షించారు. కంచరాన భుజంగరావు ఆహ్వానం పలకగా, వంకల మాధవరావు, చింతాడ రామచంద్రరావు, కుత్తం వినోద్, ఇతర గాయకులు తమ పాటలతో ప్రేక్షకులకు ఉత్తేజం కలిగించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, రాజాం రచయితల వేదిక అధ్యక్షులు గార రంగనాథం, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు విజికె మూర్తి, సాహితీ స్రవంతి శ్రీకాకుళం కన్వీనర్ కె శ్రీనివాసులు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సీనియర్ పాత్రికేయులు నల్లి ధర్మారావు, ఐద్వా కన్వీనర్ ఎ.లక్ష్మి, పలువురు రచయితలు, సాహితీ అభిమానులు, విద్యావేత్తలు, అభ్యుదయ, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికశక్తిగా ఎదగాలి

- వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- వి కోట (చిత్తూరు జిల్లా)

రాష్ట్రంలోని మహిళలందరూ ఆర్థికశక్తిగా ఎదగాలన్నదే టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని నారా భువనేశ్వరీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆదివారం నాలుగో రోజు చిత్తూరు జిల్లా వి కోట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో హెరిటేజ్ రైతు సంక్షేమ నిధితో ఏర్పాటు చేసిన సుజల వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో మహిళలు, ప్రజలు తమ స్వతంత్రాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి కుప్పం పర్యటనకు వచ్చి ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటానని అన్నారు. ఎఎంసి మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు మార్కెట్ యార్డులో మూతపడిన వాటర్ ప్లాంట్ మర్మమతు చేయించి తిరిగి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పలమనేరు నుండి కృష్ణగిరి సరిహద్దుల వరకు నాలుగు లైన్లరోడ్డు నిర్మాణంతో మండలానికి ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఏనుగుల దాడుల వల్ల పంటలు నష్టంతో పాటు ప్రాణనష్టం జరుగుతోందని వాటి నివారణకు మదపుటేనుగులతో కట్టడి చేసే ప్రాజెక్టును అమలు చేయనున్నామని తెలిపారు. ఎపిఎస్ ఆర్‌టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

గుంటూరులో స్విగ్గీ 'బోల్ట్' సేవలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదిక స్విగ్గీ లిమిటెడ్ తాజాగా గుంటూరులో తన బోల్ట్ సేవలను ప్రారంభించినట్లు వెల్లడించింది. దీంతో ఈ నగరంలో 10 నిమిషాల్లోనే ఫుడ్ డెలివరీ సర్వీసులను అందుబాటులోకి తెచ్చినట్లయ్యిందని స్విగ్గీ ప్రాంతీయ ప్రతినిధి సిద్ధార్థ బాకో పేర్కొన్నారు. ఇక్కడ వినియోగదారులు 192 రెస్టారెంట్లలోని వంటకాలను ఎంచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రముఖ రెస్టారెంట్‌లు క్యుఎస్‌ఆర్‌ల నుండి వేగంగా ఆహారాన్ని డెలివరీ చేయనున్నామన్నారు. స్విగ్గీ దేశవ్యాప్తంగా 400 కి పైగా నగరాలకు బోల్ట్‌ను విస్తరించిందన్నారు. 40వేల కంటే ఎక్కువ రెస్టారెంట్‌ల నుండి 10 లక్షల ఉత్పత్తులను డెలివరీ చేస్తోందన్నారు. ఇటీవలే ఈ సంస్థ కాకినాడలోనూ బోల్ట్ సేవలను ప్రారంభించిందన్నారు.

మిట్టల్ కోసం విశాఖ స్టీల్‌ప్లాంట్ గొంతుకోత

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు, చిత్రంలో సురేంద్ర తదితరులు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచన వెనుక విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయాలన్న కుట్ర కనబడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకొని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపైనా, మిట్టల్ ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయించాలని కోరారు. సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభ సందర్భంగా నర్సీపట్నం విచ్చేసిన వై.వెంకటేశ్వరరావు ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం వినియోగదారులపై పడకుండా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్షాలు ప్రజా పోరాటాలు నిర్వహిస్తాయని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన లోకేష్ ఇపుడు స్మార్ట్ మీటర్లను కొనసాగిస్తారా ? రద్దు చేస్తారా ? అన్నదానిపై వైఖరి వెల్లడించాలన్నారు. సౌర విద్యుత్ ఒప్పందం కుంభకోణ బాధ్యులపై చర్య తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇదంతా అదాని, మోడీలను రక్షించేందుకేనని తెలిపారు. ప్రతిపక్షాలను కలుపుకొని విభజన హామీల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. భూ అక్రమణలపై గతంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన సిట్ నివేదికలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆ నివేదికల్లోని భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోకపోతే రెవెన్యూ సదస్సులకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తికి నిధులు కేటాయించి 8 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్రంపై ఒత్తిడి పెంచి నిధులు రాబట్టాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, ఏజెన్సీలో హైడల్ పవర్ ప్రాజెక్ట్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులతో 20 వేల మంది గిరిజనులు నిర్వాసితులవుతారని అన్నారు. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన గిరిజనులను మోసగించడానికేనని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, బి.ప్రభావతి, డి.వెంకన్న, త్రిమూర్తులు రెడ్డి, అడిగర్ల రాజు పాల్గొన్నారు.

అటకెక్కిన 'ఆది ఆదర్స్ గ్రామ యోజన'

- రాష్ట్రంలో 517 గిరిజన గ్రామాల ఎంపిక
- మూడేళ్లుగా డబ్బులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వం
- రోడ్డు సౌకర్యం లేక తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సీతంపేట మండలం రంగావలసలో రహదారి సౌకర్యం లేక డోలీ మోత (ఫైల్ ఫొటో)

గిరిజన సంక్షేమం అంటూ పైకి మాటలు చెప్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వారి అభివృద్ధి కోసం నిర్దేశించిన పథకాలకు డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో, గిరిజన గ్రామాలు కనీస రోడ్డు సౌకర్యానికీ నోచుకోలేదు. డోలీ మోతలు తప్పడం లేదు. ప్రధానమంత్రి ఆది ఆదర్స్ గ్రామ యోజన (పిఎంఎఎజివై) పథకం కాగితాలకే పరిమితమైంది. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిలో అంతరాలను తగ్గించడం, గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం, గిరిజన గ్రామాలను మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. లక్ష్యాలను ఎంతో గొప్పగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇందుకు నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పథకం అటకెక్కింది. ఇప్పటికీ వేలాది గిరిజన గ్రామాలు కనీసం రోడ్డు సౌకర్యానికీ నోచుకోలేకపోతున్నాయి. దీంతో, అత్యవసర సమయాల్లో డోలీ మోతలే శరణ్యమవుతున్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక 2021-22 ఆర్థిక సంవత్సరంలో పిఎంఎఎజివైను తీసుకొచ్చింది. ఈ పథకాన్ని 2025-26 వరకు కొనసాగిస్తామని పేర్కొంది. ఈ పథకం కింద ఎంపికైన గ్రామాలకు వంద శాతం కేంద్రమే నిధులు విడుదల చేస్తుందని, సామాజికంగా, ఆర్థికంగా గ్రామాలను బలోపేతం చేస్తామని తెలిపింది. పథకం అమలుకు మార్గదర్శకాలను రూపొందించి రాష్ట్రంలోని అన్ని గిరిజన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలకు (ఐటిడిఎలకు) పంపింది. వీటికి అనుగుణంగా 2021 అక్టోబరులో 500 మంది ఎస్‌టిలు, 50 శాతం ఎస్‌టి జనాభా దాటిన గ్రామాలను అధికారులు ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్రంలోని అన్ని ఐటిడిఎల నుంచి 517 గ్రామాలను ఎంపిక చేశారు. వీటిలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఐటిడిఎ పరిధిలో 61 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో కల్పించాల్సిన కనీస అవసరాలు, వాటి కోసం కావాల్సిన నిధుల ప్రతిపాదనలను అధికారులు పంపారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కొక్క గ్రామానికీ రూ.20.38 లక్షల చొప్పున ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. అంతర్గత రహదారులకు, గ్రామాలను అనుసంధానం చేసే రహదారులకు ప్రాధాన్యం ఇచ్చి డబ్బులు ఖర్చు చేయాలని పేర్కొంది. ఆరోగ్యం, పోషకాహారం, తాగునీరు, పారిశుధ్యం, విద్య, కమ్యూనికేషన్ల రంగం వంటి ప్రాథమిక రంగాలకు నిధులు వెచ్చించాలని తెలిపింది. గ్రామాల్లో అవసరాలను గుర్తించిన ఐటిడిఎ అధికారులు 2021 ఏడాది చివరిలో ప్రతిపాదనలు పంపారు. గ్రామాల్లో విలేజ్ డవలప్‌మెంట్ ప్లాన్స్ (విడిపి) పేరుతో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామంటూ మార్గదర్శకాల్లో కేంద్రం పేర్కొంది. స్కిల్ డవలప్‌మెంట్, సామాజిక అటవీ అభివృద్ధి, సమీకృత వన ధన కార్యక్రమం, అడవుల్లో పుట్టే జీవ నదుల సంరక్షణ చేస్తామంటూ ఊరించింది. మూడేళ్లు అవుతున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కనీసం రోడ్డుకూ నోచుకోలేదు. ఈ పథకం అమలై ఉంటే కనీసం ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లోనైనా డోలీ మోతలు తప్పేవి. అసలు ఈ పథకం అమల్లో ఉందా? లేదా? అనే సంశయాన్ని అధికారులు సైతం వ్యక్తం చేస్తున్నారు.

జీవాలపైకి దూసుకొచ్చిన ప్రయివేటు ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు పెంపకందార్లకు తీవ్రగాయాలు
- 150 గొర్రెలు, మేకలు మృతి

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)

ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరు గొర్రెల పెంపకందార్లు తీవ్ర గాయాలపాలయ్యారు. 150కు పైగా జీవాలు మృత్యువాత పడ్డాయి. మరో 40 జీవాలు గాయాలతో అల్లాడుతున్నాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి పట్టణంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారి ఫ్లై ఓవర్‌పై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తెలంగాణలోని నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం కోలంపల్లికి చెందిన ఆవుల మల్లేష్, నెంబర్ పోచ కర్రెప్ప, మరో ఇద్దరు తమ 600 జీవాలను మేపుకోవడానికి కొద్దిరోజుల కిందట పల్నాడుకు వచ్చారు. తమ జీవాలతో దాచేపల్లి పట్టణంలోని అలంకార్ థియేటర్ సమీపంలో అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారి ఫ్లైఓవర్ మీద వెళ్తూ ఉండగా హైదరాబాద్ నుండి బాపట్ల జిల్లా ఇంకొల్లుకు వెళ్తున్న శ్రీమారుతి ట్రావెల్స్ బస్సు ఒక్కసారిగా జీవాల మందపైకి దూసుకెళ్లింది. దీంతో జీవాలు మృతి చెందాయి. మల్లేష్, కర్రెప్ప గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారయ్యాడు. బస్సులోని ప్రయాణికులు ఎవరికి వారు ఇతర వాహనాల్లో వెళ్లిపోయారు.

స్థానికులు ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులను 108 ద్వారా గురజాల ప్రభుత్వాస్పత్రికి, నంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. మల్లేష్ పరిస్థితి విషంగా ఉంది. ఘటనపై స్థానిక యాదవ సంఘాలు, చుట్టుపక్కల గ్రామాల్లోని జీవాల పెంపకందారులూ ఘటనా స్థలికి చేరుకుని ఆందోళన చేపట్టారు. చనిపోయిన జీవాల విలువ రూ.20 లక్షల నుంచి రూ. 25 లక్షలపైగా ఉంటుందని, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని, వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పల్నాడు జిల్లా ఎస్‌పి కె శ్రీనివాసరావు, టిటిడి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ఘటనా స్థలికి చేరుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన బస్సు యజమానితో ఎస్‌పి ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీనివ్వడంతో రాస్తారోకో ముగిసింది. అనంతరం మృతి చెందిన జీవాలకు స్థానిక మార్కెట్ యార్డులో పోస్టుమార్టం పూర్తిచేసి ఊరికి వెలుపల ప్రభుత్వ భూమిలో ఖననం చేశారు. ఈ ఘటనపై పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొత్తిపాటి రవికుమార్ స్పందించారు. ప్రమాదంపై జిల్లా కలెక్టర్, ఎస్‌పితో ఫోన్లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వేగంగా ప్రయాణించకుండా వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అఘోరి దాడిపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి మంగళగిరి (గుంటూరు జిల్లా)

అఘోరి దాడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు మీడియా ప్రతినిధి ఆరేపల్లి రాజు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం ఆయన మాట్లాడారు. నవంబర్ 18న మంగళగిరి ఆటోనగర్ ఆల్ఫా హోటల్ ఎదుట ఓ కార్ వాష్ సెంటర్ వద్ద అఘోరి జరిపిన దాడిలో తాను గాయపడ్డానని తెలిపారు. మంగళగిరికి చెందిన ఓ ప్రజాప్రతినిధి పదవీ ప్రమాణ స్వీకారం సందర్భంగా వార్త కవరేజ్‌కి వెళ్తుండగా అదే ప్రాంతంలో కార్ వాష్ సెంటర్ వద్ద మారణాయుధాలతో నగ్నంగా అఘోరీ తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోందని తెలిపారు. దీంతో పలువురు విలేకరులము ఆ ప్రాంతానికి చేరుకున్నామని, అదే సమయంలో అఘోరి ఇనుప రాడ్డుతో విలేకరితోపాటు కార్ వాష్ సెంటర్లో ఉన్న యువకులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిందని తెలిపారు. ఈ ఘటనలో తన కాలు విరిగి తీవ్ర గాయాలపాలవగా స్థానికులు ఆస్పత్రిలో చేర్చారని, ఆస్పత్రి నుండి బయటకు వచ్చిన తరువాత ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు చేశామని చెప్పారు. కాగా సదరు ఘటనలో పోలీసులు అఘోరిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై దాడికి పాల్పడిన అఘోరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి చేసిన ఫిర్యాదులో కోరానని ఆరేపల్లి రాజు తెలిపారు.

తిరుమలలో విజన్ -2047 అమలు

- లడ్డూ ప్రసాదం నాణ్యత పెంచాం
- అనధికార దుకాణాలపై చర్యలు
  : ఇఒ శ్యామలరావు

ప్రజాశక్తి- తిరుమల

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఈవో

తిరుమల ప్రక్షాళనలో భాగంగా అనేక చర్యలు చేపట్టామని టిటిడి ఇఒ శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల పవిత్రతను కాపాడే విధంగా ప్రతి కార్యక్రమం చేస్తున్నామన్నారు. తిరుమల పర్యటనను ప్రతి యాత్రికుడికి అనుభూతిని గుర్తు పెట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదం నాణ్యత పెంచామని, క్యూలైన్‌లో వేచి ఉండే సమయం తగ్గించామని తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు, పద్మావతి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు చెప్పారు. తిరుమలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపామన్నారు. తిరుమల విజన్- 2047లో భాగంగా అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. దాతలు నిర్మించిన అతిథి గహాల్లో 20 గృహాలకు ఆధ్యాత్మిక పేర్లు మార్చాల్సి ఉందని, అలిపిరి నడక మార్గంలో సౌకర్యాలు, తిరుమలలో పార్కింగ్ సౌకర్యం పెంచాల్సి ఉందని వెల్లడించారు. అన్యమత ఉద్యోగుల బదిలీపై న్యాయపరంగా వెళ్తున్నామని, తిరుమలలో అనధికార దుకాణాల వల్ల భక్తులకు సమస్యలు ఏర్పడుతున్నాయని, త్వరలో అనధికార దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదానికి స్వచ్ఛమైన నెయ్యి వినియోగిస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా టిటిడికి 61 అనుబంధ ఆలయాలు ఉన్నాయని, కన్సల్టెన్సీ ద్వారా ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఆకాశగంగ, పాపవినాశనం తీర్థాలకు సందర్శకుల తాకిడి పెరిగిందని, ఆ తీర్థాలను అభివద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ విభాగంలో లోటుపాట్లు జరిగాయని, ఇకపై ఇటువంటివి జరగకుండా ఒక కమిటీని వేస్తున్నామని చెప్పారు. గత ఆరు నెలలుగా టిటిడి విజిలెన్స్ అధికారులు బాగా పని చేస్తున్నారని, దర్శన టికెట్లు తీసిస్తానని సందర్శకులను మోసం చేసే వారిని పట్టుకుంటున్నారని తెలిపారు.

టాప్ 10 కంపెనీల షేర్లు నేల చూపులు

- రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి..

ముంబయి : గత వారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవి చూడగా.. టాప్ 10 కంపెనీల సంపద లక్షల కోట్లు ఆవిరయ్యింది. బిఎస్ఇలోని అగ్రశ్రేణి 10 కార్పొరేట్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4,95,061 కోట్లు హరించుకుపోయింది. బిఎస్ఇ సెన్సెక్స్ 4,092 పాయింట్లు లేదా 4.98 శాతం పతనమయ్యింది. 2022 జూన్ తర్వాత ఒక్క వారంలో జరిగిన అతిపెద్ద నష్టం ఇదే. వచ్చే ఏడాది యుఎస్‌ఫెడ్ నాలుగు సార్లు వడ్డీ రేట్లు తగ్గించొచ్చనే అంచనాలకు చెక్ పెడుతూ.. ఆ రెగ్యూలేటరీ సంస్థ కేవలం రెండు సార్లకే అవకాశం ఉందని ప్రకటించింది. దీంతో మదుపర్లు స్టాక్ మార్కెట్లపై విశ్వాసాన్ని కోల్పోయారు. ఎఫ్ఐఐలు భారీగా తరలిపోయాయి. దేశీయంగా భారత జిడిపి బలహీనంగా చోటు చేసుకోవడం మార్కెట్లలో ఒత్తిడిని పెంచింది. ఈ పరిణామాల మధ్య గడిచిన వారంలో దేశంలోనే అతిపెద్ద టెక్ కంపెనీ టిసిఎస్ మార్కెట్ కాపిటలైజేషన్ ఏకంగా రూ.1.10 లక్షల కోట్లు తుడుచుకుపెట్టుకుపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.91,140 కోట్ల పతనాన్ని చవి చూసింది. ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎం క్యాప్ రూ.76,448 కోట్లు కోల్పోయింది. భారతీ ఎయిర్‌టెల్ రూ.59,055 కోట్లు, ఎస్‌బిఐ రూ.43,909 కోట్లు, ఐసిఐసిఐ బ్యాంక్ రూ.41,857 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.32,300 కోట్లు చొప్పున మార్కెట్ విలువను నష్టపోయాయి. తర్వాత స్థానల్లో ఎల్‌ఐసి, హెచ్‌యుఎల్, ఐటిసి కంపెనీలు అధిక విలువ కోల్పోయిన వాటిలో ఉన్నాయి. వచ్చే వారం కూడా మార్కెట్లలో ఒడిదుడుకులు ఉండొచ్చని.. రిటైల్ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇపుడిపుడే వెలుగుతున్న దీపాలని మనం రెండు చేతులని అడ్డు పెట్టుకుని కాపాడుకోవాలి. సత్తా ఉన్నవి ప్రజ్వలంగా వెలుగుతాయి. కొత్త సాహిత్యకారులను ప్రోత్సహించటానికి మనం సదా సంసిద్ధంగా ఉండాలి. – సినారె

అభ్యుదయ విమర్శకు అకాడమీ పురస్కారం





'సాహిత్యంలో అత్యంత క్లిష్టమైనది విమర్శ'. ఈ క్లిష్టమైన ప్రక్రియలో కృషిచేసిన పెనుగొండ లక్ష్మీనారాయణకు 2024 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. వెన్నేటి రామచంద్రరావు, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, పాపినేని శివశంకర్, త్రిపురనేని మధుసూదనరావు వంటి పూర్వ విమర్శకులు కూడా విమర్శ, రచన చేయడం కన్నా కష్టమైన పని అనే చెప్పారు. అయినా 1829 నుంచి ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ అంచెలంచెలుగా ఎదుగుతూ ఒక పెద్ద తానుగుడ్డగా ఏర్పడింది. ఆ తానులో పోగే పెనుగొండ లక్ష్మీనారాయణ. ఆయన రాసిన తాజా విమర్శ గ్రంథం (2021) 'దీపిక'. ఈ గ్రంథానికే అకాడమీ పురస్కారం వచ్చింది.

కేంద్ర సాహిత్య అకాడమీ 1955 నుంచి ప్రతి ఏడాదీ పురస్కారం కోసం ఎన్నిక చేసే గ్రంథాల్లో ఇప్పటిదాకా 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' (సురవరం ప్రతాపరెడ్డి, 1955) 'విమర్శిని' (కొలకలూరి ఇనాక్, 2018) దాకా దాదాపు 17 విమర్శ గ్రంథాలు అకాడమీ పురస్కారం అందుకున్నాయి. ఆ వరుసలో నిలిచింది 'దీపిక'.

పెనుగొండ కవి, విమర్శకులు, సంపాదకులు, అభ్యుదయ రచయితల సంఘం నిర్మాతల్లో ఒకరు. అభ్యుదయ సాహిత్యోద్యమకారుడు. 50 ఏళ్ళ క్రితం ఆంధ్రప్రదేశ్ అరసంలో సామాన్య సభ్యుడుగా ప్రవేశించి, ఇవాళ అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా ఉన్నారు. ఈ ఎదుగుదలలో ఆయన కమిట్‌మెంట్ ప్రధానపాత్ర నిర్వహించింది. అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ మార్క్సిజానికి వ్యతిరేక పవనాలు వీస్తున్న సమయంలో మొక్కవోని నిబద్ధతతో ఆయన అభ్యుదయ సాహిత్యోద్యమకారుడుగా నిలిచారు.

పెనుగొండ ఇదివరకే 'రేపటి లోకి' అనే కావ్యం, 'అనేక', 'విదిత', 'నూరేళ్ళ పులుపుల', 'గుంటూరు సీమ సాహిత్య చరిత్ర' అనే విమర్శ గ్రంథాలు ప్రచురించారు. అసంఖ్యాకంగా ఇప్పటి సమాజానికి అవసరమైన సాహిత్య గ్రంథాలకు సంపాదకులుగా, ప్రధాన సంపాదకులుగా వ్యవహరించారు. అలాగే ఆయన అభ్యుదయ సాహిత్య విమర్శకు నేటి దీపధారులలో ఒకరయ్యారు.

36 విమర్శవ్యాసాలున్న 'దీపిక', పెనుగొండ తెలుగు సాహిత్యాన్ని ఎన్ని వైవిధ్యమైన కోణాల నుంచి పరిశీలించారో తెలియజేస్తుంది. ఒక రచన, ఒక రచయిత, ఒక ఉద్యమం, ఒక ప్రక్రియ, ఒక ప్రాంతం, ఒక వర్గం, ఒక భావజాలం– ఇలా అనేక కోణాల నుంచి ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. తెలుగు నేల మీది అన్ని ప్రాంతాల సాహిత్యాలను ఆయన ఆలింగనం చేసు కున్నారు.

'దీపిక'లోని వ్యాసాలు విడివిడిగా ఉన్నా వాటిలో తెలుగులో ప్రజా సాహిత్య చరిత్ర అంతస్సూత్రంగా కనిపిస్తుంది. గురజాడ నుంచి నేటిదాకా అనేకమంది రచయితలు, వారి రచనలు మనం అందులో చూడవచ్చు. మధ్య యుగంలో వేమనను ప్రజాకవిత్వానికి శ్రీకారం చుట్టినకవిగా పేర్కొని, హేతువాద దష్టితో 'మనిషి' పైన గౌరవాన్ని ప్రకటించిన కవిగా గురజాడను గుర్తించారు. అభ్యుదయ కవిత్వానికి మూల పురుషుడుగా గురజాడను పేర్కొంటూ, ఆయన తర్వాత మనిషి కోసం, మనిషి కేంద్రంగా కలంపట్టి కవిత్వాన్ని భావకవితామార్గం నుంచి ప్రజామార్గం పట్టించిన కవిగా శ్రీశ్రీని వర్ణించారు. అభ్యుదయ రచయితలకు మార్గం మార్క్సిజమని, లక్ష్యం వర్గరహిత సమాజం, సామ్యవాద వ్యవస్థ నిర్మాణమని పెనుగొండ పునరుద్ఘాటించారు. దళితవాదకాలంలో అభ్యుదయ విమర్శకుడుగా పెనుగొండ ఎంతో బాధ్యతగా గుర్రం జాషువాను సొంతం చేసుకున్నారు. జాషువా సాహసవంతుడైన కవి అన్నారు. 'ఆగామి యుగంలో దళిత సూర్యుడి శిరసు నుంచిన అగ్నికిరీటం' అని గబ్బిలం కావ్యాన్ని నిర్వచించారు. మాగోఖలేను డీక్లాసిఫై అయినా రచయితగానే గాక, డీక్యాస్ట్‌ఫై అయినా రచయితగా కూడా పెనుగొండ నిర్వచించారు. ఆయన కథలన్నీ దళిత జీవిత ప్రతిఫలనాలే అన్నారు. గోఖలే మీద పెనుగొండ రాసిన వ్యాసం అభ్యుదయ సాహిత్య విమర్శ కాలానుగుణంగా తనను తాను ఎలా మార్చుకుంటుందో తెలియజేస్తున్నది. అడివి బాపిరాజు మీద రాసిన వ్యాసం కూడా అలాంటిదే.

అభ్యుదయ సాహితీప్రియులకు సహజంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ఆ పోరాట సాహిత్యం పట్ల ప్రత్యేకమైన గౌరవం ఉంటుంది. పెనుగొండకు ఆ గౌరవం ఉంది. ఆ పోరాటానికి మద్దతుగా ఆంధ్రప్రాంతం రచయితలు నిలబడి రాసిన సాహిత్యం మీద బలమైన వ్యాసం రాశారు. అదొక గొప్ప పరిశోధన పత్రం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ విజయం నేపథ్యంలో ఆయన ఆ వ్యాసం రాశారని గుర్తిస్తే ఆయన ప్రాంతాలకతీతంగా ప్రజా ఉద్యమాలనూ, ఉద్యమం సాహిత్యాన్నీ ఎంత గౌరవిస్తారో తెలుస్తుంది. మరో పోరాటాల గడ్డ అయిన ఉత్తరాంధ్ర సాహిత్యం పట్ల కూడా పెనుగొండకు అంతే గౌరవముంది. గురజాడ నుంచి నేటిదాకా ఉత్తరాంధ్ర రచయితలు ప్రజాపక్షం వహిస్తున్నారని ఆయన ప్రకటించారు. 'వైతాళికులు' సంకలనంలో తెలంగాణ నుంచి వేదుల తప్ప ఇంకెవరికీ స్థానం దక్కలేదనీ, రాయల సీమకు అన్యాయమే జరిగిందనీ ఆయన ఎలుగెత్తి చాటడంలో ఆ మక్కువే ధ్వనిస్తున్నది. అస్తిత్వ ఉద్యమాలు పెల్లుబుకుతున్న సందర్భం లో 'తొలి, మలి తరం తెలుగు కథలు' సంకలనంలో శూద్రుల కథలకు సముచిత స్థానం దక్కలేదని నిస్సంకోచంగా ఎత్తి చూపడం అభ్యుదయ విమర్శకుడుగా ఆయన ప్రజాతంత్ర దృక్పథానికి సంకేతం.

సందర్భం

పెనుగొండకు అన్వేషణ ఒక వ్యసనం. మిత్రులతో కలిసి సంకలనం చేసిన 'విస్మృత కథ' ఇందుకు బలమైన నిదర్శనం. ఆ సంకలనంలో తెలుగు సాహిత్య సమాజం నివ్వెరపడేట్లు పూర్వ భారత ప్రధాని పి.వి. నరసింహారావు రచించిన 'గొల్ల రామవ్వ' కథను వెలికితీశారు. ఇటీవల దాని మీద మంచి విశ్లేషణ కూడా చేశారు. పివి సునీల్ కుమార్ రాసిన 'థు' అనే కథకు పెనుగొండ ధైర్యంగా విస్తృత ప్రచారం ఇచ్చారు. చుండూరు మారణకాండలో న్యాయస్థానమిచ్చిన తీర్పును నిరసిస్తూ వచ్చిన ఆ కథ మీద అభ్యుదయ విమర్శకుడు పెనుగొండ విలువైన వ్యాసం రాశారు. రచయిత ప్రతిపక్షంగా ఎంత బాధ్యతగా వ్యవహరించాలో చెప్పారు. ఇవన్నీ పెనుగొండ లోని ప్రగతిశీల చైతన్యానికి సంకేతాలు. అస్తిత్వ వాదాలను అంగీకరించే క్రమంలోనే ఆయన అభ్యుదయ సాహిత్యంలో ప్రతిబింబించే దళిత జీవితాన్ని పునర్నిర్మాణం చేశారు. ఇది అస్తిత్వ వాదాలు మొదలుకాక ముందు అభ్యుదయ సాహిత్యం తనదైన మార్గంలో నిర్వహించిన ప్రజానుకూల పాత్రను ఇప్పటి తరానికి పరిచయం చేస్తుంది.

కవిత్వం సంకలనాలను, కథా సంకలనాలను విమర్శకులు పెద్దగా పట్టించుకోలేదు. కానీ పెనుగొండ వాటి మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సంకలనాల్లో వైవిధ్యం ఉండటమే పెనుగొండ ఆసక్తికి కారణం. సంకలనాల మీద పెనుగొండ రాసిన మూడు నాలుగు వ్యాసాలు ఆయన అధ్యయన విస్తృతికి నిదర్శనాలు. ఆయన గొప్ప పాఠకుడు. ఆయన జ్ఞాపకశక్తి అసామాన్యం. ఇప్పటి పాఠకులకు తెలుగులో ఇన్ని కవిత్వం, కథా సంకలనాలు వచ్చాయా అనిపిస్తుంది ఆయన వ్యాసాలు చదివితే. గ్రంథాలయాల పునర్వికసనం గురించీ, సాంస్కృతిక విధానం ప్రకటన అవసరం గురించి పెనుగొండ రాసిన రెండు విమర్శ వ్యాసాలు చాలా విశిష్టమైనవి. అభ్యుదయవాదుల ఆలోచనలలోని విశాల, సమగ్ర దృష్టికి ఆ వ్యాసాలు ఆనవాళ్ళు. ప్రజా శ్రేయస్సు, సామాజిక సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా పురోగమిస్తున్న అభ్యుదయ కవిత్వం గొప్ప ప్రగతిపథగామి అనే స్పృహ పెనుగొండకు తొలినాళ్ళ నుంచీ ఉన్నది. అందుకే ఆయన కుల దురహంకారంపైన నిరసననూ, ప్రాంతీయ అసమానతల పట్ల విమర్శనాత్మకతనూ, సమ సమాజ ఆకాంక్షనూ అభ్యుదయ కవిత్వం అనేక ప్రక్రియల ద్వారా ప్రచారం చేస్తున్నదని 'దీపిక' గ్రంథమంతా చాటి చెప్పారు. ఆయన తన అభిప్రాయాలకు తన పూర్వ మార్క్సిస్టుల అభిప్రాయాలతో పాటు, డా.బి.ఆర్. అంబేద్కర్ అభిప్రాయాలను కూడా ఉపపత్తులుగా చూపారు. అది ఆయన సమన్వయ ధోరణి.

పెనుగొండ విమర్శలో సందర్భ ఔచిత్యం, కాల స్పృహ, చారిత్రక జ్ఞానం, రచయితల పట్ల గౌరవం, సాహిత్యం పట్ల ప్రేమ, జీవితం పట్ల విశ్వాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. రచయితల కృషిని, సంపాదకుల కష్టాన్ని గౌరవిస్తూనే లోపాలను ఎత్తి చూపడానికి ఆయన వెనుకాడ లేదు. డా.సి.నారాయణరెడ్డి చేసిన ఇద్దరు యుగకర్తలు సిద్ధాంత ఖండనలో ఇది స్పష్టమౌతుంది. తెలుగులో వెయ్యి కవితా సంకలనాలు, రెండు లక్షల కథానికలు వచ్చి ఉంటాయన్న అంచనా కట్టగల అధ్యయనం ఆయనది. ఆయనకు అనువాద సాహిత్యమంటే కూడా చాలా గౌరవం ఉంది. ఆదానప్రదానాల వల్లనే ఏ సాహిత్యమైనా బల పడుతుందని అన్నారు. ఆయనది వాస్తవిక దృష్టి. ఆయన నేటి కాలపు అభ్యుదయ విమర్శా దీపధారి.

(నేటి సాయంత్రం 6 గంటలకు గుంటూరులోని జాషువా విజ్ఞానకేంద్రంలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పెనుగొండకు అభినందన సభ)

– రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

కవితలోని కొత్త వెలుగు



జస్ట్ ఎ హౌజ్ వైఫ్ పుస్తకంలో కవితలన్నీ పరిశీలిస్తే ఒక మోనోలాగ్ (స్వగతం), మరొక డైలాగ్ (పరస్పర సంభాషణ) బొమ్మాబొరుసూ వలె కనిపిస్తాయి. టీఎమ్మెస్ తన వ్యాసంలో 'స్త్రీలకు ఐదు రకాల సమస్యలున్నాయని వివరిస్తాడు. అవి 1. వాశీఖ్యుశ్రీ ఝుఎశీబతీ 2. ఎశీబంవ ఔశీతీఎ 3. జష్ట్రఅశ్రీఎతీవఅ 4.ఖీఎఅశ్రీఎ 5. వావఇఖ్యుశ్రీఓఎ అని, స్త్రీల మీద జరుగుతున్న ఈ ఐదు దోపిడీ రూపాలూ ఒకే స్థాయి కలిగినవి కావు. ఒకటో రెండో పరిష్కారమైతే మిగిలినవి వాటంతట అవే పరిష్కారం అయ్యేవి కావు (త్రిపురనేని సాహిత్య సర్వస్వం) అంటాడు. సంపుటికి పెట్టిన 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్' అనే పేరు వల్ల కవయిత్రిలో ఉన్న ప్రతిఘటనా స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు. అది కాస్త ఉదారవాదంగా తోచినా ఈ కవిత్వంలో తీవ్రత ఉంది. టైటిల్ కవితతోబాటు, నైస్ గర్ల్ సిండ్రోం, ఇంధనం, బ్రేకప్ స్టోరీ, గోదావరి, ముగిసీ ముగియకుండా, ఉద్యోగంలో చేరాక వంటి కవితలు చదివాక ఈ సంపుటికి ఏర్పడ్డ నిర్దిష్టమైన దిశ తెలిసివస్తుంది. అలా అని ఇట్లు నీ కవిత, వొంటరితనం, నిగూఢం, తరంగం వంటి కవితల్ని తక్కువ చేయలేము. వీటన్నింటినీ చదివేక కవయిత్రి తత్వ నిరూపణ అంత సులభం కాదు. అయితే అది అవసరమా? అంటే అవసరమే. ఎందుకంటే స్త్రీకి సంబంధించిన అనేక అంశాలు ఇప్పటికే ఎంత వ్యాప్తిలోకొచ్చినా ఏ కొత్త అభివ్యక్తీ నిరుపయోగమైనది కాదు. ఎన్ని ఉద్యమాలు జరిగినా స్త్రీలపై పని చేసే సామాజిక, సాంస్కృతిక, కౌటుంబిక ఒత్తిడి ఇంకా సజీవంగానే ఉంది. ఈ కవితలు చదివాక కవితకి ఫెమినిస్టు ధోరణి పట్ల, ఆ ఉద్యమ విజయాలూ– పరిమితుల పట్ల స్పష్టత ఉన్నదని రూఢి చేసుకోవచ్చు. మళ్ళీ మళ్ళీ ఇలా ఎవరు రాసినా, వేళ్ళూనుకున్న ఒక జాఢ్యం గురించి కనీసం తన చుట్టూ ఉన్న కాసింతమందినన్నా ప్రభావితం చేయగలిగిన పనిగానే చూడాలి. కవిత ఏ స్త్రీ జస్ట్ ఎ హౌజ్ వైఫ్ కాదు, తనపైగల నియంత్రణల్ని ఎదుర్కోగలిగిన చైతన్యం ఉన్న వ్యక్తి కూడా అని తేల్చి చెబుతుంది. చాలాచోట్ల నా, నీ అన్నప్పుడల్లా ఆ సంబోధనల్ని సమూహ ప్రాతినిధ్యాలుగా గుర్తించాలి. విశాల దక్పథంతో చదవాలి. సావిత్రి మొదలు జయప్రభ, ఓల్గా, రజని, నిర్మల, విమల, జూపాక ... ఇలా ఎన్ని పేర్లు ఉటంకించినా వారి వారి వ్యక్తీకరణల్లో కనబరిచిన వస్తు స్థితికి గల సూటిదనం ఈ కవితలకూ వర్తిస్తుంది. కవిత ఎంతమాత్రం జంకూ గొంకూ లేకుండా రాయడం గమనార్హమైన లక్షణం.

కవిత ప్రకృతినిష్టపడే వ్యక్తి. ప్రాకృతిక చలనాలు స్త్రీని ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఇప్పుడిప్పుడే గమనంలోకి తెచ్చుకుంటున్న ప్రౌఢ. అందుకే మరికొన్ని కవితలు, తనదైన, తనవైన కాల్పనిక స్వేచ్ఛా ప్రపంచంలోంచి బయటకు తొంగిచూసినవిగా తోస్తాయి. ఇది నేనేనా, మనసా, సాంద్ర ఘడియ, ఆజన్మం, పుస్తకంలోంచి, నీకూ నాకూ మధ్య వంటి కవితలు కవయిత్రిలో ఉన్న సహజ ఆనంద సౌందర్యానుభవ స్వభావానికి సాక్ష్యం. సామాజికత ప్రతిబింబించిన కవితల కన్నా స్వీయయాత్మక ధోరణిలో రాసిన కవితల్లో తన ఊహలు, ప్రతీకలు, కల్పన శక్తివంతంగా కనిపిస్తాయి. ప్లటోనిక్ లవ్ తాలుకూ తాదాత్మ్యత కనిపిస్తుంది. మబ్బులు లాంటి కవితలు చదివితే కుందుర్తి 'మేఘమాల' గుర్తుకు వస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఒక రెండు ధోరణులు కలసి ఏకరూపత సాధించేందుకు జరుగుతున్న సంఘర్షణ ఉంది. నా బాల్యంలో ఉగాది, సంక్రాంతి వంటివి ఎప్పటికీ పాతబడని కవితలు. అయితే ఏమి రాసినా లేనిదాన్ని స్థిరపరచాలన్న లక్షణం ఈ కవితల్లో లేనే లేదు. ఆసాంతం తడి ఉన్న వాక్యాలు గల సంపుటి ఇది.

'వచన కవిత్వం వచ్చిన తర్వాత వచనానికి కవిత్వానికీ మధ్యన ఉండే సరిహద్దు రేఖ చెరిగిపోయింది' అన్నారు కుందుర్తి. ఒక కొత్త కవి ఈ లోకంలోకి అడుగు పెడుతున్నప్పుడు భాషా వినియోగం వారి ప్రయాణపు మొదలును సూచిస్తుంది. కవితలో తెలుగు భాష పట్ల తనకే తెలియని ఒక వ్యామోహం ఉంది. ముఖ్యంగా శబ్దం. కొన్ని ప్రయోగాలట్లా కనబడతాయి. క్రియాంత వాక్యప్రయోగం, నైరూప్యతని ఈమె తక్కువగా వాడతారు. భాషా పరంగా వాళ్ళ తాతగారు కోరుకున్న ఐవఎశీఛతీఓఅయ్‌అశీఅ శీట జుఇజూవతీఅవఅఎవ ఖఅఎ జుఇజూతీవంఅశీఅ సాధించడానికి కవిత గారు చాలా కృషి చేశారు.

కవితలో కార్యకర్తృత్వ స్వభావం కూడా ఎక్కువ. బహుశా అది వాళ్ళ నాన్న గారి స్ఫూర్తిగా అనుకోవాలి. ఫ్రీవర్స్ ఫ్రంట్ పేరిట సుభద్ర గారితో కలసి వాట్సాప్ గ్రూపు నిర్వహించడం, కవితల పోటీ పెట్టి బహుమతులివ్వడం, ఆ కవితలని 'ఆనవాళ్ళు' అనే ఒక సంకలనం చేయడం, కొత్తగా పుస్తకాలు వేసుకునే వారికి సహాయపడ్డం– ఇలా ఆమె తన శక్తికి మించిన సాహిత్య కృషి చేస్తున్నారు. అందుకామె కుటుంబంతో సహా అనేక మిత్రులను కలుపుకుని పోవడం చాలా మెచ్చదగిన విషయం. కనుక కవిత వచన కవితకు వెలుపలి వ్యక్తి కాదు; రక్తసంబంధీకురాలు.

కవి సమయాలు ఒక రోజులో ఏర్పడేవు కావు అంటారు మరొక చోట కుందుర్తి. విలువలకి అనేక కోణాలుంటాయి. వాటిపై నిత్యం మార్పు ప్రభావం అనివార్యం. అయినప్పటికీ ఎన్నాళ్ళకీ చెడని మూలం ఒకటి ఉంటుంది. మారుతున్న కవిత్వ వస్తువు, అభివ్యక్తి, రాస్తున్న కొత్త తరం, వారి మారుతున్న జీవన స్థితిగతులూ, ప్రభావాలన్నింటినీ బేరీజు వేసుకుంటే నిజాయితీగల అనేకమంది కొత్త స్వరాలు వినిపిస్తాయి. ఈరోజు గొంతు సవరించుకుంటున్న కుందుర్తి కవిత కూడా అటువంటి నవ యవ్వన కవిత్వోద్వేగ సందర్భమే. అదే కదా కవితలోని కొత్త వెలుగు.

– శ్రీరామ్

60 కవిస్వరాల పరామర్శ



కెంగార మోహన్ చాలా ఏళ్లుగా నాకు యువకవి మిత్రుడు. కన్నడ – తెలుగు రెండు భాషల సాహిత్యం గురించి తెలుగులో అనర్గళంగా మాట్లాడగలడు. ద్రావిడ భాషల మధ్య వారధి అయిన ఆయన, నన్ను సాహిత్య ప్రస్థానం పత్రికకు రెండుసార్లు ముఖాముఖికి పరిచయం చేశారు. దక్షిణాదిలోని ముఖ్యమైన జైనక్షేత్రమైన పెద్దతుంబళం గ్రామంలో తెలుగు, కన్నడ వాతావరణంలో జన్మించాడు. తెలుగు వాతావరణంలో పెరిగాడు. ఇప్పుడు ద్విభాషా వాతావరణంలో నివసిస్తున్నాడు. కన్నడలోనూ వ్రాయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాడు. అయితే తెలుగులో ప్రధాన సాహిత్య ప్రక్రియ అయిన కవితా రంగాన్ని తన కలంతో పండిస్తున్నాడు. ప్రగతిశీల సాహిత్య ప్రతినిధిగా అనేక సెమినార్లలో ఉపన్యాసాలు ఇస్తున్నాడు. ప్రగతిశీల సాహిత్య సంఘమైన సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులుగా, సాహిత్య ప్రస్థానం సాహిత్య మాస పత్రికకు సంపాదక మండలి సభ్యులుగా రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది రచయితలకు మిత్రుడయ్యాడు. కవిత్వం, కథ, విమర్శ రచనలు చేస్తూ వివిధ పత్రికల్లో మోహన్ రచనలు ప్రచురింపబడుతున్న సందర్భంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సాహిత్యలోకంలో నిలబెట్టుకోగలుగుతున్నారు. వివిధ పత్రికలకు దేశంలోని గొప్ప, వర్ధమాన కవుల కవిత్వంపై వ్యాసాలు రాస్తున్నాడు. తనిలా చేయడంవల్ల వేలాదిమంది పాఠకులకు, అవగాహనను విస్తతం చేస్తుంది.

మోహన్ కారల్ మార్క్స్, అంబేద్కర్, బుద్ధుడు వంటివారి భావజాలంతో ప్రభావితులయ్యారు. ఈ కారణంగా సహజంగా వామపక్ష రచయితగా ఆవిష్కరింపబడ్డాడు. కర్నూలు జిల్లాకు చెందిన దళిత రచయితలను సమీకరించి 15 కథలతో 'నిప్పులవాన' పేరుతో సంకలనం చేసి, ప్రచురించాడు. కెంగార మోహన్ అహర్నిశలూ అలసిపోని రచయిత, గొప్ప నిర్వాహకుడు, ఆలోచనాపరుడు. సాహిత్యం, పోరాటం అతని శరీరంలో రెండు ఊపిరితిత్తులు. ఇలాంటి సాహిత్య ప్రచారకుల వల్లనే ఏ దేశంలోనైనా సాహిత్యం మనుగడ సాగిస్తుంది, ఎదుగుతుంది.

ఆయన కూడా నాలాగే ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు పిల్లలను భాషా వారసులుగా మార్చగలడు. వారిని సాంస్కతిక రాయబారులుగా చేయగలడు. ఈ తాత్విక కారణాల వల్ల నాకు 'కెంగార' చాలా ఇష్టం. పొరుగు రాష్ట్రంలో ఉండడం వల్ల వారి ప్రతి మానవీయ ప్రవర్తనను జాగ్రత్తగా గమనిస్తూ మెచ్చుకుంటున్నాను. 'చెమట చెక్కిన వాక్యం' పేరిట వెలువరించిన తన వ్యాసాల సంకలనంలో అద్దేపల్లి రామ్మోహనరావు, శివారెడ్డి, సినారె వంటి పెద్దలతో పాటు అనేకమంది యువతరం కవులున్నారు. కె.శివారెడ్డి కవితా సంపుటి మోహనా ఓ మోహనాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినప్పుడు నేను చాలా ఉప్పొంగిపోయాను. అప్పట్లో ఆయన కవితలు కొన్నింటిని కన్నడలోకి అనువదించాను. నా ఆప్తమిత్రుడు కెరె జగదీశ్ కూడా ప్రజల బాధలకు తల్లడిల్లిన ఆత్మీయుడిగా ఆయన సన్నిహితుల మధ్య మంచి పేరుంది. ఆయన ఒక కవితలో చెప్పినట్లు 'మరణానంతరం కూడా జీవించే అరుదైన వాడే కవి' అని. ఆయన రాసిన కవితా సంపుటాలు తెలుగు సాహిత్యంలో ఆయన స్మతిని సుస్థిరం చేశాయి. పీడితుల వేదననే తన కవితలకు ఊపిరిగా మలిచిన కెరె జగదీశ్ అకాల నిష్క్రమణ కవితా రూపానికి తీరని లోటు. ఒడిశా రాష్ట్ర వాసి విజయచంద్ర ఈ సంకలనంలో ఉన్నారు. చిలీకి చెందిన గొప్ప ప్రజాకవి పాబ్లో నెరోడా ఉన్నట్టే, ఇరానియన్ కవి అబ్బాస్ కియారోస్తమి కూడా ఉన్నాడు.

ఇందులో ఉన్న దాదాపు 60 మంది కవులూ ప్రస్తుత పరిస్థితుల్లో పీడిత మనిషికి అండగా నిలిచే యోధులు. మోహన్ అద్భుతమైన కవితా ప్రతిభ ప్రతి వ్యాసానికి ఆయన పెట్టిన కవితా శీర్షికలలో ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు అద్దేపల్లి రామ్మోహనరావు గారి గురించిన వ్యాసానికి 'కాలం మీద సంతకం చేసి వెళ్ళిపోయాడనడం' గొప్ప శీర్షికలకు నిదర్శనం. కె.శివారెడ్డి అయితే ఎక్కడ పద్యాలు దొరికితే అక్కడ సజించే మహాకవి. మాదిగల హృదయ స్పందనల ప్రతిధ్వని నాగప్ప గారి సుందరరాజు. కవితల్లో ఉండే కన్నీటి కెరటాల్లో తేలియాడే పద్యాలను స్వరపరిచిన ఘనత విజయచంద్రదే. అందువల్ల ఇక్కడ శీర్షికలు అద్భుతమైన కవితల కంటే తక్కువ కాదు. మూడు వందల పేజీలకు పైగా ఉన్న ఈ రచన తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సహకారం. 'ముక్కు కంటే ముక్కు పుడక బరువు'గా ఉండకూడదని, నా నాలుగు మాటలు క్లుప్తంగా రాశాను. ఇది రాసే అవకాశం కల్పించిన కెంగార మోహన్‌కు, కథకుడు మారుతీ పౌరోహితం గారికి కతజ్ఞతలు.

– కుం. వీరభద్రప్ప
కేంద్రసాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత

('చెమట చెక్కిన వాక్యం' ఆవిష్కరణ సభ విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుంది. సాహిత్య విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య ఆవిష్కరిస్తారు. జి.వెంకటకృష్ణ, లోసారి సుధాకర్, కెంగార మోహన్, వొరప్రసాద్ పుస్తకంపై మాట్లాడతారు.)

సాహితీ పురస్కారాలకు ఆహ్వానం

ఈ కింద పేర్కొన్న సాహిత్య పురస్కారాల కోసం రాష్ట్ర, రాష్ట్రేతర రచయితల నుంచి 2024లో ప్రచురించిన పుస్తకాలను ఆహ్వానిస్తున్నాము. 1. శ్రీ మక్కెన రామ సుబ్బయ్య కథా పురస్కారం, 2. ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారం, 3. డా. కె వి రావు కవితా ప్రక్రియ పురస్కారం (మినీ కవితలు, గజల్స్, నానీలు, హైకూలు, దీర్ఘకవితలు తదితరాలు), 4. సాహితీ పురస్కారం (వ్యాసాలు / సమీక్ష / విమర్శ) 5. బాలసాహిత్య పురస్కారం (కథ, కవిత, గేయ సంపుటులు) 6. విజ్ఞాన / మనోవైజ్ఞానిక పుస్తక పురస్కారం.. ఇందుకు గాను రచయితలు తమ పుస్తక ప్రచురణలను మూడేసి (3) ప్రతులను ఈ కింది చిరునామాకు ది. 30-1-2025 లోపుగా పంపగలరు. విజేతలు ఒక్కొక్కరికి రూ. 7 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సన్మానం ఉంటుంది.

పుస్తకాలు పంపాల్సిన చిరునామా : డా. మక్కెన శ్రీను, కేరాఫ్ : కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, గరివిడి, విజయనగరం జిల్లా-535 101, ఎ.పి. చరవాణి : 98852 19712

29న 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ'...ఆవిష్కరణ

పాయల మురళీకృష్ణ కవితా సంపుటి 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' ఆవిష్కరణ సభ 29-12-2024 సాయంత్రం 5 గంటలకు విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరుగుతుంది. చీకటి దివాకర్ నిర్వహణలో ద్వారం దుర్గా ప్రసాదరావు ఆవిష్కరిస్తారు. అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం పాల్గొంటారు. కవితాసంపుటి పరిచయం : మానస చామర్తి, సుంకర గోపాలయ్య. ప్రచురణకర్త మాట : శ్రీరాం పుప్పాల. ఆప్తవాక్యం : కంచరాన భుజంగరావు, లండ సాంబమూర్తి. – సాహితీస్రవంతి, విజయనగరం

27న నాగస్వరం ఆవిష్కరణ సభ

కోయి కోటేశ్వరరావు కవితా సంపుటి 'నాగస్వరం' ఆవిష్కరణ సభ 27-12-2024 శుక్రవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ బుక్ ఫెయిర్, ఎన్‌టిఆర్ స్టేడియం, ఇందిరాపార్క్‌లో తోపుడు బండి సాధిక్ ఆలీ వేదికపై జరుగుతుంది. సభాధ్యక్షులుగా ఎం.ఎం.వినోదిని, ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా శిఖామణి, ఆత్మీయ అతిథులుగా యాకూబ్, నక్కా విజయరామరాజు, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, జె.నీరజ పాల్గొంటారు



జాకీర్ కోసం ...

చలన చక్రంలో జనన మరణాలు
శిలాక్షరాలై వుండొచ్చు
కానీ, జాకీర్ భాయ్...
ద్వి తబలా దరువులతో
అద్వితీయ సంగీత సారథివై
చరించిన నువ్వో విప్లవం పరిప్లవం

శాస్త్రీయ స్వరాల మాంత్రికా
త్వమేవాహ రాగాల తాంత్రికా
వాహ్ ఉస్తాద్ వాహ్...

నీ చేతి వెళ్ళ కోసలతో విన్యాసం
ప్రపంచాన్ని ఓలలాడించిన స్వరం
నీ కరాల నాట్యాల కమనీయ కాదంబరీ
నీ అభిమాన కరతాళ ధ్వనుల విశ్వంబరీ
అనిర్వచనీయం .. అమేయం.. అమోఘం
ప్రపంచ కచేరీలో రసరమ్య భావ వీచికై
ప్రేక్షక హృదులను మీటిన
అభ్యుదయ తాళ మంజరీ
అవిశ్రాంత స్వరకల్పనా ఝరీ..
నీ హృది తాండవం ఓ జలదరింపు
శ్రోతల మది లయల పులకరింపు

నేడు నీ శాశ్వత నిద్రతో
తబలా నిజంగానే మూగబోయి రోదిస్తోంది
తన్ను హత్తుకున్న ఎత్తుకున్న
జాకీర్ హుస్సేన్ కోసం...!

– డా.కటుకోర్ఘ్వుల రమేష్

జీవితం

ముళ్ల కంపలను పూలవనం చేస్తూ
రంపం తిమిరాన్ని చీల్చడమే మనిషీ
ప్రతియడుగు వెలుగు కై వెదకితేనే జీవితం
కలలు కలత కన్నీళ్లలతో తడిపినా
కష్టాలకీ వెరువక కదలడమే మనిషీ
నష్టాలు నిలబడవనీ నిదానిస్తేనే జీవితం

అణువణువు రంగులు మార్చే లోకానా
అంతరంగనా చెడు చేరనియకుండుటే మనిషీ
కొంతనైనా పరహితం చేస్తేనే జీవితం
కొసరు చూపులను కరకు మాటలను కలిపి
చరుకు ప్రవాహం కావడమే మనిషీ
బేరకు లేక భవిత దిద్దుకోవడమే జీవితం

చుట్టూ కానరాని కంటకాలను ఛేధిస్తూ
చీకట్లున్నా కడదాక యత్నించడమే మనిషీ
మెట్టుమెట్టు గట్టి ఘనతలు చేరడమే జీవితం
రెండు హృదయాలు ఒక్కటయ్యే చోట
గొంగళిపురుగు సీతాకోక కావుటయే మనిషీ
చెడు ఆలోచనలు వీడితేనే సుందరం జీవితం

– డా.ఐ.చిదానందం

శకలాల కింది నవ్వులు

కొన్ని బాల్యాలు
సీతాకోకచిలుకల్లా రంగులను అద్దుకోవాలనుకుంటాయి
కానీ.. ఎన్ని రంగులను దోసిల్లలో ఒంపుకుని
ఒడిసి పట్టుకున్నా..
అవి ఎగిరిపోయి ఏపుగా ఎదిగిన గూళ్ళ వసారాలో
పచ్చని మొక్కల కొమ్మల మీద
నవ్వులై మాట్లాడుకుంటాయి

ఊరి చివరన ఉన్న గుడిసె చూరు
పేదరిక పొయ్యి పోసే పొగ గట్కు తాగి
నుసి నుసిగా విరిగి పడి మసిమసిగా రాలిపడుతుంటది.
రాత్రి స్వప్నాలు మోసుకొచ్చిన తేనెలరొట్టె
పంటికింద చేరకముందే
తిమిరం ఎత్తుకెళ్ళింది!
ఆకలిని నిద్రపుచ్చిన రాత్రి...
దుఃఖపు తడి కనురెప్పలను తట్టి
మెలకువ వేకువ తలుపులు తెరిచింది

అరగని అక్షరాల పొట్లాలు..
సంచి చిరుగుల నుంచి తొంగి తొంగి చూస్తున్నాయి
నేలమీది మట్టిని నాకేద్దామని
ఏదో.. అక్షరాన్ని వెలిగిద్దామని
సంచి ముందు ముని ఆసనమేస్తాడా?
అరిగిపోయిన పెన్సిల్
చిరిగిపోయిన కాపీ
విద్యనెరగని పెద్దలు
కర్ణుని చావుకు కారణాల్లా..

ప్రశ్నల మొనలు గుండెలను గుచ్చుతూ
దుర్భర దారిద్ర్యం అక్షర వైకల్యాన్ని వాగ్దానం చేస్తుంది
అవస్థల సర్కారు బడి పిల్లల ఊహల కాంక్షలకు
ఆలోచనా వివేచనలద్ది ఉజ్వల భవిష్యత్తును ఆవిష్కరించాలి
వ్యధల శిథిలాల కింద శకలాలుగా ముక్కలవుతున్న
బాలల స్వప్నాలకు అక్షర రెక్కలను తొడిగి
ఆనందాల నవ్వులను అతికించాలి!

– యాదయ్య కొప్పోలు
94942 73703

చేదు నిజం

నేడు భారతావనిలో
కనిపించే ధోరణి ఒకటే
మాధ్యమాలలో
వినిపించే బాణీ ఒకటే
జరిగింది దారుణమైనా
జాలిగొలిపే బాల మరణమైనా
పౌర హక్కుల హరణమైనా
ప్రజల సొమ్ము అపహరణమైనా
రాజకీయ కోణాలు తాకాల్సిందే!
అసలు కారణమేమైనా
వారి వాదనకనుగుణమై
వక్రీకరణ కావాల్సిందే!

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం. 94408 36931.

పేర్ని నాని బియ్యపు దొంగ : బుద్దా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి పేర్ని నాని బియ్యపు దొంగ అని, ఇలాంటి వారిని క్షమించకూడదని టిడిపి ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో పేదలకు అందించాలనుకున్న బియ్యాన్ని దోచుకుతిన్నారని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆతని బృందం దారిమళ్లించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటి బయటపడుతున్నాయని తెలిపారు. స్మగ్లింగ్ చేసిన బియ్యాన్ని ఆఫ్రికా వంటి విదేశాలకు ఎగుమతి చేయడానికి కృష్ణపట్నం ఓడరేవు వాడుకున్నట్లు తేలిందన్నారు. పేర్ని నానికి 1999 ఎన్నికల సమయంలో ఉన్న ఆస్తి ఎంత? 2024లో ఎంతో లెక్కలు తేలాల్సిన్నారు. దొంగతనం చేసి పట్టుబడితే రూ.1.72 లక్షలు నాని కట్టడం హాస్యాస్పదమన్నారు. పేదల నోటికాడ కూడు తీసేసిన నాని కుటుంబానికి శిక్ష పడాల్సిందేనని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్ చేసిన అవినీతి కూడా బయటపడుతుందని అన్నారు.

స్వయం ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యత : మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్వయం ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, చిన్న పరిశ్రమలు ప్రోత్సహిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన అవగాహనా సద స్సులో ఆయన మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషితో రాష్ట్రానికి రూ.లక్షా 50 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. భర్తలను కోల్పోయిన 125 మంది వితంతువులను గుర్తించి వారితో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రామ చంద్రపురంలో ఆరు ఎకరాల స్థలం గుర్తించా మన్నారు. మండలానికి ఒక ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తామని, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు, వృద్ధ, అనాధ శరణాలయాలు ఏర్పాటుకు కృషి చేస్తామని, పేదరికం లేని సమాజం సాధ్యమవుతుందని అన్నారు. కె.గంగవరం మండలం కోటిపల్లి సమీపంలో పరిశ్రమ స్థాపన 350 ఎకరాలు స్థలం గుర్తించామని ఈ సంద ర్భంగా ఆయన వివరించారు. ఆ కార్యక్రమంలో పలువురు యువకులు, ప్రజాప్రతి నిధులు నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకులకు 1.96 లక్షల కోట్లు ఎగవేత

(మొదటి పేజీ తరువాయి)

ఇతర ప్రయోజనాల కోసం మళ్లించినప్పుడు లేదా నిధులను స్వాహా చేసినప్పుడు ఉద్దేశ పూర్వక డిఫాల్ట్ జరుగుతుంది. ఈ విషయంలో నీరవ్ మోడీ, విజయ్ మాల్యా వంటి ఘరానా బాబులున్నారు. గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ అయిన మెహుల్ చోక్సీ , అతని మేనల్లుడు నీరవ్ మోడీ కంపెనీ చేసిన రుణ మోసం నివేదించబడినప్పుడు ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన తర్వాత భారతదేశం నుండి వారు పారిపోయారు అయినా, వారిపై ఎలాంటి చర్యలు లేవు. తాజా డిఫాల్టర్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్న కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ బ్యాంకులకు రూ.4,305 కోట్లు బకాయిపడినట్లు ఆర్‌బిఐ తెలిపింది. బ్యాంక్ మోసం కేసుకు సంబంధించి పారిశ్రామికవేత్తకాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ యజమాని సంజయ్ సురేఖను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ వారం ప్రారంభంలో అరెస్టు చేసింది. అతడికి సంబంధించిన ఆస్తులపై దాడులు నిర్వహించి రూ.4.5 కోట్ల విలువైన ఆభరణాలు, పలు విదేశీ నిర్మిత లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్‌కు చెందిన ట్రాన్స్‌స్ట్రాయ్ (ఇండియా) లిమిటెడ్ టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావుకు చెందినది. బ్యాంకుల నుంచి సేకరించిన నిధులను మళ్లించేందుకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ పలు కంపెనీలను ప్రయోగించిందని ఈడీ తన విచారణలో పేర్కొంది

ఈ ఏడాది జూన్ నాటికి రూ.వెయ్యి కోట్లు మించి రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన సంస్థల జాబితా

రుణ గ్రహీత	– రూ.కోట్లలో..
గీతాంజలి జెమ్స్ లిమిటెడ్	8,516
ఎబిజి షిప్‌యార్డ్ లిమిటెడ్	4,684
కాన్కాస్ట్ స్టీల్ అండ్ పవర్	4,305
ఎరా ఇన్ఫ్రా ఇంజినీరింగ్	3,637
ఆర్ఇఐ ఆగ్రో	3,350
విన్సమ్ డైమండ్ అండ్ జ్యువెలరీ	2,927
ట్రాన్స్‌స్ట్రాయ్ (భారతదేశం)	2,919
రోటోమాక్ గ్లోబల్	2,894
జూమ్ డెవలపర్లు	2,217
యూనిటీ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్‌లు	1,987
డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్	1,960
ఫ్రాస్ట్ ఇంటర్నేషనల్	1,913
శ్రీ లక్ష్మి కోట్సిన్	1,887
ఎస్‌విఓ జిఎల్	
ఆయిల్ గ్యాస్ అండ్ ఎనర్జీ	1,705
సిద్ధి వినాయక్ లాజిస్టిక్	1,575
నాకోడా లిమిటెడ్	1,550
ప్రతిభా ఇండస్ట్రీస్	1,548
సూర్య వినాయక్ ఇండస్ట్రీస్	1,479
గిలి ఇండియా	1,447
నక్షత్ర బ్రాండ్లు	1,440
గుప్త కోల్ ఇండియా	1,436
శ్రీ గణేష్ జ్యువెలరీ హౌస్	1,401
పరేఖ్ అల్యూమినెక్స్	1,368
వార్డాజ్ సిమెంట్	1,291
కార్పొరేట్ ఇస్పాత్ అల్లాయ్స్	1,190
ఎస్ కుమార్ దేశవ్యాప్తంగా	1,137
అమీరా ప్యూర్ ఫుడ్స్	1,096
ఆర్‌వి ఇంజనీరింగ్	1,052
కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్	1,021

సిఎస్ రేసులో ముగ్గురు..!

నెలాఖరుకు రిటైర్డు కానున్న సిఎస్ నీరబ్ కుమార్

విజయానంద్

సాయిప్రసాద్

సిసోడియా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తదుపరి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) రేసులో ముగ్గురు సీనియర్ ఐఎఎస్ అధికారులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఏడాది జూన్ 7న సిఎస్‌గా బాధ్యతలు తీసుకున్న నీరబ్ ఆ నెలాఖరుతోనే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయన పదవిని ఆరు నెలలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో కేంద్ర ప్రభుత్వం అందుకు అనుమతినిచ్చింది. మరోసారి పొడిగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఆయన ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. సీనియార్టీ ప్రకారం రేసులో 8 మంది ఉన్నా, ప్రధాన పోటీ ముగ్గురి మధ్యే నెలకొంది. రేసులో ప్రముఖంగా జి సాయిప్రసాద్, ఆర్‌పి సిసోడియా, విజయానంద్ పేర్లు వినిపిస్తున్నాయి. సీనియార్టీ ప్రకారం చూసుకుంటే సీనియర్ అధికారి వై శ్రీలక్ష్మి, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరాము, జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న సుమితాదావ్రా, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వరుసలో ఉన్నారు. అయితే వై శ్రీలక్ష్మి గత ప్రభుత్వానికి అంటకాగారనే నెపంతో జిఎడికి ఆమెను పరిమితం చేశారు. అజయ్‌జైన్ కూడా చంద్రబాబుకు అత్యంత దగ్గర ఉంటారనే చర్చ అధికారుల్లో ఉంది. అయితే గత వైసిపి ప్రభుత్వంలో చంద్రబాబుపై నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అజయ్‌జైన్ వాంగ్మూలం ఇచ్చారని ఆగ్రహం టిడిపి నేతల్లో ఉంది. ఈ కారణంతో ఆయనకు సిఎస్ పదవి అందదని అంటున్నారు. పోటీల్లో ఉన్న ముగ్గురిలో సాయిప్రసాద్, సిసోడియా 1991 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారులు కాగా, విజయానంద్ 1992 బ్యాచ్‌కు చెందిన అధికారి. వీరు ముఖ్యమంత్రి చంద్రబాబుకు దగ్గరగా ఉంటారనే చర్చ నడుస్తోంది. విజయానంద్ 2025 నవంబర్‌లో, సాయిప్రసాద్ 2026 మేలో, సిసోడియా 2028 జనవరిలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే ముందుగా ఉద్యోగ విరమణ చేసే విజయానంద్‌కు ఆయన తరువాత సాయిప్రసాద్‌కు, ఆ తరువాత సిసోడియాకు ఇస్తారనే చర్చ కూడా నడుస్తోంది.

తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్య శాఖలో తొలగించిన హెల్త్ అసిస్టెంట్ (మగ ఆరోగ్య కార్యకర్తలు)లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు కె జగన్‌మోహనరావు అధ్యక్షత వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖ 2001, 2002లలో విడుదల చేసిన ఉత్తర్వులను అనుసరించి జిల్లా సెలక్షన్ కమిటీ మెరిట్ కం రోస్టర్ విధానం ద్వారా నియమించారు. సుమారు 1,500 మంది మగ ఆరోగ్య కార్యకర్తలు పని చేస్తున్నారని తెలిపారు. అరకొర వేతనాలు సకాలంలో అందకపోయినా ఏనాటికైనా రెగ్యులర్ అవుతామన్న ఆశతో పని చేస్తున్నారని చెప్పారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చారని, ఈ చర్య వల్ల వీరంతా కుటుంబాలతో రోడ్డున పడ్డారని చెప్పారు. తొలగించిన వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ పోస్టుల్లో నియామకం జరిగిన సమయంలో మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, అర్హత లేనివారికి ఇచ్చారని కోర్టు తీర్పు ఇస్తే వెంటనే హెల్త్ అసిస్టెంట్‌లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. నియామకంలో అవకతవకలు జరిగితే దాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని, ఈ ప్రక్రియలో అవకతవకలు జరగడానికి నియమించబడిన ఉద్యోగులు కారణం కాదని చెప్పారు. ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఉద్యోగాలు రానివారు కొంత మంది కోర్టుకు వెళితే మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, పరిశీలించి సరిచేయాలని కోర్టు తీర్పునిస్తే ఆ పని చేయకుండా 22 ఏళ్ల అనంతరం పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లను తొలగించడం సరైన చర్య కాదన్నారు.

ప్రభుత్వాలు కోర్టు తీర్పులను గౌరవిస్తే, ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ బేసిక్ పే, డిఎ, హెచ్‌ఆర్‌ఎ, ఇతర సౌకర్యాలు కల్పించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి, ఐపిఎం రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు డి సాయిప్రసాద్, గంటా సంధ్యారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జివి రమణ, ఎపి హంస సంయుక్త కార్యదర్శి ఎస్ జాన్‌హెన్రీ, రైల్వేస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎ నరసింహులు, ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వికెఎన్ జయలక్ష్మి, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఇ విజయకుమార్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. మేల్ హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవడంతోపాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు.

నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి చలపతిరావు

- పుస్తకావిష్కరణ సభలో సీనియర్ జర్నలిస్ట్ అమరయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జర్నలిజంలో నైతిక విలువలకు కట్టుబడిన జర్నలిస్టుల్లో మానికొండ చలపతిరావు ఒకరని, సీనియర్ జర్నలిస్ట్, అమరయ్య పేర్కొన్నారు. మిర్యాల వెంకటరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన మానికొండ చలపతిరావు పుస్తకావిష్కరణ సభ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. అమరయ్య రచించిన ఈ పుస్తకాన్ని మేఘాలయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కొట్టు శేఖర్, సీనియర్ జర్నలిస్టులు అమరయ్య, చందు జనార్ధన్, రామ్మోహన్‌నాయుడు, సమ్మెట నాగమల్లేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత అమరయ్య మాట్లాడుతూ.. మానికండ చలపతిరావు పద్మభూషణ్ అవార్డును కూడా తిరస్కరించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వర్ధమాన జర్నలిస్టులకు తెలుగులో వచ్చిన ఏకైక పుస్తకమని, ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. చలపతిరావు జీవిత చరిత్ర, జర్నలిజం విలువల గురించి అనేక మంది రాసిన 30 వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సామాజిక న్యాయ విశ్లేషకులు కటారి అప్పారావు, అరవ రామకృష్ణ, మాజీ ఐఎఎస్ అధికారి తోట గోపాలకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం పుస్తక రచయిత అమరయ్యను సన్మానించారు.

ఇంధన సామర్ధ్యంలో పెట్టుబడులు ఆకర్షణ

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన సామర్ధ్య రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడంపై పూర్తిగా దృష్టి సారించినట్లు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వెల్లడించారు. జాతీయ ఇంధన వారోత్సవాల ముగింపు సందర్భంగా విజయానంద్‌ను కలిసినట్లు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బిఇఇ) దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వాతావరణ మార్పులపై జాతీయ స్థాయి ఉద్యమంలో ఎపిది కీలకపాత్ర అని అన్నారు. ఇంధన సామర్ధ్యం, పునరుత్పాదక ఇంధన వనరుల కారణంగా రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నామని, ఈ విషయంలో తమకు తోడ్పాటునందిస్తున్న కేంద్ర సంస్థలు బిఇఇ, ఇఇఎస్ఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు. వాతావరణ మార్పులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్రం చేపట్టిన మిషన్‌లైఫ్ కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు. ఉర్జావీర్, అంగన్‌వాడీల్లో జాతీయ సమర్ధ వంటల కార్యక్రమం, పిఎంఎవై ఇళ్లకు స్టార్ రేటెడ్ ఇంధన సామర్ధ్య ఉపకరణాల అందజేత ప్రాజెక్టులను ప్రారంభించారని గుర్తుచేశారు. జాతీయ వీధి దీపాల ఇంధన సామర్ధ్య ప్రాజెక్టుతో రాష్ట్రంలో రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిశాఖ నిపుణులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

వీడని చిక్కుముడి..!

- కొనసాగుతున్న డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసు దర్యాప్తు
- శ్రీధర్‌వర్మ ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

ప్రజాశక్తి - ఉండి (పశ్చిమగోదావరి జిల్లా)

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసు చిక్కుముడి ఇంకా వీడలేదు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులు తలమునకలయ్యారు. డెడ్‌బాడీ వచ్చిన యండగండి తోపాటు సాగిపాడు, ఉణుదుర్రు తదితర ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ డెడ్‌బాడీ ఎవరిదనేది తేలకపోవడంతో పోలీసులకు ఈ కేసు పెనుసవాలుగా మారింది. అదే సమయంలో డెడ్‌బాడీ వచ్చిన ఇంటి యజమాని ముదునూరి రంగరాజు చిన్న అల్లుడు శ్రీధర్‌వర్మ ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. జిల్లాలోని కీలకమైన పోలీసు అధికారులంతా ఈ కేసు దర్యాప్తులో నిమగ్నమయ్యారు. ఇదే క్రమంలో రంగరాజు కుటుంబీకులు కేసు దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడించడం లేదని తెలుస్తోంది. చిన్నఅల్లుడు మంచోడే అని తొలుత చెప్పారని, తర్వాత గ్రామంలో తెలిసిన వివరాల ఆధారంగా మరోసారి విచారించగా ఆస్తి తగదాలు జరుగుతున్నట్లు తెలిపారని సమాచారం. డెడ్‌బాడీ వచ్చే రోజు కూడా శ్రీధర్‌వర్మ రంగరాజు కుటుంబీకులతో గొడవ పడ్డాడని, తనకు అప్పులు ఉన్నాయని, ఆస్తి అమ్మి రూ.కోటీ 50 లక్షలు ఇవ్వాలని వేధించేవాడని తెలిసింది. డెడ్‌బాడీ చూసిన తర్వాత కొద్దిసేపటికే శ్రీధర్‌వర్మ అదృశ్యం కావడంతో అందరి దృష్టి ఆయనపైనే ఉంది. అలాగే ఆస్తి పంపకాల విషయంలో రంగరాజు కుమార్తెలు సాగి తులసి, చేకూరి రేవతి మధ్య కూడా గొడవలయ్యేవని సమాచారం. ఇక శ్రీధర్‌వర్మ యండగండి ఎప్పుడొచ్చినా హెల్మెట్ ధరించే ఉండేవాడని, ఇంటి నుంచి బయటికి రావడం కూడా హెల్మెట్‌తోనే వచ్చేవాడని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆయన గురించి పెద్దగా తమకు తెలియదని, ఆస్తి కోసం గొడవులు జరుగుతున్నట్లు కుటుంబీకుల ద్వారా మాత్రం తెలిసేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా యండగండి పరిసర ప్రాంతాల్లో ఆచంట ఎస్ఐ వెంకటరమణ, ఉండి ఎస్ఐ మహ్మద్ నసీరుల్లా బృందాలు ఆదివారం గాలింపు నిర్వహించాయి.

2024లో రికార్డ్ ఐపిఒలు

- రూ.1.6 లక్షల కోట్ల నిధుల సమీకరణ
- ఈ వారంలో మరో మూడు ఇష్యూలు

ముంబయి : ప్రస్తుత ఏడాది 2024లో రికార్డ్ స్థాయిలో ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపిఒ)లు నమోదయ్యాయి. నిధుల సమీకరణలో నూతన మైలురాయిని తాకాయి. అనుకూలమైన మార్కెట్ పరిస్థితుల వల్ల రూ.1.6 లక్షల కోట్ల నిధులు సమీకరించాయి. హ్యూందాయ్ మోటార్ ఇండియా దేశ మార్కెట్ల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో రూ.27,870 కోట్ల ఐపిఒతో రికార్డ్‌ను నమోదు చేసింది. 2023తో పోల్చితే 2024లో ఐపిఒకు వచ్చిన కంపెనీల సగటు నిధుల సమీకరణ రెట్టింపై రూ.1,700 కోట్లకు చేరింది. గతేడాది ఇష్యూల సగటు మొత్తం రూ.867 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఒక్క డిసెంబర్‌లోనే 15 కంపెనీలు ఐపిఒకు వచ్చాయి.

స్టాక్ ఎక్సేంజీల సమాచారం ప్రకారం.. 2024లో 90 తొలి పబ్లిక్ ఇష్యూలు వచ్చాయి. మొత్తంగా రూ. 1.6 లక్షల కోట్లు సమీకరించబడ్డాయి. అదనంగా వొడాఫోన్ ఐడియా ఫాలోఆన్‌ఆఫర్ రూ.18,000 కోట్లు సమీకరించింది. డిసెంబర్ 23–24 తేదీల్లో ముగియనున్న ఎనిమిది ఐపిఒలు కూడా ఇందులో ఉన్నాయి. 2023లో 57 కంపెనీలు ఐపిఒకు వచ్చి రూ.49,436 కోట్ల నిధులు సమీకరించాయి. 2021లో 63 కంపెనీలు రూ. 1.2 లక్షల కోట్లను సమీకరించాయి. "పెరుగుతున్న రిటైల్ భాగస్వామ్యం, బలమైన దేశీయ ఇన్‌ఫ్లోలు, ఎఫ్‌పిఐల క్రియాశీల భాగస్వామ్యం, ప్రయివేటు పెట్టుబడులు పెరుగుదల, మౌలిక సదుపాయాలు, కీలక రంగాలపై ప్రభుత్వ కీలక దృష్టి సమిష్టిగా నిధుల సేకరణకు మద్దతును అందించాయి." అని ఆనంద్ రాఠీ అడ్వైసర్స్ డైరెక్టర్ వి ప్రశాంత్ రావు పేర్కొన్నారు.

ఈ ఏడాది అత్యధికంగా నిధులు సమీకరించిన సంస్థల్లో రూ.27,870 కోట్లతో హ్యూందాయ్ అగ్రస్థానంలో ఉండగా.. స్విగ్గీ రూ.11,327 కోట్లు, ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ రూ.10,000 కోట్లు, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స రూ.6,560 కోట్లు, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ.6,145 కోట్ల చొప్పున నిధులు సమీకరించి.. టాప్‌లో నిలిచాయి. డిసెంబర్ 23 నుంచి ప్రారంభమయ్యే వారంలో మూడు కంపెనీలు ఐపిఒకు రానున్నాయి. ఇందులో బెంగళూరు కంపెనీ యునిమెక్ ఎరోస్పేస్ రూ.500 కోట్ల ఐపిఒకు ప్రకటన చేసింది. ఈ ఇష్యూ డిసెంబర్ 26వరకు తెరిచి ఉంటుంది. ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో సోలార్91 క్లీన్‌టెక్, అన్యాపాలిటెక్ కంపెనీలు డిసెంబర్ 24, డిసెంబర్ 26న ఇష్యూకు తెరుచుకోనున్నాయి. "కొత్త సంవత్సరంలో నిధుల సేకరణ ఊపందుకోవడం మరింత వేగవంతం అవుతుందని, 2024 రికార్డు గణాంకాలను అధిగమించే అవకాశం ఉంది. 2025లో రూ.2.5 లక్షల కోట్ల ఇష్యూలు చోటు చేసుకోవచ్చని అంచనా. ఇప్పటికే 75 ఐపిఒ పత్రాలు ఆమోదం పొంది ఉన్నాయని అంచనా." అని ఈక్విరస్‌లోని ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మునీష్ అగర్వాల్ పేర్కొన్నారు.

అహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

AHAM HOUSING FINANCE

రిజిస్టర్డు & కార్పొరేట్ ఆఫీసు: జి–129, ఫేజ్–3, స్పెన్సర్ ప్లాజా, అన్నాశాలై, చెన్నై–600 002. NHB Reg.No.06.0181.19, website Address: www.ahamhfc.com/ email-id: compliance@ahamhfc.com, Tel: 044-40062651 CIN: U65922TN2017PTC2153589

(రూల్ 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

Ref: Loan Account No.AP/VJD/VJDA/000000076

ఏదైతే, క్రింది సంతకందారు **అహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 18.10.2024 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, **రుణగ్రహీతలు, 1. శ్రీ తలతోటి శ్రావణ్ కుమార్ (రుణగ్రహీత)** మరియు **2. శ్రీమతి దీప్తి బురుగుల (సహ–రుణగ్రహీత), ఇరువురి నివాసం:** ఫ్లాట్ నం.606, మాపెల్ ప్లాజా, రేయిన్ ట్రీపార్క్, పెద్దకాకాని, గుంటూరు–522 019 అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **18.10.2024** నాటికిగాను, **రూ.16,57,351/- (రూపాయలు పదహారు లక్షల యాభై ఏడు వేల మూడ వందల యాభై ఒకటి మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరినారు.

రుణగ్రహీతలు పూర్తి బకాయిని తిరిగి చెల్లించుటలో విఫలంచెందియున్నందున, ఇందుమూలంగా ప్రత్యేకించి వారికి మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, అధీకృత అధికారి, సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదువబడే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **21.12.2024న లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **అహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రూ. 16,57,351/- (రూపాయలు పదహారు లక్షల యాభై ఏడు వేల మూడు వందల యాభై ఒకటి మాత్రమే)**లును తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, చార్జీలు & వ్యయాలతోసహా చెల్లించుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ 8 యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తి వివరణ: మంగళగిరి సబ్–రిజిస్ట్రార్ ఆఫీసు జిల్లా పరిధిలో 145.2చ.గ.ల పూర్తి విస్తీర్ణంతో గుంటూరు జిల్లా, ఎస్ఆర్ఓ మంగళగిరి, మంగళగిరి టౌన్, కొత్తపేట వద్ద సర్వే నం.232/1ఇలో డోర్ నం.1–293 గల నివాసిత సైటు మొత్తం మరియు సరిహద్దులు: ల్యాండ్ యొక్క సరిహద్దులు: తూర్పు: బజారు, దక్షిణం: శ్రీరామ్‌దాస్ కృష్ణా రావు సైటు, పడమర: షేక్ లాల్‌బీ సైటు, ఉత్తరం: బొడ్డు నాగ మల్లేశ్వరి సైటు.

"ఇది తెలియజేయబడునది ఏమనగా, "అహం హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్" ఏదైతే ఒరిజినల్‌గా 21.11.2017న ఇన్‌కార్పొరేట్ అయినది. పేరు మార్పు అనుసరించి తేది 28.11.2024 నాటి సర్టిఫికేట్ ఆఫ్ ఇన్‌కార్పొరేషన్ ఆధారంగా, దాని అనుసరించి "అహం హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్" పేరు 29.11.2024 నుండి "అహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మారినది.

తేది: 21.12.2024
ప్రదేశం: గుంటూరు
అధీకృత అధికారి,
అహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

Chola Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు : చోళా క్రెస్ట్, సూపర్ బి, సి54 & సి 55, 4, తిరు వికా ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, టి.ఎన్.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ("ది ఆక్ట్") మరియు ది సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") లోని నియమాల క్రింద.

దిగువ సంకతందారులు **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ లఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** (ది సెక్యూర్డు క్రెడిటార్) యొక్క **అధీకృత అధికారిగా**, చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులను జారీచేసి రూల్ 3తో చదవగల చట్టంలోని 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో మరియు చట్టం క్రింద సదరు నోటీసు స్వీకరణ తేది నుండి **60 రోజుల్లోపు** సంబంధిత నోటీసుల్లో పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించమని కోరుతున్నారు. రుణగ్రహీత(లు) డిమాండు నోటీసు(ల) సేవలను తప్పించుకుంటున్నారని/ నివారిస్తున్నారని దిగువ సంతకందారు సహేతుకంగా విశ్వసిస్తారు, కాబట్టి నిబంధనల ప్రకారం అఫిక్స్ చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండు నోటీసు(ల)లోని విషయాలు ఇక్కడ క్రింద సంగ్రహించబడ్డాయి:

క్ర. సం.	రుణగ్రహీత/ల & సహా-రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	రుణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది & బాకీపడిన మొత్తం	ఆస్థి / సెక్యూర్డ్ అస్సెట్ వివరణ
1	రుణ ఖాతా నెం.(లు) : **HL05NUK000011587** 1) శ్రీ/శ్రీమతి మాదాల వంశీ కృష్ణ 2) శ్రీ/శ్రీమతి రమేష్ మాదాల 3) శ్రీ/శ్రీమతి అనంత లక్ష్మి మాదాల **అందరి నివాసం:** డి.నెం.2–22/11ఏ, కొండలరాయుని పాలెం, పువ్వాడ, రామాలయం దగ్గర, నూజెండ్ల, ఆంధ్రప్రదేశ్–522 660; **ఇక్కడ కుడా :** డోర్ నెం.2–22/11ఏ, పువ్వాడ, సర్వే నెం.270/1–1బి, కొండలరాయుని పాలెం, నూజెండ్ల మండలం, రామాలయం దగ్గర, నూజెండ్ల–522 660	₹ 13,30,940/-	18.12.2024 **& 17.12.2024** నాటికి **రూ.20,31,855/-** (రూపాయలు ఇరవైలక్షల ముప్పైఒకవేల ఎనిమిది వందల యాభైఐదు మాత్రమే)	గుంటూరుజిల్లా, నరసరావుపేట జిల్లా రిజిస్ట్రీ, వినుకొండ ఉపజిల్లా, నూజెండ్ల మండలం, పువ్వాడ గ్రామ పంచాయతీ, పువ్వాడ గ్రామం, డి.నెం.270/1–1బి, కొండలరాయుని పాలెం గ్రామం, విస్తీర్ణం ఎక 0–04 సెంట్లు = 193–5 చ.గ.ల కలిగియున్న డోర్ నెం.2–2/11ఏ, అసెస్‌మెంట్ నెం.263 కలిగిన 480చ.అ.ల ప్లింత్ ఏరియాలో ఆర్‌సిసి బిల్డింగ్ కలిగిన ఆస్తి మొత్తం భాగం, అన్ని ఫిక్చర్‌లు మరియు ఫిట్టింగ్‌లతో కలిపి. **సరిహద్దులు: తూర్పు:** గుంతకాల నారాయణ ఇల్లు; **దక్షిణం:** పూరిమెట్ల అంజి సైట్; **పడమర:** మాలాడి రామారావు ఆస్తి; **ఉత్తరం:** సి.సి రోడ్
2	రుణ ఖాతా నెం.(లు) : **HL05RAL000074695** 1) శ్రీ/శ్రీమతి బోగిరి శివాజీ 2) శ్రీ/శ్రీమతి సలోమి బోగిరి **అందరి నివాసం:** డి.నెం.10–51ఏ, స్టువర్ట్‌పురం, మురుకొండ పాడు, మెయిన్ రోడ్ దగ్గర, స్టువర్ట్‌పురం, ఆంధ్రప్రదేశ్–522 317; **ఇక్కడ కుడా :** డి.నెం.800/11/డోర్ నెం. 10–51ఏ, అసెస్‌మెంట్ నెం.167, హనుమాన్ రైస్ మిల్ దగ్గర, మురుకొండపాడు గ్రామపంచాయతీ, స్టువర్ట్పురం మండలం, బాపట్ల జిల్లా–522317, డి.నెం.800/11, డోర్ నెం.10–51ఏ, అసెస్‌మెంట్ నెం.167, హనుమాన్ రైస్ మిల్లు దగ్గర, మురుకొండపాడు గ్రామపంచాయతీ, స్టువర్టు.	₹ 16,00,000/-	18.12.2024 **& 17.12.2024** నాటికి **రూ.20,31,482/-** (రూపాయలు ఇరవైలక్షల ముప్పైఒకవేల నాలుగువందల ఎనబై రెండు మాత్రమే)	బాపట్ల జిల్లా, బాపట్ల రిజిస్ట్రేషన్ జిల్లా, బాపట్ల మండలం, హెచ్/ఓ మురుకొండపాడు, స్టువర్ట్‌పురం గ్రామ పంచాయతీ, మురుకొండపాడు గ్రామం, డి.నెం.800/11, డోర్ నెం.10–51ఏ, అసెస్‌మెంట్ నెం.167, విస్తీర్ణం ఎక.0.03సెంట్లు లేదా 145.2 చ.గ.లు లేదా 121.968 చ.మీ.ల స్థలంలో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ట్ రెసిడెన్షియల్ బిల్డింగ్‌ని 920 చ.అ.ల స్థలంలో నిర్మించినది, ఆస్తి మొత్తం భాగం,అన్ని సౌలభ్యం హక్కులతో పాటు, **సరిహద్దులు: తూర్పు:** బోగిరి భరత్ ఇంటిసైటు, **పడమర:** దేవరకొండ శ్రీను సైటు, **ఉత్తరం:** 10 అ.ల వెడల్పు ఉమ్మడి బాట; **దక్షిణం:** దాత యొక్క మిగిలిన సైట్.
3	రుణ ఖాతా నెం.(లు) : **LAP1VJI000048698** 1) శ్రీ/శ్రీమతి బేబీ ప్రొద్దుటూరి 2) శ్రీ/శ్రీమతి కోటేశ్వర ప్రొద్దుటూరి (అలియాస్) కోటేశ్వర రావు ప్రొద్దుటూరి **అందరి నివాసం:** 32–24–9, మొగల్రాజపురం, సిఎస్ఐ స్కూల్ రోడ్, విజయవాడ (అర్బన్), ఆంధ్రప్రదేశ్ –520 010; **ఇక్కడ కుడా :** ఆర్.ఎస్.నెం.819–10, డోర్ నెం.2–45, కాటూరు ఎస్‌సి కాలనీ మెయిన్ రోడ్, అసిస్ట్ నెం.140, కాటూరు : గ్రామం వుయ్యూరు మండలం, కృష్ణా జిల్లా–521 164, ఆంధ్రప్రదేశ్, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, కాటూరు–521 164.	₹ 14,25,000/-	18.12.2024 **& 17.12.2024** నాటికి **రూ.20,31,803/-** (రూపాయలు ఇరవైలక్షల ముప్పైఒకవేల ఎనిమిది వందల మూడు మాత్రమే)	కాటూరు గ్రామం, కాటూరు గ్రామ పంచాయతీ ప్రాంతం, వుయ్యూరు మండలం, ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రీ, కృష్ణా జిల్లాలోని డోర్ నెం.2–45, అసెస్‌మెంట్ నెం.140, ఆర్‌సిసి బిల్డింగ్‌తో ఆర్.ఎస్.నెం.819–10 లోని 336.7చ.గ.ల విస్తీర్ణంలోని ఆర్‌సిసి బిల్డింగ్ యొక్కఆస్తి. **సరిహద్దులుగా: తూర్పు:** దేవరపల్లి యేసుపాదం ఆస్తి 47.6 అ.లు; **దక్షిణం:** పంచాయతీ సిమెంట్ రోడ్ 63.6 అ.లు; **పడమర:** బుర్రే సుధాకర్ ఆస్తి–47.8 అ.లు; **ఉత్తరం:** 3.0 అ.ల వెడల్పు స్వంత మార్గం 63.6 అ.లు. అన్ని సౌలభ్యం హక్కులతో.

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు(ల)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి **60 రోజులలోపు** వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చు మరియు దానితో పాటు పైన పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లించాలని దీని ద్వారా సూచించబడ్డారు. చెల్లింపు అమలు తేదీ వరకు ఖర్చులు. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సెక్యూర్డు క్రెడిటార్ అని మరియు రుణగ్రహీత తనఖాగా ఉంచిన స్థిరాస్తి / ఆస్తులకు వ్యతిరేకంగా రుణగ్రహీత(లు) పొందే రుణ సదుపాయం సురక్షిత రుణం అని రుణగ్రహీత(లు) గమనించవచ్చు. (లు). రుణగ్రహీత(లు) నిర్ణీత గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు సెక్యూర్డు ఆస్తుల స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13(4) కింద అన్నిహక్కులను వినియోగించుకునే హక్కు ఉంటుంది. విక్రయం ద్వారా లేదా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు చెల్లింపును గ్రహించడం ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. సెక్యూర్డ్ క్రెడిటర్‌కు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షిత ఆస్తులు(ల)ను **అటాచ్ చేయడానికి మరియు/లేదా సీల్ చేయడానికి** కూడా అధికారం ఉంది. సెక్యూర్డ్ క్రెడిటర్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, సెక్యూర్డు ఆస్తుల విక్రయం తర్వాత, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బ్యాలెన్స్ బకాయిలను తిరిగిపొందడానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటర్‌కు అందుబాటులో ఉన్న అన్నిఇతర నివారణల నుండి స్వతంత్రంగా ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, సెక్యూర్డు ఆస్తుల రీడీమ్ చేయడానికి చట్టంలోని సెక్షన్ 13(8)కి రుణగ్రహీత(ల) దృష్టిని ఆహ్వానిస్తారు మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి, రుణగ్రహీత(లు) ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, సెక్యూర్డు ఆస్తుల డిస్పోజల్ లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సెక్యూర్డు ఆస్తులద్వారా బదిలీచేయడం నుండి నిరోధించబడింది /నిషేధించబడిందిసెక్యూర్డ్ క్రెడిటర్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించక పోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ దిగువ సంతకందారుని వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత(లు) వారు కోరుకున్నట్ల అయితే, సాధారణ కార్యాలయ పని వేళల్లో ఏదైనా పని రోజున దిగువ సంతకందారు నుండి దానిని సేకరించవచ్చు.

ప్రదేశం : గుంటూరు / బాపట్ల / క్రిష్ణా, ఆంధ్రప్రదేశ్
తేది : 18-12-2024
సం/- అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

GRIHUM HOUSING FINANCE

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
నమోదిత కార్యాలయం : 6వ అంతస్తు, బి-భవనం, గంగా ట్రూనో బిజినెస్ పార్క్, లోహెగావ్, పూణె-411014.

అనుబంధం IV [రూల్ 8(1) చూచుట] స్వాధీనత నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జి ఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ తో విలీనం చేయబడింది)** సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "సదరు చట్టం"గా సూచించబడుతుంది) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, పైన కార్పొరేట్/రిజిస్టర్ కార్యాలయం యొక్క ఇకపై సెక్యూర్ క్రెడిటార్‌గా సూచించబడే ఆధీకృత అధికారి సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీతలను పిలుస్తూ దిగువ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద **అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తిని 18 డిసెంబరు, 2024న దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.**

ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవలెను. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను. స్వాధీనత తీసుకున్న ఆస్తి వివరాలు దిగువన ఇవ్వబడినాయి:

క్ర. సం	రుణగ్రహీతల పేరు	ఆస్తి వివరణ	స్వాధీనం తీసుకున్న తేది	డిమాండ్ నోటీసు చట్టబద్ధత తేది	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
1	నాగమణి నిడిముక్కల, అనిల్ కుమార్ నిడిముక్కల, నిడిముక్కల నాగేంద్ర కుమార్	**షెడ్యూల్–ఏ :** గుంటూరు జిల్లా, పెద్దకాకాని ఉపజిల్లా, గుంటూరు కొత్త మున్సిపల్ పరిధి, అగర్తవరప్పాడు గ్రామం, "సాయి భగవాన్ రెసిడెన్సీ" యొక్క డో.నం.85/ఎ/బి కవర్‌చేయబడిన పరిధి ఎ.లు. 1.40 సెంట్లు, మరియు బయట పరిధి 1113.2 చ.గ.లు. **ఉన్న హద్దులు : తూర్పు :** షేక్ సత్తార్ సాహెబ్ మరియు ఇతరులకు చెందిన సైట్ 80 అ.లు., **దక్షిణం :** గద్దం ముసలరెడ్డి స్థలం 139 అ.లు., **పడమర :** 40 అ.లు. వెడల్పు ఉడా లే అవుట్ రోడ్డు 65 అ.లు., **ఉత్తరం :** షేక్ ఖాసీం మరియు ఇతరుల స్థలం 138.3 అ.లు. ఈ సరిహద్దుల సైట్ కవర్‌చేయబడిన పరిధి 1113.2 చ.గ.లు. లేదా 930.76 చ.మీ.లు. తో పాటు సాధారణ మరియు ఉమ్మడి హక్కులతో పాటు సౌలభ్య హక్కులు, దానిపై ఉపకరణాలు మొదలైనవి. **షెడ్యూల్–బి :** సైట్ యొక్క అవిభక్త, పేర్కొనబడని మరియు విడదీయరాని వాటా కొలిచే పరిధి 52.72 చ.గ.లు. (లేదా) 40.07 చ.మీ.లు., బయట 1113.2 చ.గ.లు. తో పాటు "సాయి భగవాన్ రెసిడెన్సీ" లో నాలుగవ అంతస్తులో ఉన్న ఒక సెమీ ఫినిష్డ్ ఫ్లాట్, బేరింగ్ ఫ్లాట్ నం.సి–5 తో ప్లింత్ ఏరియా 1005 చ.అ.లు. (సాధారణ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో సహా) పైన వివరించబడిన సైట్ వాటా కొరకు కేటాయించబడినది. **ఉన్న హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** కామన్ కారిడార్. పేర్కొన్న "సాయి భగవాన్ రెసిడెన్సీ" యొక్క పై స్టిల్ట్ (పార్కింగ్), గ్రౌండ్, ఒకటవ, రెండవ మరియు మూడవ అంతస్తులు, ఎల్.ఇ. నాలుగవ అంతస్తులో ఉన్న ఒక సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ నం.సి–5 సరిహద్దుల పరిధితో పాటు అన్నీ సాధారణ మరియు ఉమ్మడి హక్కులతో పాటు సౌలభ్య హక్కులు, ఉపకరణాలు మొదలైనవి మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో కేటాయించబడిన ఒక కార్ పార్కింగ్.	18/12/2024	08/10/2024	లోన్ నెం.: **HM0219H17100108, రూ.38,35,690/-** (ముప్పై ఎనిమిది లక్షల ముప్పై ఐదు వేల ఆరు వందల తొంభై రూపాయలు మాత్రమే) **08/10/2024** నాటికి చెల్లించవలసిన మొత్తంతో పాటు రియలైజేషన్ వరకు 13.8 శాతం పి.ఎ. వడ్డీ.
2	సరివిగొప్ప జగ్గులు, సరివిగొప్ప వెంకట సురేష్, సవిరిగపు సరస్వతి	కృష్ణాజిల్లా, కైకలూరు సబ్ రిజిస్ట్రీ, తాడినాడ గ్రామ పంచాయతీ ఏరియా, తాడినాడ గ్రామం, జెడ్–మెరక, ఆర్.ఎస్.నం.572/3 మొత్తం పరిధి మరియు స్థలం కలిగి ఉన్న ఎ.లు. 0.22 సెంట్లు. అందులో స్థలం కలిగి ఉన్న ఎ.లు. 0.05 సెంట్లు = 242 చ.గ.లు. = 202 చ.మీ.లు. **హద్దులు : తూర్పు :** పోలిమెట్ల దుర్గారావుకు చెందిన సైట్, **దక్షిణం :** వెగెస్న సుబ్బలక్ష్మికి చెందిన సైట్, **పడమర :** పంటకాలువ, **ఉత్తరం :** ఉమ్మడి మార్గం.	18/12/2024	08/10/2024	లోన్ నెం.: **HL0385H17100012 రూ.7,30,267/-** (ఏడు లక్షల ముప్పై వేల రెండు వందల అరవై ఏడు రూపాయలు మాత్రమే) **08/10/2024** నాటికి చెల్లించవలసిన మొత్తంతో పాటు రియలైజేషన్ వరకు 15.31 శాతం పి.ఎ. వడ్డీ.
4.	గోపరాజు రోహిణి కుమార్, జిడుగు రేవతి	**ఏ' షెడ్యూల్ :** కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారర్, పటమట సబ్ రిజిస్ట్రారర్, వై.ఎస్.ఆర్.తాడిగడ్ప మున్సిపాలిటీ ఏరియా, తాడిగడప గ్రామం వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.60/2ఎ లో ఉన్న రెసిడెన్షియల్ సైట్ అవిభక్త మరియు పేర్కొనబడని వాటా పరిధి 21.895 చ.గ.లు. లేదా 18.31 చ.మీ.లు. మొత్తం పరిధి 138.77 చ.గ.లు. తో కలిపి ఆర్‌సిసి రూఫ్డ్ స్టిల్ట్, గ్రౌండ్, 1వ మరియు 2వ అంతస్తుల రెసిడెన్షియల్ భవనం అందులో అన్నీ సౌలభ్య హక్కులు. ఉన్న **హద్దులు : తూర్పు :** 21 అ.లు. వెడల్పు రోడ్డు, **దక్షిణం :** మంచినేని నాగమణి ఆస్తి, **పడమర :** మేడసాని పూర్ణచంద్రారావు ఆస్తి, **ఉత్తరం :** కరిమికొండ ప్రసాద్ ఆస్తి. **'బి' షెడ్యూల్ :** 'ఎ' షెడ్యూల్ ఆస్తిలో నిర్మించబడిన "కె.ఎస్.ఆర్. ప్యాలెస్" లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నం. జిఎఫ్2 తో 550 చ.అ.లు. ప్లింత్ ఏరియా, 100 చ.అ.లు. కామన్ ఏరియా మరియు 50 చ.అ.లు. పార్కింగ్ ఏరియా తో అన్నీ సౌలభ్య హక్కులు మరియు దాని అనుబంధమైన ఫిక్చర్లు. **ఉన్న హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** మెట్లు, లిఫ్ట్ మరియు కామన్ కారిడార్, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.	18/12/2024	08/10/2024	లోన్ నెం.: **HL00053100000005007578, రూ.14,46,957/-** (పద్నాలుగు లక్షల నలభై ఆరు వేల తొమ్మిది వందల యాభై ఏడు రూపాయలు మాత్రమే) **08/10/2024** నాటికి చెల్లించవలసిన మొత్తంతో పాటు రియలైజేషన్ వరకు 12 శాతం పి.ఎ. వడ్డీ.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్, తేది : 23.12.2024
సం/- అధీకృత అధికారి, గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనవాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)

గణతంత్ర వేడుకల్లో ఢిల్లీ శకటానికి నో ఛాన్స్

- ఆమోదించని నిపుణుల కమిటీ

న్యూఢిల్లీ : రిపబ్లిక్ డే-2025 వేడుకల్లో ప్రదర్శించటం కోసం ఢిల్లీ ప్రభుత్వం ప్రతిపాదించిన శకటాన్ని నిపుణుల కమిటీ ఆమోదించలేదు. దీంతో ఈ సారి రిపబ్లిక్ వేడుకల్లో ఢిల్లీ శకటం కనబడే అవకాశాలు లేవు. ఇక మిజోరాం, సిక్కింలు ఈ సారి వేడుకల్లో పాల్గొనలేమని చెప్పాయి. వచ్చే ఏడాది జనవరి 26న జరగనున్న గణతంత్ర్య వేడుకలకు రోస్టర్‌లో మొదట ఎంపిక చేసిన 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)ల నిపుణుల కమిటీ సమావేశానికి లక్షద్వీప్‌తో పాటు అండమాన్ నికోబార్ దీవుల అధికారులు రాలేదని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. 'నిపుణుల కమిటీ థీమ్, కాన్సెప్ట్, డిజైన్‌లు, విజువల్ ఎలిమెంట్స్‌లోని పలు అంశాలను పరిశీలిస్తుంది. రోస్టర్‌లోని 15 రాష్ట్రాలు, యూటీలలో, నిపుణుల కమిటీ ఢిల్లీ శకటం ప్రతిపాదనను ఆమోదించలేదు" అని వివరించాయి. కాగా, గత రెండు దశాబ్దాల్లో ఢిల్లీ ఏడు సార్లు తన శకటాన్ని ప్రదర్శించింది. దీంతో ఢిల్లీకి శకటం ఎంపికలో వివక్ష చూపుతున్నారనే వాదనలూ ఇప్పటికే ఉన్నాయి. రిపబ్లిక్‌డే-2024 వేడుకలకు ముందు ఢిల్లీ, పంజాబ్, కర్నాటక రాష్ట్రాలు ఇవే ఆరోపణలు చేశాయి. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష కొనసాగుతున్నదనీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలు మాత్రం వరుసగా ఎంపికవుతున్నాయనే వాదనలూ ఉన్నాయి.

రాహుల్‌కి యుపి కోర్టు సమన్లు

లక్నో : కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్‌లోని ఒక కోర్టు సమన్లు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కులగణనపై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బరేలీ జిల్లా కోర్టు ఈ సమన్లు జారీ చేసింది. 2025 జనవరి 7న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.

'ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ కులగణనపై చేసిన వ్యాఖ్యలు దేశంలో అంతర్యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయి. అందుకే ఆ వ్యాఖ్యలపై తొలుత ఎం-ఎమ్మెల్యే కోర్టులో కేసు దాఖలు చేశాం. అక్కడ కేసును కొట్టివేశారు. దీంతో బరేలీ జిల్లా కోర్టును ఆశ్రయించాం. ఈ క్రమంలోనే కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 7న హాజరుకావాలని కోర్టు అందులో పేర్కొంది' అని పిటిషనర్ తెలిపారు.

బాల్య వివాహాల ముసుగులో మైనార్టీలపై కేసులు

- తాజాగా మరో416మంది అరెస్టు

గౌహతి : బాల్య వివహాల కేసులపై ఎన్ని విమర్శలు వస్తున్నా అస్సాంలోని బిజెపి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. తాజాగా మూడో విడత కేసుల్లో 416 మందిని అరెస్టు చేసింది. ఈ కేసుల అరెస్టులో భాగంగా శనివారం అర్ధరాత్రి వేళ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 416 మందిని అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి ఈ అరెస్టులు చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. మూడో విడతలో భాగంగా ఈ నెల 21 రాత్రి నుంచి 22వరకు మొత్తంగా 335 కేసులు నమోదు చేసిన పోలీసులు 416మందిని అరెస్టు చేసినట్లు స్వయంగా ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ప్రకటించారు. బాల్య వివాహం చేసుకున్నా.. అందుకు సహకరించినా కేసులు నమోదు చేసినా అస్సాం ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. ఈ వివాహాలు ఎన్ని ఏళ్ల క్రితం జరిగినా కూడా కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తోంది. ఫిర్యాదులు లేకపోయినా కూడా చర్యలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకునే ఈ కేసులు నమోదవుతున్నాయని విమర్శలు వస్తున్నా అస్సాం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మొదటి విడతలో 4,515 కేసుల్లో 3,483మందిని అరెస్టు చేయగా.. రెండో దశలో 710 కేసుల్లో 915మందిని అరెస్టు చేశారు. తాజాగా మరో 335 కేసులు బనాయించి, 416మందిని అరెస్టు చేయడం గమనార్హం.

ఎన్‌డిఎలో చేరే ప్రసక్తే లేదు..: ఎన్‌సి

శ్రీనగర్: బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో చేరే ప్రసక్తే లేదని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సి) తేల్చి చెప్పింది. ఇటీవలి జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌సి విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే నేషనల్ కాన్ఫరెన్స్ ఎన్‌డిఎ కూటమిలో చేరనుందని ఓ మీడియాలో కథనం వెలువడింది. దీన్ని పార్టీ కొట్టిపారేసింది. నిరాధారమైనదిగా పేర్కొంది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో చేసిన ఈ వాదనలు పచ్చి అబద్ధమని స్పష్టం చేసింది."ఇటువంటి నిరాధార వదంతులను వ్యాప్తి చేయడం బాధ్యతారాహిత్యం. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కలిసినట్లు చెబుతున్న బిజెపి నాయకుల పేర్లను బహిర్గతం చేయాలి. లేకపోతే.. బహిరంగ క్షమాపణ చెప్పి, ఆ కల్పిత కథనాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవు" అని 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. కాగా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా భేటీ అయ్యారు. ఈ సమావేశం గురించి మీడియా సహ అందరికీ తెలిసిందేనని సాదిక్ అన్నారు. ఈ భేటీపై ఇతరత్రా వాదనలు చేస్తే మాత్రం.. వాటిని రుజువు చేయాల్సి ఉంటుందని సవాల్ విసిరారు.

భారత వృద్ధి 6.5 శాతం

- కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనా

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనా వేసింది. వచ్చే 2025-26లో 6.7 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొంది. ప్రపంచ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్‌లో సుస్థిర వృద్ధి కొనసాగనుందని తన 2025కి సంబంధించి సెక్టార్ ఔట్‌లుక్-2025లో విశ్లేషించింది. "అంతర్జాతీయ అనిశ్చిత వాతావరణం మధ్య ప్రయివేటు మూలధన వ్యయంలో ఊహించిన స్థాయిలో కార్యరూపం దాల్చనందున దీర్ఘకాలిక పెట్టుబడుల్లో సంకోచం ఉంటుంది. అయినప్పటికీ ద్రవ్య విధాన సడలింపు మద్దతుతో 2025లో ప్రైవేట్ పెట్టుబడిలో మెరుగుదలని ఉండొచ్చు." అని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సచిన్ గుప్తా పేర్కొన్నారు.

వాట్సాప్‌పై దాడులు ఇజ్రాయిల్ పనే

- అమెరికా న్యాయస్థానం నిర్ధారణ
- పెగాసస్ స్పైవేర్‌ను విక్రయించింది ఆ సంస్థే

వాషింగ్టన్ : వాట్సాప్‌పై దాడులకు పాల్పడింది పెగాసస్ స్పైవేర్‌ను విక్రయించిన ఇజ్రాయిల్ ఎన్ఎస్ఓ గ్రూపేనని అమెరికా జిల్లా కోర్టు నిర్ధారించింది. 2019లో వాట్సాప్ యాప్ వేసిన దావాను పురస్కరించుకొని న్యాయస్థానం ఈ మేరకు తీర్పు చెప్పింది. యాప్‌కు చెందిన 1,400 పరికరాలలో (డివైస్‌లు) ఉల్లంఘనలు జరిగాయని వాట్సాప్ ఫిర్యాదు చేసింది. అమెరికా కంప్యూటర్ ఫ్రాడ్ అండ్ అబ్యూస్ యాక్ట్ (సీఎఫ్ఏఏ)ను, వాట్సాప్‌కు చెందిన సొంత సర్వీసు నిబంధనలను ఎన్ఎస్ఓ ఉల్లంఘించిందని న్యాయమూర్తి ఫిలిస్ హామిల్టన్ తేల్చారు.

న్యాయమూర్తి ఏమన్నారు?

'తన క్లయింట్లు వాట్సాప్ అప్లికేషన్ ఆధునిక వెర్షన్‌ను ఉపయోగించుకునేందుకు ఎన్ఎస్ఓకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు (పెగాసస్) అనుమతించాయి. ఈ ఆధునిక వెర్షన్‌ను వాట్సాప్ ఇన్‌స్టలేషన్ సర్వర్ లేదా డబ్ల్యుఐఎస్ అని పిలుస్తారు. ఎన్ఎస్ఓ క్లయింట్లు సిఫర్ ఫైల్స్‌ను పంపేందుకు ఈ సర్వర్ ఉపకరిస్తుంది. సిఫర్ ఫైల్స్ సాయంతో క్లయింట్లు తాము ఎంచుకున్న వినియోగదారులపై నిఘా పెట్టవచ్చు. ఇది సీఎఫ్ఏఏను, కాంట్రాక్ట్‌ను ఎన్ఎస్ఓ ఉల్లంఘించడమే అవుతుందని వాట్సాప్ ఫిర్యాదు చేసింది' అని న్యాయమూర్తి వివరించారు. కోర్టు ఆదేశాలను పాటించడంలో ఎన్ఎస్ఓ విఫలమైందని కూడా ఆయన తెలిపారు. పెగాసస్ సోర్స్ కోడ్ కేవలం ఇజ్రాయిల్‌లో నివసిస్తున్న ఆ దేశ పౌరులకు మాత్రమే అందుబాటులో ఉంటుందంటూ ఎన్ఎస్ఓ చేసిన వాదన ఆచరణ సాధ్యం కాదని న్యాయస్థానం అభిప్రాయపడింది.

గోప్యతకు లభించిన భారీ విజయం : వాట్సాప్

కోర్టు తీర్పుపై వాట్సాప్ అధినేత విల్ కాథ్‌కార్ట్ హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు గోప్యతకు లభించిన భారీ విజయమని ఆయన అభివర్ణించారు. 'మా వాదనలు వినిపించేందుకు ఐదు సంవత్సరాల సమయం తీసుకున్నాము. ఎందుకంటే స్పైవేర్ కంపెనీలు తమ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నుండి ఎలాంటి రక్షణ పొందలేరు. వాటికి జవాబుదారీతనం ఉండదు. అక్రమ గూఢచర్యాన్ని సహించరాదన్న వాస్తవాన్ని నిఘా కంపెనీలు గుర్తుంచుకోవాలి. ప్రజల ప్రైవేటు సంభాషణలకు రక్షణ కల్పించే విషయంలో వాట్సాప్ ఎప్పుడూ వెనకడుగు వేయదు' అని ఆయన తెలిపారు. కాగా ఈ వ్యవహారంలో జరిగిన నష్టానికి సంబంధించిన కేసు విచారణ వచ్చే సంవత్సరం ప్రారంభమవుతుందని న్యాయమూర్తి చెప్పారు.

పెగాసస్‌పై దేశంలో దుమారం

మన దేశంలో పెగాసస్ వినియోగంపై 'ది వైర్' పోర్టల్ సహా పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఎన్ఎస్ఓ గ్రూప్ తన స్పైవేర్‌ను కొన్ని ప్రభుత్వాలకు మాత్రమే అందజేసిందని వార్తా సంస్థల అంతర్జాతీయ కన్సార్టియం తెలిపింది. దేశ భద్రతకు సంబంధించిన కేసులు, నేరాలపై పరిశోధనలు జరుపుతున్న క్లయింట్లు మాత్రమే పెగాసస్‌ను ఉపయోగిస్తున్నారని, కాబట్టి తమను బాధ్యులను చేయరాదని ఎన్ఎస్ఓ కంపెనీ అమెరికా కోర్టులో విచారణ సందర్భంగా వాదించింది. అయితే ఈ వాదనను జడ్జి తోసిపుచ్చారు. 2021లో మీడియా సంస్థలు పరిశోధనలు జరిపినప్పుడు తన వినియోగదారుల జాబితాను బయటపెట్టేందుకు ఎన్ఎస్ఓ నిరాకరించింది. అయితే పెగాసస్ స్పైవేర్ సాయంతో ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులు, న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న విషయం విదితమే. మీడియా సంస్థలు బయటపెట్టిన అంశాలపై విచారణ జరపాలని 2021లో సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై ఏర్పడిన సాంకేతిక కమిటీ ఐదు ఫోన్లలో మాల్‌వేర్‌ను గుర్తించింది. అయితే అది పెగాసస్ అవునా కాదా అనేది చెప్పలేదు. పెగాసస్ స్పైవేర్‌ను కొనుగోలు చేసి దానిని వినియోగించానా లేదా అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ధృవీకరించలేదు. అలాగే తోసిపుచ్చనూ లేదు.

ఇసి సమగ్రతను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్ర

- కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్పులు చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. ఎన్నికల సంఘం సమగ్రతను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రలో ఇదొక భాగమని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. ఎన్నికల సంఘం సిఫారసు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని 93(2)(ఏ) నిబంధనను కేంద్ర న్యాయశాఖ ఇటీవల సవరించింది. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనలో మార్పులు చేయడం ఒక క్రమ పద్ధతిలో ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పన్నిన కుట్రలో భాగమని విమర్శించారు. ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేసేందుకు గతంలో ఎన్నికల కమిషనర్లను నియమించే ప్యానెల్ నుంచి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కేంద్రం తొలగించిందని, ఇప్పుడు హైకోర్టు ఆదేశాల తరువాత కూడా ఎన్నికల సమాచారానికి అడ్డుగోడ కట్టారని విమర్శించారు. ఓటర్ల పేర్ల తొలగింపు, ఇవిఎంలలో పారదర్శకత లోపించడం వంటి అక్రమాలపై కాంగ్రెస్ పలుసార్లు ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం స్పందించలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం లేదని మళ్లీ రుజువు చేస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ కుట్రలు బయటకు రాకుండా పోలింగ్ సిసిటివి ఫుటేజ్‌ను, అభ్యర్థుల వీడియో రికార్డులను తొలగించకుండా నిషేధం విధించారని అన్నారు. ఎన్నికల కమిషన్‌ను సమగ్రతను మోడీ ప్రభుత్వం క్రమంగా దెబ్బతీయడం రాజ్యాంగం, ప్రజస్వామ్యంపై మోడీ ప్రభుత్వం దాడికి పాల్పడుతోందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. ఈ దాడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని ఖర్గే స్పష్టం చేశారు.

ఐరాస కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకుర్



న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి ఇంటర్నల్ జస్టిస్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకుర్ నియమితులయ్యారు. ఈ నియామకం వెంటనే అమలులోకి వచ్చింది. 2028 నవంబర్ 12వ తేదీ వరకూ జస్టిస్ లోకుర్ పదవిలో కొనసాగుతారు. న్యాయ వ్యవస్థలో లోకుర్ అనుభవాన్ని, నైపుణ్యాన్ని గుర్తించిన ఐరాస ప్రధాన కార్యదర్శి అంటోనియో గుట్టెరెస్ ఆయనను ఈ పదవిలో నియమించారు. ఐరాస కౌన్సిల్‌లో ప్రపంచ దేశాలకు చెందిన న్యాయ నిపుణులు సభ్యులుగా ఉంటారు. వీరిలో ఉరుగ్వేకు చెందిన కార్మెన్ ఆర్టిగస్, ఆస్ట్రేలియాకు చెందిన రోసాలీ బాల్కిన్, ఆస్ట్రియాకు చెందిన స్టీఫన్ బ్రెజీనా, అమెరికాకు చెందిన జే పోజెనెల్ వంటి న్యాయ కోవిదులు ఉన్నారు.

1953లో జన్మించిన లోకుర్ 2012 జూన్ 4వ తేదీ నుంచి 2018 డిసెంబర్ 30న పదవీవిరమణ చేసే వరకూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. 2019లో ఫిజి సుప్రీంకోర్టు నాన్-రెసిడెంట్ ప్యానల్ జడ్జిగా నియమితులు కావడం గమనార్హం. విదేశానికి చెందిన అత్యున్నత న్యాయస్థానంలో పదవిని పొందిన తొలి భారతీయ న్యాయమూర్తి జస్టిస్ లోకుర్. ఐరాస న్యాయ వ్యవస్థ పాలనలో స్వతంత్రత, వృత్తి నిపుణత, జవాబుదారీతనం ఉండేలా చూడడంలో ఇంటర్నల్ జస్టిస్ కౌన్సిల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఐరాసలో నిష్పాక్షికత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కౌన్సిల్ చేస్తున్న ప్రయత్నాలను చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకుర్ పర్యవేక్షిస్తారు.

తైవాన్‌కు సైనిక సాయం ఆపండి

అమెరికాను హెచ్చరించిన చైనా

దక్షిణ చైనా సముద్రంలో మోహరించిన అమెరికా యుద్ధ నౌకలు

బీజింగ్ : తైవాన్ జలసంధిలో శాంతి, సుస్థిరతలను దెబ్బతీసే అమెరికా యత్నాలను చైనా తీవ్రంగా ఖండించింది. తైవాన్‌కు సైనిక సాయం, ఆయుధాల అమ్మకాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది.

శనివారం తైవాన్‌కు 571.3 మిలియన్ డాలర్ల విలువైన సైనిక సహాయాన్ని వైట్‌హౌస్ ప్రకటించడంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆదివారం నాడిక్కడ ఒక ప్రకటన చేస్తూ, అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖ 295 మిలియన్ల విలువైన ఆయుధాలను తైవాన్‌కు అమ్మేందుకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం 'తైవాన్ స్వాతంత్ర్యానికి మద్దతు ఇవ్వబోమన్న అమెరికన్ నేతలు గతంలో ఇచ్చిన హామీని ఉల్లంఘించడమేనని" చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి చెప్పారు. అమెరికా తీసుకున్న ఈ చర్య 'తైవాన్ స్వాతంత్ర్య' వేర్పాటువాద శక్తులకు తప్పుడు సంకేతాన్ని పంపుతుందని అన్నారు.

చైనాకు చెందిన తైవాన్ ప్రాంతానికి మిలిటరీ సాయం, ఆయుధాల సరఫరాలకు ఆమోదం తెలపడం ద్వారా, ఒక చైనా సూత్రాన్ని, మూడు చైనా-అమెరికా సంయుక్త ప్రకటనలను , ముఖ్యంగా 1982 ఆగస్టు 17 ప్రకటనను, చైనా సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను తీవ్రంగా ఉల్లంఘించిందని ప్రతినిధి విమర్శించారు. .

తైవాన్‌ను ఆయుధాలు ఇవ్వడం, తైవాన్ వేర్పాటువాదాన్ని ఎగదోయడం వంటి అమెరికా చర్యలు నిప్పుతో చెలగాటమాడడమేనని పేర్కొన్నారు. తైవాన్ అంశం చైనా కీలక ప్రయోజనాలకు సంబంధించిన అంశంగానే గాక, చైనా- అమెరికా సంబంధాలలో దాటకూడని మొదటి రెడ్ లైన్ కూడా అని నొక్కి చెప్పారు.

చైనాకు చెక్ పెట్టేందుకు తైవాన్‌ను పావుగా వాడుకోజూసే ఎలాంటి యత్నమైనా బెడిసికొట్టక తప్పదు అని ప్రతినిధి చెప్పారు. చైనా తన జాతీయ సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశిక సమగ్రతను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుందని ప్రతినిధి చెప్పారు.

ఇదిలావుండగా తైవాన్ వ్యవహారాలను చూసే చైనా విదేశాంగశాఖ విభాగం ప్రతినిధి జు ఫెంగ్లిన్ మాట్లాడుతూ, "తైవాన్ స్వాతంత్ర్యం" వేర్పాటువాద కార్యకలాపాలు, విదేశీ జోక్యం తైవాన్ జలసంధిలో శాంతికి పెద్ద ముప్పు అని పేర్కొన్నారు.

తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేయడాన్ని అమెరికా వెంటనే ఆపాలని, తైవాన్ అంశంపై అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చైనా కోరుకుంటోందని అన్నారు. అమెరికా మిలిటరీ బలగాలపై ఆధారపడి 'తైవాన్ స్వాతంత్ర్యం' సాధించాలనుకుంటున్న డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ అథారిటీకి కూడా ఇదే హెచ్చరిక చేస్తున్నామన్నారు.

ఈ నెల ప్రారంభంలో, తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేయాలన్న నిర్ణయానికి ప్రతిగా 13 అమెరికన్ మిలిటరీ కంపెనీలపైనా, అలాగే ఆరుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపైన చైనా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి

(మొదటిపేజీ తరువాయి)

మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ ఆయన ఇంటి వద్దకు ఉస్మానియా విశ్వవిద్యాలయ జెఎసి నాయకులు కొందరు చేరుకున్నారు. ఆమె కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్ సర్కార్‌పై అల్లు అర్జున్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆయన ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో, బౌన్సర్లు వారిపై దాడి చేశారు. ఆగ్రహించిన విద్యార్థులు అక్కడే ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారు. సంఘటన జరిగిన సమయంలో అల్లు అర్జున్ ఇంట్లో లేరు. పోలీసులు అక్కడికి చేరుకొని పలువురిని అరెస్టు చేశారు. అక్కడ అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ దాడి ఘటనపై అల్లు అరవింద్ స్పందించారు. అందరూ సంయమనం పాటించాలని కోరారు. పోలీసులు ఆందోళనకారులను తీసుకెళ్లి కేసు పెట్టారని, ఎవరైనా గొడవకు వస్తే అదుపులోకి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎలాంటి తొందరపాటు చర్యలకూ దిగొద్దని కోరారు.

దాడి సరికాదు : ముఖ్యమంత్రి

అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేయడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ తరహా దాడులను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. శాంతిభద్రల విషయంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర డిజిపిని, నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.

సంధ్య థియేటర్ ఘటనపై న్యాయ సలహా తీసుకుని ముందుకెళ్తాం - మరోసారి ఓవర్ యాక్షన్ చేస్తే బౌన్సర్లు తాట తీస్తాం : సిపి ఆనంద్

సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సిపి సివి ఆనంద్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ వార్షిక నేర నివేదికపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఘటనకు సంబంధించిన సిసి ఫుటేజ్‌ను విడుదల చేశారు. అల్లు అర్జున్ వచ్చిన సమయంలో బౌన్సర్లు ప్రేక్షకులతోపాటు పోలీసులనూ నెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. బౌన్సర్లు ఇకపై పోలీసులను ముట్టుకున్నా, మిస్ బిహేవ్ చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దీనిపై పూర్తి బాధ్యత సప్లయ్ ఏజెన్సీలదేనన్నారు. విఐపిలు, వివిఐపిలతో ప్రముఖులతో వచ్చే బౌన్సర్లు అతిగా ప్రవర్తిస్తే విఐపిలు, వివిఐపిలే బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. బౌన్సర్లపై, ఏజెన్సీలపై కేసులు నమోదు చేస్తామని, మరోసారి ఓవర్ యాక్షన్ చేస్తే తాటతీస్తానని హెచ్చరించారు.

సినిమా చూశాకే వెళ్తానని అల్లు అర్జున్ అన్నారు : చిక్కడపల్లి ఎసిపి

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై అల్లు అర్జున్‌కు చెప్పినా సినిమా చూసిన తర్వాతే వెళ్తానని ఆయన చెప్పారని చిక్కడపల్లి ఎసిపి రమేశ్ కుమార్ తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆ రోజు జరిగిన విషయాలను వివరించారు. డిసిపి, తాము సినిమా థియేటర్‌లోకి వెళ్లి పది నిమిషాలు సమయం ఇచ్చామని, ఆ తర్వాత అల్లు అర్జున్‌ను బయటకు తీసుకొచ్చామని చెప్పారు. ముందే ఆయనను ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించామని, అయినా మేనేజర్ తమను అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదని తెలిపారు. అక్కడి నుంచి అల్లు అర్జున్ వెళ్లకపోతే పరిస్థితి చేయి దాటిపోతుందని చెప్పామని, అయినా కూడా ఆయన స్పందించలేదని అన్నారు. దీంతో, అతి కష్టమ్మీద థియేటర్‌లోకి వెళ్లి జరిగిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పామని, మీకు అధికారులంతా సహకరించి రూట్ క్లియర్ చేశారని, దయచేసి ఇక్కడి నుంచి ఖాళీ చేయండి అని చెప్పామని, అయినా అల్లు అర్జున్ తొలుత వినలేదని వివరించారు.

బ్రెగ్జిట్‌కు రెండేళ్లు

- బ్రిటన్ భారీ మూల్యం

లండన్: లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ సెంటర్ పరిశోధకుల వివరణాత్మక విశ్లేషణ ప్రకారం, యూరోపియన్ యూనియన్‌కు చెందిన సింగిల్ మార్కెట్, కస్టమ్స్ యూనియన్ నుండి వైదొలగాలని బ్రిటన్ తీసుకున్న నిర్ణయం వల్ల మొదటి రెండేళ్లలో దేశం 2, 700 కోట్ల పౌండ్ల (34.1 బిలియన్ డాలర్లు) నష్టపోయింది. ఇయు ట్రేడింగ్ బ్లాక్ నుంచి బ్రిటన్ నిష్క్రమించడం వల్ల చెల్లించుకున్న మూల్యం ఎక్కువగా ఉన్నప్పటికీ, కొంతమంది భవిష్య సూచకులు పేర్కొన్నంత ఎక్కువగా లేదని ఆ అధ్యయనం తెలిపింది. ఇయు, బ్రిటన్ మధ్య వాణిజ్య అడ్డంకులను తిరిగి ప్రవేశపెట్టడంతో చిన్న వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. వందలాది బ్రిటన్ కంపెనీలు ఇయుతో వ్యాపారాన్ని నిలిపివేయడంతో పెద్ద సంస్థలే ఎక్కువగా లబ్ధి పొందాయని తెలిపింది. లక్షకు పైగా కంపెనీలకు సంబంధించి బ్రిటన్ కస్టమ్స్ ఏజెన్సీ సేకరించిన సమాచారాన్ని పరిశీలించిన తర్వాత పరిశోధకులు ఈ నిర్ధారణలకు వచ్చారు.

నాడు అలా.. నేడు ఇలా..!

- అప్పుడు విధ్వంసక ఆందోళనకారుడు
- ఇప్పుడు బాధితుడిగా పోజు
- ఇదీ.. ఒడిశా బిజెపి ఎంపి ప్రతాప్‌చంద్ర సారంగి నేపథ్యం

న్యూఢిల్లీ : పార్లమెంటు ప్రధాన ద్వారం (మకర ద్వారం) వద్ద ఇటీవల జరిగిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ ఘటనలో తమ ఎంపిలు ఇద్దరు గాయపడ్డారని బిజెపి ఆరోపిస్తుంది. ఏకంగా రాహుల్ గాంధీపై కేసు కూడా నమోదు చేశారు. కాగా, గాయపడ్డ ఇద్దరు ఎంపిల్లో కేంద్ర మాజీ మంత్రి ప్రతాప్‌చంద్ర సారంగి ఒకరు. మోడీ-2లో పాలనలో కేంద్ర మంత్రి వర్గంలో స్థానం పొందినపుడు ఒడిశా మోడీగా పిలవబడిన ఈయన తీరు పార్లమెంటు ఘటనతో చర్చనీయాంశంగా మారింది. రెండు దశాబ్దాల క్రితం ఆయన తన స్వంత రాష్ట్రం ఒడిశా అసెంబ్లీలో పాల్గొన్న హింసాత్మక ఆందోళనను, ఇప్పటి పార్లమెంటు ఘర్షణను కొందరు విశ్లేషకులు పోల్చి చూస్తున్నారు. ఆ సమయంలో ఒక విధ్వంసక ఆందోళనలో భాగమైన ఆయన.. నేడు పార్లమెంటు ప్రాంగణంలో బాధితుడిగా పోజు పెట్టిన తీరును వారు విశ్లేషిస్తున్నారు.

ఒడిశాలోని బాలాసోర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఎంపీ.. 2002 మార్చిలో రామజన్మభూమి అంశంలో భువనేశ్వర్‌లో జరిగిన ఒక హింసాత్మక నిరసనలో పాల్గొన్నారు. ఒడిశా అసెంబ్లీలోకి దూసుకెళ్లి, ఆస్తులను ధ్వంసం చేసి, అప్పటి సీఎం నవీన్ పట్నాయక్‌తో పాటు మంత్రుల ఛాంబర్లను ధ్వంసం చేశారు. భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. ఇందులో ప్రతాప్‌చంద్ర సారంగి కూడా ఉన్నారు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ బిజెడితో బిజెపీ.. అధికార కూటమిలో భాగంగా ఉన్న సమయంలోనే జరగటం గమనార్హం. ప్రస్తుతం ఈయన పార్లమెంటు ప్రాంగణంలో జరిగిన ఎంపీల ఘర్షణలో గాయపడటంతో ప్రధానంగా కనిపించారు. తలకు తగిలిన గాయంతో, దానికి రుమాలును అడ్డుపెట్టుకుంటూ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఆరోపణలు చేశారు. రాహుల్ ఒక ఎంపీని తోయటంతో, ఆయన తనపై పడ్డాడనీ, దీనితో గాయమైందని ప్రతాప్‌చంద్ర సారంగి అన్నారు. వీటికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు మీడియాలో ప్రచారమయ్యాయి. ఒకప్పుడు, రాష్ట్ర అసెంబ్లీలో హింసాత్మక ఆందోళనలో భాగమైన ఆయన.. ఇప్పుడు పార్లమెంటులో బాధితుడిగా మారి ఆరోపణలు చేస్తున్న తీరు పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. బజరంగ్‌దళ్, ఆరెస్సెస్ వంటి హిందుత్వ సంస్థలలో పని చేసిన ఆయన ఇటువంటి టక్కు టమార విద్యల్లో బాగా ఆరితేరిన వాడేనని పలువురు పేర్కొంటున్నారు.

కువైట్ చక్రవర్తితో మోడీ చర్చలు

కువైట్ సిటీ :కువైట్ చక్రవర్తి షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జబెర్ అల్-సబాహ్‌తో ప్రధానమంత్రి మోడీ ఆదివారం విస్తృతంగా చర్చలు నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఫిన్‌టెక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రక్షణ రంగాల్లో ఈ చర్చలు సాగాయి. ఈ విషయాన్ని మోడీ ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించారు. చర్చలు అద్భుతమని వర్ణించారు. 'ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు అనుగుణంగా, మా భాగస్వామ్యాన్ని వ్యూహాత్మకంగా పెంచాం. అలాగే రాబోయే కాలంలో మా స్నేహం మరింత అభివృద్ధి చెందుతుందని నేను ఆశాభావంతో ఉన్నాను' అని కూడా మోడీ ఎక్స్ పోస్టులో తెలిపారు. అలాగే, మోడీ, చక్రవర్తి మధ్య చర్చలు ఇరు దేశాల సంబంధాలను 'నూతన శిఖరాలకు' తీసుకుళ్లే మార్గాలను అన్వేషించడంపై దృష్టి సారించాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

కువైట్ ప్రధానమంత్రి క్రౌన్ ప్రిన్స్ షేక్ సబా అల్ ఖలీద్ అల్ సబాతో కూడా మోడీ సమావేశమయ్యారు. రెండు రోజుల పర్యటన కోసం శనివారం కువైట్‌కు మోడీ చేరుకున్నారు. 43 ఏళ్ల తరువాత కువైట్‌లో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. 1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చివరిగా కువైట్‌లో పర్యటించారు. భారతదేశపు ప్రముఖ వాణిజ్య భాస్వాముల్లో కువైట్ ఒకటి. 2023-24లో ఇరు దేశాల మధ్య 10.47 బిలియన్ డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. అలాగే కువైట్ భారత్ యొక్క ఆరో అతిపెద్ద ముడి చమురు సరఫరాదారు, దేశపు ఇంధన అవసరాల్లో మూడు శాతాన్ని కువైట్ తీరుస్తుంది.

ప్రైవేటు మార్కెట్ యార్డులు

(మొదటిపేజీ తరువాయి)

నెట్‌వర్క్, నియంత్రణ లేవు. అందుకని ప్రైవేటు మార్కెట్ యార్డులను, ప్రైవేటు మార్కెట్‌లను నెలకొల్పాలి. కొన్ని చోట్ల ఇ-నామ్ ఉంది. దాన్ని మరింతగా అభివృద్ధి పరచాలి. డిజిటలైజేషన్‌ను తీసుకు రావాలి. కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయ మార్కెటింగ్ అంటే కేవలం వాణిజ్య లావాదేవీ మాత్రమే కాదు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయంగా వ్యవసాయ విలువ గొలుసులోకి రైతులను చేర్చాలి. తద్వారా రైతుల ఆదాయాలు పెరుగుతాయని పేర్కొంది.

వాజపేయి హయాంలోనే అంకురార్పణ

స్టేట్ అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ (డెవలప్‌మెంట్, రెగ్యులేషన్) యాక్ట్-2003 వాజపేయి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో తయారైంది. మోడీ వచ్చాక 2017లో మోడల్ చట్టం పేరిట బయటికి వచ్చింది. ఇప్పటికే రాష్ట్రాల్లో దీనిపై సమీక్షలు జరుగుతున్నాయి. ఎపిఎంసి చట్టంలో, విధానాల్లో, నిబంధనల్లో 12 సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తన పాలసీ ఫ్రేమ్ వర్క్‌లో రాష్ట్రాలకు సూచించింది. ఆ మార్పులను నోటిఫై చేయాలని కోరింది. కాగా ఇప్పటికే ప్రభుత్వాలు రెండు మినహా తతిమ్మా వాటన్నింటినీ నోటిఫై చేశాయని ఫ్రేమ్ వర్క్‌లో ఉంది.

పన్నెండు సవరణలు

1) హోల్‌సేల్ మార్కెట్లలోకి నేరుగా ప్రాసెసర్లు, ఎగుమతిదారులు, వ్యవస్థీకృత రిటైలర్లకు అనుమతి 2) గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలను మార్కెట్ యార్డులుగా ప్రకటించాలి 3) ప్రైవేటు ఇ-ట్రేడింగ్ ప్లాట్‌ఫారాల స్థాపన, నిర్వహణ 4) రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ మార్కెట్ ఫీజు 5) రాష్ట్ర వ్యాప్తంగా చెల్లుబాటయ్యేలా ఏకీకృత వాణిజ్య లైసెన్స్ 6) మార్కెట్ రుసుం హేతుబద్ధీకరణ 7) కమీషన్ ఛార్జీల హేతుబద్ధీకరణ 8) ఇతర రాష్ట్రాల వ్యాపారుల లైసెన్స్‌ల గుర్తింపు 9) మార్కెట్ యార్డుల వెలుపల పండ్ల వంటి (త్వరగా పాడైపోయేవి) మార్కెట్లపై నియంత్రణ తొలగింపు 10) ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాక్టరీలలో రైతులు నేరుగా తమ ఉత్పత్తులు విక్రయిస్తే మార్కెట్ ఫీజు మినహాయింపు 11) ప్రాసెసింగ్ కోసం ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన ఉత్పత్తులపై మార్కెట్ ఫీజు మినహాయింపు 12) పరస్పర ట్రేడింగ్ లైసెన్స్.

మన్యంలో నేటికీ డోలీ మోతలు

(మొదటిపేజీ తరువాయి)

నేటికి ఖాళీగా ఉందన్నారు. పరిశ్రమలు రాకుంటే ఆ భూమిని తిరిగి రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అన్నవరం వద్ద మూడు పంటలు పండే భూములను విమానాశ్రయం కోసం తీసుకునే ప్రయత్నం మానుకోవాలన్నారు. టోల్ గేట్ల వద్ద గతంలో 24 గంటలకు ఒకసారి రుసుము ఉండేదని తెలిపారు. కానీ, ఇప్పుడు పోయి, వచ్చినప్పుడల్లా టోల్ ఛార్జీలు వసూలు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, పెద్దాపురం మండల కన్వీనర్ డి.క్రాంతికుమార్, మండల నాయకులు నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

పొలిట్‌బ్యూరో పేర్కొంది. గతంలో సిపిఎం అనుభవం మరీ ముఖ్యంగా త్రిపురలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ పార్టీ చేసిన ఆరోపణల కారణంగా పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రాఫిక్ రికార్డులను పరిశీలించి, చివరికి ఆ రెండు నియోజకవర్గాలలోని దాదాపు సగం పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్‌కు ఎన్నికల సంఘం ఆదేశించాల్సి వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానం ఎన్నికల ప్రక్రియలో అంతర్భాగమైపోయిన నేటి పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ ప్రతిపాదన తిరోగమన చర్య అని పొలిట్ బ్యూరో పేర్కొంది. కాబట్టి ఎన్నికల నిబంధనలకు ప్రతిపాదించిన సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది.

రైతు నాయకుడు దల్లేవాల్ పరిస్థితి విషమం

(మొదటిపేజీ తరువాయి)

గురువారం ప్రధాని నరేంద్ర మోడీకి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. పంటలపై ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీతో సహా ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లను ఆమోదించాలని కేంద్రాన్ని ఒత్తిడి చేసేందుకు 70 ఏళ్ల దల్లేవాల్ నవంబర్ 26 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు.వైద్యుల సలహా మేరకు ఆదివారం నాడు వేదికపైకి రాలేదని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా ఒక ప్రకటనలో తెలిపారు.

మీకోసం
పప్పు డబ్బాల్లో పురుగు పట్టకుండా ఉండాలంటే, శుభ్రం చేసిన కొబ్బరిచిప్పలు అందులో ఉంచాలి.

జీవన సౌరభం
గెలవడంలో ఓడిపోవచ్చు. కానీ ప్రయత్నించడంలో ఓడిపోవద్దు.

భలే భలే బొమ్మలు

బొమ్మలండోయ్ బొమ్మలు
నిగనిగలాడే నిర్మల్ బొమ్మలు
కళకళలాడే కొయ్య బొమ్మలు
భలే భలే బుట్ట బొమ్మలు

బొమ్మలండోయ్ బొమ్మలు
ఆడుకునే ఆట బొమ్మలు
తళతళలాడే తోలు బొమ్మలు
చిట్టిపొట్టి చెన్నపట్నం బొమ్మలు

బొమ్మలండోయ్ బొమ్మలు
ముద్దొచ్చే మట్టి బొమ్మలు
బుల్లి బుల్లి బంగారు బొమ్మలు
దండం పెట్టే రంగుల బొమ్మలు

– బోనగిరి పాండురంగ,
83412 12132.

బుజ్జాయి

బుజబుజ రేకుల బుజ్జాయి
ఉంగా ఉంగా ఉజ్జాయి
బోసి నవ్వుల నవ్వోయి
ఊహల తేరు ఊగేనోయి!

నిత్య నిర్మల భూషితము
సతతం సనత్కుమార శోభితము
నిత్య నూతన భాషితము
సదా వదనం హసితము!

ఏమని పిలిచినా పలికేను
ఎత్తుకుంటే కొండంత ఎగిరేను
కన్నులు మూయక చూసేను
కన్నయ్య చేష్టను తలపించెను!

సొట్ట బుగ్గల పాపాయి
సోపతి గాల్లను పిలిచేను
బొమ్మరిల్లు ముద్దుగ కట్టెను
బొమ్మల కొలువు పెట్టేను!

అంద చందాల బుజ్జాయి
ఇంటికి వెన్నెలై వెలిగేను
అవనిలో ఉన్న ఈ హాయి
ఈడు పెరుగుచు విరిసేను!

– పి.బక్కారెడ్డి,
97053 15250.

నేను గీసిన బొమ్మ

భేరి మన్విక.
1వ తరగతి,
స్కూల్ అఫ్ వండర్ కిడ్స్,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నా బిడ్డ ఏం తప్పు చేశాడు?

మతం పేరుతో ఏడేళ్ల బాలుడిపై విద్వేష వ్యాఖ్యలు చేశారు. ఆ చిన్నారి తన టిఫిన్ బాక్సులో ఆహారం ఫ్రెండ్స్‌కి పెడితే మతం మార్పిడి చేస్తున్నాడంటూ దండించారు. అదేమని తల్లి ప్రశ్నిస్తే.. 'ఇలాంటి వారే రేపు గుళ్లపై రాళ్లు విసురుతారు. వాడితో పాటు మిగతా మీ ఇద్దరి బిడ్డలని కూడా ఇక్కడి నుండి తీసుకుపోండి. స్కూలు రికార్డుల నుండి వాళ్ల పేర్లు తొలగించేశాం' అని దారుణంగా మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ ఉదంతం జరిగింది. బిడ్డలపై ఇంతటి అమానుషం చేస్తుంటే ఆ తల్లి ఊరుకోలేదు. కోర్టుకెళ్లింది. నాలుగు నెలలు పోరాటం చేసింది. ఎన్నో అవమానాలు, బెదిరింపులు వచ్చాయి. అయినా వెనుదిరగలేదు. 'న్యాయం కావాల్సిందే' అని గట్టిగా నినదించింది. ఇటీవల డిసెంబరు 17న అలహాబాద్ హైకోర్టు ఆ పిల్లలకు అనుకూలంగా, ఆ తల్లికి సాంత్వనగా తీర్పు చెప్పింది. మతం ముసుగులో విద్వేషమూకల దాష్టీకాలకి అమాయకులు, మహిళలు బలౌతున్నా రని ఇప్పటివరకు అనుకున్నాం. ఇప్పుడు పిల్లలు కూడా ఆ జాబితాలో చేరిపోయారు. అసలు ఏం జరిగిందో తెలుసుకుందాం..

ఇరవై నాలుగేళ్ల సబ్రా, ఉత్తరప్రదేశ్ అమ్రోహా నివాసి. ముగ్గురు పిల్లలు. ఏడేళ్ల రిహాన్ చిన్నవాడు. అమ్రోహాలోని హిల్‌టన్ కాన్వెంట్ సూల్లో పిల్లలు చదువుతున్నారు. ఆ రోజు ఏం జరిగింది, ఆ తరువాత ఏయే పరిణామాలు జరిగాయో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

సెప్టెంబరు 2..

'ఆ రోజు స్కూలు నుండి నాకు ఫోను వచ్చింది. 'మీరు వెంటనే వచ్చి మీ రిహాన్ ఖాన్‌ని తీసుకెళ్లండి' అని చెప్పారు. నాకు చాలా కంగారు వేసింది. గాబరాగా స్కూలుకి వెళ్లాను. అప్పుడు నా రిహాన్ బిక్కుబిక్కు మంటూ స్కూలు కంప్యూటర్

రూమ్‌లో ఉన్నాడు. 'ఉదయం నుండి క్లాసులకు వెళ్లలేదని, ఇక్కడే ఉన్నాన'ని చెప్పాడు. అంటే ఐదు గంటలు వాడు అలా ఉండిపోయాడు. ఇంకా క్లాసు టీచర్ వాడ్ని కొట్టారని కూడా ఏడుస్తూ చెప్పాడు. ప్రిన్సిపాల్ తో మాట్లాడమని టీచర్లు చెప్పారు. ఆ సమయంలో అతను లేకపోవడంతో మరుసటి రోజు నేను స్కూలుకి వెళ్లాను' అని సబ్రా ఆ రోజు సంఘటన గురించి చెప్పారు.

సెప్టెంబరు 3..

సబ్రా ప్రిన్సిపాల్ అవినీష్ కుమార్ శర్మని కలిసింది. అతడు చెప్పిన కారణం విని ఆమె గుండెలు పగిలాయి. 'నీ కొడుకు స్కూలుకి నాన్ వెజ్ టిఫిన్ తీసుకొచ్చాడు. అందుకే స్కూలు నుండి పంపేశాం. వాడే కాదు.. వాడి అన్నలు కూడా ఈ స్కూల్లో చదవడానికి వీల్లేదు. వీడు ఇక్కడే ఉంటే మిగతా పిల్లలని ఇస్లాంలోకి రమ్మని చెబుతాడు. రేపు ఇలాంటి వాళ్లే గుళ్లపై రాళ్లు విసురుతారు' అని గట్టిగా అరుస్తూ చెప్పాడు. ఈ మొత్తం విషయాన్ని సబ్రా వీడియో రూపంలో తీసుకుంది. ఆ సమయంలో చిన్నారి రిహాన్ అక్కడే బిక్కుబిక్కు మంటూ నిలబడి ఉన్నాడు. ప్రిన్సిపాల్, తల్లి వాదోప వాదాలను వింటున్న వాడు అదేపనిగా ఏడుస్తున్నాడు.

సెప్టెంబరు 4న సబ్రా పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసింది. 'వాళ్లసలు నా ఫిర్యాదు తీసుకోలేదు. ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఆ తరువాత సెప్టెంబరు 6న జిల్లా విద్యాశాఖకి లేఖ రాశాను. అక్కడా నాకు న్యాయం జరగలేదు. సెప్టెంబరు 10 రాత్రి 7:30కి నన్ను పోలీస్ స్టేషనుకి పిలిపించారు. 10 గంటల వరకు అక్కడే ఉంచారు. ఆ సమయంలో ఎస్‌పి నాతో చాలా అనుచితంగా ప్రవర్తించారు. ప్రిన్సిపాల్ విషయంలో రాజీ పడకపోతే మా ఇంటిని బుల్డోజరుతో కూల్చేస్తామని బెదిరించారు. నాకేమీ అర్థం కాలేదు. నేను, నా పిల్లలు బాధితులం. కానీ మమ్మల్ని దోషులని చేసి మాట్లాడుతున్నారు. అందుకే ఈసారి నా బిడ్డల కోసం కోర్టు మెట్లు ఎక్కాను. సెప్టెంబరు 26న పిటిషన్ వేశాను' అని సబ్రా తనకు జరిగిన అవమానాలు, తదనంతర పరిణామాల గురించి చెప్పింది. అయితే ఈమధ్యలో సబ్రా తీసుకున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యి, అధికారులు రంగంలోకి దిగారు.

ప్రిన్సిపాల్ రూంలో జరిగిన ఉదంతం జిల్లా మెజిస్ట్రేట్ దృష్టికి వచ్చింది. విచారణ చేయమని కమిటీని నియమించారు. ముగ్గురు అధికారులు గల ఈ కమిటీ ద్వారా సబ్రాకి న్యాయం జరగలేదు. సెప్టెంబరు 9న వాళ్లు సమర్పించిన నివేదికలో ప్రిన్సిపాల్‌కి క్లీన్‌చిట్ ఇచ్చారు. మీడియా రిపోర్ట్‌ని బట్టి ఆ వీడియో ఉద్దేశపూర్వకంగా ప్రిన్సిపాల్‌ని ఇరికించాలని చేసిందని చెప్పారు. సబ్రా ముగ్గురు పిల్లలు ఏప్రిల్ నుండి ఫీజులు చెల్లించలేదని, ఫీజులు ఎగ్గొట్టాలని సబ్రా ఇదంతా చేసిందని ఆరోపించారు. అయితే ప్రిన్సిపాల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని చెబుతూ కంటితుడుపు చర్యలుగా అతనికి నోటీసులు జారీచేశారు. ఈ నివేదికను సబ్రా తీవ్రంగా వ్యతిరేకించింది. 'ఇదంతా అబద్ధం. ఫీజులు కట్టలేదనడానికి నా దగ్గర స్కూలు వాళ్లు పంపించిన ఒక్క నోటీసు కూడా లేదు. ఇన్ని రోజులు కట్టకుండా ఉంటే అదెలా సాధ్యం?' అని ప్రశ్నిస్తోంది.

'ఫీజులు చెల్లించనందుకు, పిల్లలను స్కూలు నుండి పంపించకుండా ఉండేందుకు, పాఠశాలపై ఒత్తిడి తెచ్చేందుకు సబ్రా ఆ వీడియో తీసింద'ని అధికారులు నిర్ధారించినట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి ఆ తరువాత చెప్పారు.

ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను స్కూలుకి పంపిస్తారా అని సబ్రాని అడిగితే, 'ఆ రోజు ప్రిన్సిపాల్ అన్న మాటలు నాకు ఇప్పటికీ గుర్తే. అతను నా పిల్లలపై చాలా ద్వేషం పెంచుకున్నారు. అలాంటి చోటుకి నా పిల్లలను ఎలా పంపుతాను. ముగ్గురు పిల్లలూ స్కూలుకి వెళ్లడానికి చాలా భయపడు తున్నారు. రిహాన్ అయితే స్కూలంటే చాలు ఏడుస్తున్నాడు. వాడు చదువులో చాలా చురుకుగా ఉంటాడు. అలాంటిది వాడు ఇప్పుడు స్కూలుకే వెళ్లనని మారాం చేస్తున్నాడు' అని సబ్రా చాలా దిగులుగా చెబుతోంది.

కోర్టు ఏం తీర్పు ఇచ్చిందంటే..

సబ్రా ఇచ్చిన పిటిషన్‌లో తన పిల్లలు వేరే స్కూల్లో చేరేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. అలాగే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని, అమ్రోహా జిల్లా విద్యాశాఖని ప్రిన్సిపాల్‌కి వ్యతిరేకంగా చర్యలు తీసుకోమని అభ్యర్థించింది. పోలీస్ స్టేషనులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కూడా అడిగింది. పిల్లలు కోల్పోయిన విద్యాసంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం నుండి పరిహారం అందించాలని కోరింది. డిసెంబరు 4న కోర్టు విచారణ చేపట్టింది. అయితే సబ్రా పిటిషన్‌ని రాష్ట్ర ప్రభుత్వ అదనపు అడ్వకేట్ జనరల్ వ్యతిరేకించారు. శర్మపై కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తీర్పు చెప్పమని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు డిసెంబరు 17న తీర్పు వెలువరించింది. జిల్లా మెజిస్ట్రేట్‌కి కచ్చితమైన ఆదేశాలు జారీచేసింది. ముగ్గురు పిల్లలకి రెండు వారాల్లో కొత్త స్కూల్లో అడ్మిషన్లు ఇవ్వాలని చెప్పింది. మెజిస్ట్రేట్ ఆర్డర్‌కి అనుగుణంగా అఫిడవిట్‌ని దాఖలు చేయకపోతే జనవరి 6న వ్యక్తిగతంగా అతను విచారణకు హాజరుకావాలని ఆంక్షలు విధించింది.

'విద్య.. పిల్లల ప్రాథమిక హక్కు. ఆహారం పేరు చెప్పి, పిల్లలను విద్యకు దూరం చేయడం క్షమించరాని నేరమ'ని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు బిడ్డల కోసం పరితపించిన ఆ తల్లిలో కొండంత ఆశని రేకెత్తించింది. 'రాజ్యాంగం హామీ ఇచ్చిన మన ప్రాథమిక హక్కులను పరిరక్షించేందుకు కోర్టులు ఉన్నాయి. అది రుజువు చేసేలా ఈ ఉత్తర్వులు సాక్ష్యంగా నిలుస్తాయ'ని సబ్రా తరపు న్యాయవాది ఆనందం వ్యక్తం చేశారు. మతం పేరుతో విద్వేష మూకలు సృష్టిస్తున్న అలజడిలో సబ్రా లాంటి ఎన్నో కుటుంబాలు అతలాకుతలమైపోతున్నాయి. న్యాయం జరిగేది కొందరికే.. బలౌతున్నది ఎందరో!

రంగవల్లి

11 చుక్కలు 6 వచ్చేవరకు (మధ్య చుక్క)

కాటిబోయిన చందన శ్రీ అంజని,
కడప,
90327 33415.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

పండగల వినోదం సిద్ధం

సినిమాలకు అతిపెద్ద సీజన్ సంక్రాంతి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా రాబోయే ఈ పండుగకు సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది. దానికంటే ముందు క్రిస్మస్ స్టార్స్‌కు ధీటుగా బాక్సాఫీసు వద్ద తళతళ మెరుపులతో ప్రేక్షకులకు వినోదం పంచేందుకు పలు సినిమాలు వరుస కట్టాయి. పుష్ప–2తోపాటుగా ప్రతి శుక్రవారం విడుదలవుతున్న చిన్నా, పెద్ద సినిమాలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతున్నాయి. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మొత్తం 10 వరకూ సినిమాలు విడుదలయ్యాయి. మరికొన్ని సినిమాలు విడుదల కానున్నాయి. వీటిలో ప్రముఖ హీరోలు, వర్ధమాన నటులు, డబ్బింగ్ చిత్రాలు సైతం ఉన్నాయి.

క్రిస్మస్ రేసులో మొదటి నుంచీ ఉన్న 'రాబిన్ హుడ్' సినిమా తప్పుకుంది. నటుడు నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఈనెల 25న విడుదల చేయాల్సి వుంది. మైత్రీ మూవీస్ నుంచి తెరకెక్కిన 'పుష్ప 2' ఇంకా థియేటర్లలో రన్ అవుతుండటం, మోహన్‌లాల్ 'బరోజ్' తెలుగు వెర్షన్‌ను ఇదే సంస్థ 25న విడుదల చేయనుండటం మరో కారణం. థియేటర్లలో కొరత ఏర్పడే ఛాన్స్ ఉందని రాబిన్‌హుడ్‌ను వాయిదా వేశారు.

'ముఫాసా' : ది లయన్ కింగ్' థియేటర్లలో సందడి చేస్తోంది. కొన్నాళ్ల క్రితం విడుదలై అలరించిన 'ది లయన్ కింగ్'కు ప్రీక్వెల్ ఇది. ఇందులోని ముఫాసా పాత్రకు మహేష్‌బాబు వాయిస్‌ను అందించారు. టిమెన్, పుంబా పాత్రలకు ఆలీ, బ్రహ్మానందం సంభాషణలు చెప్పారు. జంతుప్రేమ గురించి ఈ చిత్రంలో అద్భుతంగా చూపించారు.

కామెడీకి కేరాఫ్ అల్లరి నరేష్ సరసన అమృత అయ్యర్ నటించిన 'బచ్చలమల్లి' సినిమాకు సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహించారు. ఈనెల 20న విడుదలైంది. 1985లో తుని మండలం సురవరం గ్రామంలో కథ మొదలవుతుంది. చిన్నతనం, తండ్రిపై కోపం, జీవితాన్ని నాశనం చేసుకోవటం వంటి అంశాలు సాగుతుంటాయి. లవ్ స్టోరీ వచ్చాక సదరు హీరో మళ్లి కాస్త గాడిలో పడినట్లు చూపిస్తారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా నరేష్ పాత్రలో కామెడీ కాకుండా మొరటు తనాన్ని బాగానే ప్రదర్శించారు. కుటుంబ సంబంధాల గురించి సినిమాలో జొప్పించే ప్రయత్నం చేశారు.

'విడుదల–1'కు సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం 'విడుదల 2'. వెట్రిమారన్ దర్శకుడు. శుక్రవారం ప్రేక్షకులముందుకు వచ్చిన ఈ సినిమా బాగా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మహారాజా విజయోత్సవంతో ఉన్న విజయ్‌సేతుపతి ఖాతాలో మరో హిట్ మూవీగా ఈ సినిమా నిలిచింది. కానిస్టేబుల్ కుమరేశన్ (సూరి) ఇచ్చిన క్లూతో ప్రజాదళం నాయకుడు, నక్సల్ పెరుమాళ్ అలియాస్ మాస్టార్ (విజయ్‌సేతుపతి)ని పోలీసులు అరెస్ట్ చేయటంతో 'విడుదల 1' ముగిసింది. అక్కడి నుంచే రెండో పార్ట్ కథ మొదలైంది. పిల్లలకు పాఠాలు చెప్పే మాస్టారు పెరుమాళ్ జమిందారీ వ్యవస్థ చేస్తున్న ఆగడాలను అడ్డుకునే క్రమంలో దళ నాయకుడిగా ఎలా మారాడు? ఈ ఉద్యమ ప్రయాణంలో మహాలక్ష్మి

(మంజు వారియర్)తో పరిచయం, ప్రేమ తనని ఎటువైపు నడిపించింది. అహింసను ఇష్టపడే పెరుమాళ్ తన ఉద్యమాన్ని హింసాత్మక బాటలో నడిపించటానికి దారితీసిన పరిస్థితులేమిటి? నీతి నిజాయితీలతో ఉద్యోగ ధర్మం నిర్వర్తించే పెరుమాళ్‌ను పట్టించి నందుకు కానిస్టేబుల్ సూరికి ఎలాంటి ఫలితం దక్కిందనే ఆసక్తికర అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది.

మోహన్‌లాల్ స్వీయ దర్శకత్వంలో నటించిన చిత్రం 'బరోజ్'. ఫ్యాంటసీ కథతో తెరకెక్కిన ఈ చిత్రం నుంచి తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా ఈనెల 25న విడుదల కానుంది. వాస్కోడి గామా నిధిని కాపాడే జినీగా మోహన్‌లాల్ నటించారు. డ్రీమ్ ప్రాజెక్టుగా 'బరోజ్' చిత్రాన్ని తన సొంత నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ ఫిల్మ్ బ్యానర్‌పై ఆయనే నిర్మించారు. ఆంటోనీ పెరుంబావూర్ నిర్మాత.

ఎ, ఉపేంద్ర లాంటి వైవిధ్యమైన చిత్రాలతో ఇటు హీరోగా, అటు దర్శకుడిగా తెలుగు ప్రేక్షకులపైనా చెరగని ముద్రను వేశారు కన్నడ నటుడు ఉపేంద్ర. ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'యుఐ'. లహరి ఫిల్మ్స్, జి.మనోహరన్, వీనస్ ఎంటర్‌టైనర్స్ కెపి శ్రీకాంత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శుక్రవారంనాడు విడుదలైన ఈ సినిమా రొటీన్ కథలకు భిన్నంగా సాగింది. 'తెలివైన వారు మూర్ఖులుగా కనిపిస్తారు. మూర్ఖులు తెలివైన వారిలా నటిస్తారు' అని సినిమా ప్రారంభంలో ఉపేంద్ర స్క్రీన్ మీద వేసిన డైలాగ్ ఇది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను ఇందులో ప్రస్తావించారు. పొలిటికల్ సినారియోతో మొదలు పెట్టి కలియుగంలోకి తీసుకెళ్లారు. గ్లోబల్ వార్మింగ్, మైనింగ్, మెడిసిన్, రియల్ ఎస్టేట్ మాఫియాల భాగోతాల గురించి తెలియజేశారు.

దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. మనిషి భవిష్యత్తు అతడి చేతి రేఖల్లో ఉంటుందా? అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా సాగుతుంది. తన నమ్మకాలు, తను ఇష్టపడిన అమ్మాయి ప్రేమ మధ్య కొట్టు మిట్టాడిన ఓ యువకుడి కథే ఈ సినిమా. కామెడీకి పెద్ద పీట వేశారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ ప్రధాన పాత్రలు పోషించారు.

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మనవ రాలు బేబీసాయి తేజస్విని కీలక పాత్ర పోషించిన చిత్రం 'ఎర్రచీర : ది బిగినింగ్' సుమన్‌బాబు దర్శకత్వంలో యాక్షన్, మదర్ సెంటిమెంట్ అంశాలతో తెరకెక్కించారు.

గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మ్యాజిక్'. తమ కళాశాలలో జరిగే వేడుక కోసం సొంతంగా ఓ పాటని స్వరపర్చటానికి నలుగురు విద్యార్థులు చేసిన ప్రయత్నమే ఈ సినిమా కథాంశం. 'నాన్న' ఫేమ్ సారా అర్జున్ తదితరులు ఈ సినిమాలో నటించారు. శనివారం నాడు ఈ సినిమా విడుదలైంది.

కీర్తిసురేష్, వరుణ్‌ధావన్ కలిసి నటిస్తున్న చిత్రం 'బేబీజాన్'. ఈనెల 25న విడుదల కానున్న ఈ చిత్రానికి కాలిస్ దర్శకత్వం వహించారు. తమిళ్ మూవీ 'తేరి' కథలో కొన్ని మార్పులు చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

ఇన్‌స్టా రీల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ప్రీతి పగడాల, ఓ సింగింగ్ షో రన్నరప్ ప్రణవ్‌కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పతంగ్'. గాలిపటాలతో పోటీతో కొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రవీణ్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. ఈనెల 27న ఈ సినిమా విడుదల కానుంది.

రాజేంద్రరాజు కాంచనపల్లి రచన, దర్శకత్వ పర్యవేక్షణలో ప్రతాప్ భీమవరపు చేపట్టిన కొత్త ప్రాజెక్టు 'ఓ తండ్రి తీర్పు'. ఎవికె ఫిలింస్ బ్యానర్‌పై లయన్ ఆరిగపూడి విజయ్‌కుమార్ సమర్పణలో లయన్ శ్రీరామ్ దత్తి నిర్మిస్తున్నారు. వివరెడ్డి లీడ్‌రోల్‌లో నటిస్తున్నారు. ఈనెల 27న ఈ సినిమా విడుదల కానుంది.

అండర్-19 ఛాంపియన్ భారత్

మహిళల ఆసియా కప్ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై భారత్ గెలుపు

కౌలాలంపూర్ (మలేషియా) : మహిళల క్రికెట్‌లోనూ నవతరం అమ్మాయిలు అదరగొట్టారు. తొట్టతొలి మహిళల అండర్–19 ఆసియా కప్ చాంపియన్లుగా అవతరించారు. ఆదివారం కౌలాలంపూర్‌లో జరిగిన టైటిల్ పోరులో బంగ్లాదేశ్ అండర్–19పై భారత అమ్మాయిలు 41 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (52, 47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్) మెరుపు అర్ధ సెంచరీతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత అమ్మాయిలు 20 ఓవర్లలో 117/7 పరుగులు చేశారు. ఓపెనర్ కమలిని (5), సానిక (0), కెప్టెన్ నికి ప్రసాద్ (12) సహా ఐశ్వరీ (5) విఫలం అయ్యారు. కానీ మరో ఎండ్‌లో ఓపెనర్ త్రిష అదరగొట్టింది. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో చెలరేగిన త్రిష 47 బంతుల్లోనే 52 పరుగులు పిండుకుంది. టెయిలెండర్లు మిథిల వినోద్ (17), ఆయుశీ (10)ల సహకారంతో భారత్‌కు మంచి స్కోరు అందించింది. ఊరించే ఛేదనలో బంగ్లాదేశ్ అమ్మాయిలు చతికిల పడ్డారు. ఆయుశీ శుక్లా (3/17), సోనమ్ యాదవ్ (2/13), సిసోడియ (2/12) వికెట్ల వేటలో రెచ్చిపోవటంతో బంగ్లాదేశ్ 18.3 ఓవర్లలో 76 పరుగులకే కుప్పకూలింది. చోయ (18), ఫెర్డోస్ (22) మినహా బంగ్లా తరఫున మరో బ్యాటర్ రెండెంకల స్కోరు దాటలేదు.

విండీస్ విలవిల

211 పరుగుల తేడాతో ఘనవిజయం
భారత్ 314/4, వెస్టిండీస్ 103 ఆలౌట్

వడోదర: వెస్టిండీస్‌తో మూడు టి20ల సిరీస్‌ను 2–1 తేడాతో కైవసం చేసుకొని జోరుమీదున్న భారత్ మహిళల జట్టు అదే దూకుడుతో దూసుకుపోతోంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వడోదరలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. 211 పరుగుల భారీతేడాతో విండీస్ జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. 315 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ప్రత్యర్థి జట్టు కేవలం 26.2 ఓవర్లలో 103 పరుగులకే ఆలౌటైంది. ఫ్లెచర్ (24) టాప్ స్కోరర్. ఓపెనర్లు మాథ్యూస్ (0), జోసెఫ్ (0) డకౌట్‌గా వెనుదిరిగారు. భారత్ బౌలర్లలో రేణుక ఠాకూర్ సింగ్ 5 వికెట్లు పడగొట్టి విండీస్ జట్టును దెబ్బతీసింది. ప్రియా మిశ్రా 2, సాధు ఒక వికెట్ తీశారు.

విజృంభించిన స్మృతీ మంధాన

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 314 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతీ మంధాన (91: 102 బంతుల్లో 13 × 4), ప్రతీకా రావెల్ (40: 69 బంతుల్లో 4 × 4) తొలి వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. వరుస బౌండరీలతో విండీస్ జట్టును బెంబేలెత్తించారు. భీకరంగా మారిన ఈ జోడీని మాథ్యూస్ విడగొట్టింది. ఆమె బౌలింగ్‌లో ప్రతీకా కాట్ అండ్ బౌల్డ్‌గా వెనుదిరిగింది.

తొలి డౌన్‌లో వచ్చిన హర్లీన్ డియోల్ (44)తో కలిసి స్మృతి ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. అయితే, జట్టు స్కోరు 160 పరుగుల వద్ద జేమ్స్ బౌలింగ్ స్మృతి ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు చేరింది. అనంతరం హర్మన్ ప్రీత్ కౌర్ (34), రిచా ఘోష్ (26), రోడ్రిగ్స్ (31), దీప్తి శర్మ (14) దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. విండీస్ బౌలర్లలో జేమ్స్ 5 వికెట్లు పడగొట్టగా కెప్టెన్ మాథ్యూస్ 2, డాటిన్ ఒక వికెట్ తీశారు.

రోహిత్

రోహిత్‌కు గాయం?

- ప్రాక్టీస్‌లో మోకాలికి దెబ్బ
- ఆకాశ్ దీప్‌కు సైతం గాయం

మెల్‌బోర్న్ : బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ బాక్సింగ్ డే టెస్టు ముంగిట టీమ్ ఇండియాకు గాయం ప్రమాదం పొంచి ఉంది!. మెల్‌బోర్న్‌లో నెట్స్‌లో సాధన చేస్తుండగా రోహిత్ శర్మ, ఆకాశ్ దీప్‌లకు గాయాలు అయ్యాయి. ఎటువంటి ఆందోళన అవసరం లేదని ఫిజియో తెలిపినా.. సిరీస్ గమనాన్ని నిర్దేశించే టెస్టు మ్యాచ్ ముందు టీమ్ ఇండియా అప్రమత్తంగా ఉండక తప్పదు.

ఆకాశ్ దీప్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

సత్యమేవ జయతే

వ్యవసాయం మరియు
రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం

ఈ సందర్భంగా

జాతీయ రైతు దినోత్సవం'

వీరి జయంతి

భారతరత్న చౌదరి చరణ్ సింగ్

కృతజ్ఞతతో కూడిన దేశం గొప్ప నివాళులు అర్పిస్తుంది

విత్తనం నుండి మార్కెట్ వరకు, రైతుల కోసం భారత ప్రభుత్వం యొక్క అంకితమైన ప్రయత్నాలు

- వ్యవసాయ మంత్రిత్వ శాఖ బడ్జెట్ 2014-15లో సుమారు రూ.22 వేల కోట్ల నుండి 2024-25 నాటికి రూ. 1.22 లక్షల కోట్లకు 5 రెట్లు పెరిగిందిబీ వ్యవసాయాన్ని ఆధునికంగా మరియు రైతులను సంపన్నంగా మార్చడం
- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 3.48 లక్షల కోట్ల రూపాయల పంపిణీతో రైతుల జీవితాలను మెరుగుపరిచేందుకు సహాయపడింది.
- ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు 1,70 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందింది.
- సస్టైనబుల్ ఇన్ కమ్ ఇనిషియేటివ్ రైతుల జీవనోపాధిని పెంపొందించడం మరియు వారి ఉత్పత్తులకు సరసమైన ధరలను నిర్ధారించడం లక్ష్యంగా 2 లక్షల కోట్ల రూపాయలను MSP కోసం కేటాయించింది.
- ప్రధానమంత్రి-ఆశా యోజన కింద, రూ.35,000 కోట్ల కేటాయింపు రైతులకు లాభసాటి ధరలను అందిస్తుంది.
- రూ.1 లక్ష కోట్ల ఆర్థిక వ్యయంతో, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (AIF) రైతులకు ప్రయోజనం చేకూర్చే ఆధునిక వ్యవసాయ మౌలిక సదుపాయాల కోసం 2 కోట్ల రూపాయల వరకు రుణ హామీలను అందిస్తుంది.
- రైతుల ఖర్చులను తగ్గించడానికి 109 అధిక దిగుబడినిచ్చే మరియు వాతావరణాన్ని తట్టుకోగల పంట రకాలను విడుదల
- రైతులకు పంట దిగుబడిని పెంచేందుకు 24.60 కోట్ల సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ
- పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం మైక్రో ఇరిగేషన్ కింద దాదాపు 95 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది
- 9,000 పైగా ఎఫ్‌పిఓలు నమోదు చేయబడ్డాయి, 23 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు.
- ఇ-నామ్ పోర్టల్‌లో 1,410 మండీల నమోదు వ్యవసాయ రంగానికి కొత్త ప్రోత్సాహాన్ని అందిస్తుంది.
- నమో డ్రోన్ దీదీ పథకం, రూ.1,261 కోట్ల కేటాయింపుతో 15,000 మంది మహిళా ఎస్‌హెచ్‌జిలను స్వావలంబనగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 1,000 డ్రోన్లను పంపిణీ చేశారు.

CBC 01102/13/0006/2425

"అనేక దశాబ్దాల క్రితం, చౌదరి చరణ్‌సింగ్ గారు దేశం పురోగతిని స్వీకరించడానికి మరియు మార్పుతో ముందుకు సాగడానికి ప్రేరేపించారు. రైతుల పురోభివృద్ధి యావత్ దేశ ప్రగతికి హామీ ఇస్తుందని కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది."

-నరేంద్ర మోదీ



భారత్ కా అన్నదాత, భారత్ కా భాగ్య-విధాత

ఈరోజు రాత్రి 8 గం.కు డీడీ కిసాన్‌లో ప్రత్యేక రైతు దినోత్సవ కార్యక్రమాన్ని చూడండి | किसान

ఇందులో అనుసరించండి @AgriGoI

పీఎం-కిసాన్ హెల్ప్‌లైన్ నెం. 155261

పీఎం-కిసాన్ హెల్ప్‌డెస్క్ https://pmkisan.gov.in/Grievance.aspx

మరిన్ని వివరాల కోసం దయచేసి QR కోడ్‌ని స్కాన్ చేయండి

QR కోడ్‌ని స్కాన్ చేయండి మరియు వాట్సాప్ ఛానెల్‌లో చేరండి